# శ్రీ లలితాష్టోత్తర రహస్యార్థము



బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

## 1. శ్రీమాతా 2. శ్రీమహారాజ్ఞీ 3. శ్రీమత్సింహాసనేశ్వరీ

ఇవి సహస్రనామాలలోనే గాక మన అష్టోత్తర నామాలలో కూడా మొదట వచ్చే నామాలు. ఇవి మూడూ ప్రపంచ సృష్టి స్థితి లయాలను తెలుపుతున్నాయి మనకు. మాతా అనేది సృష్టిని - రాజ్ఞిని అనేది స్థితిని - సింహాసనేశ్వరి అనేది లయాన్ని. మొదటి రెండింటిలో కాకపోయినా మూడవదైన సింహాసనేశ్వరిలో ఒక సందేహం - అది లయం అని ఎలా చెబుతున్నదని. సింహాసన అంటే సింహాసనం మీద కూర్చొని ఈశ్వరి అంటే జగత్తును పాలించేదని అర్థం వస్తున్నది. ఇది మహారాజ్ఞి చేసే క్రియే గదా. ఇక సంహారమనే భావమెక్కడ ఉంది. అందుకే దానికర్థం అలా చెప్పగూడదు. సింహమంటే హింసించేదని అర్థం. అసనమంటే కబళిచటం . సింహం లాగా హింసించి ఈ మొత్తం ప్రపంచాన్నే కబళించి పారేయటానికి ఈశ్వరి అంటే సమర్థమైనదని అర్థం చెప్పుకోవలసి ఉంది. అప్పటికి సంహారాన్నే చెప్పినట్లవుతుంది.

ఈ విధంగా సృష్టి స్థితి సంహారాలనే మూడు పనులూ చేస్తున్నదా దేవి అని వర్ణించటం వల్ల ఒక ఘటానికి మృత్తిక లాగా ఆవిడే ఈ విశ్వానికంతా ఉపాదాన కారణమవుతున్నది. ఉపాదానం గనుకనే ఘటం మృత్తికకు వేరుగా లేనట్లు ఈ విశ్వం కూడా ఆ శక్తికి వేరుగాదని బోధపడుతున్నది. అంతేకాదు. శక్తి అనేది స్వతంత్ర కాదని చెప్పాము. అది శివతత్త్వాన్ని ఆశ్రయించి చిద్రూపిణిగానే ఉంటుంది. కనుక ఒక మృత్తిక లాగా ఉపాదానమే కాక చేతనుడైన కులాలుడి లాగా అది ఈ ప్రపంచానికి నిమిత్తకారణం కూడా. అంచేత శక్త్యాత్మకమే ఇక ఈ కనిపించే ప్రపంచమంతా.

శక్త్యాత్మకం గనుకనే శక్తి అనే దృష్టితోనే చూడాలి ఏ పదార్థం చూచినా మనమిందులో. మూడు నామాలలోనూ మాతా మహారాజ్ఞి సింహాసనేశ్వరీ అనేవి ఎక్కడికక్కడ మారిపోతున్నా శ్రీ అనే మొదటి అక్షరం అలా మారటం లేదు. మూడింటిలోనూ కలిసి వస్తూనే ఉంది . దీని మూలంగా మనమర్థం చేసుకోవలిందేమని. ప్రపంచం ఎప్పటికప్పుడు వస్తూపోతూ ఉంది గనుక అది మిధ్యా భూతం. దానికధిష్ఠానమైన చైతన్య శక్తి నిలకడగా ఉండేది గనుక అదే సత్యమైన పదార్థం.

కనుక సృష్టి స్థితి లయాత్మకమైన సంసారంగా కాక దీన్ని మనం దీనికి అధిష్ఠానమైన శ్రీ రూపంగా లేదా శక్తి రూపంగానే భావన చేయవలసి ఉంది. భావన చేసే కొద్దీ అది మనలను అవశ్యంగా ఆ శివసన్నిధికే చేరుస్తుంది. సందేహం లేదు. శ్రీ అనే మాటకు శ్రయించటం లేదా ఆశ్రయించటం అని అర్థం. శివచైతన్యాన్ని శక్తి ఎపుడూ ఆశ్రయించే ఉంటుంది. విడిచి ఉండదు. అందుకే శ్రీ అనే పేరు దానికి సార్థకంగా ఏర్పడింది. తాను చైతన్యాన్ని ఆశ్రయించి ఉంది గనుకనే సాధకులైన వారిని కూడా ఎప్పుడో ఒకప్పుడు అది చైతన్యాశ్రితులనే చేయగలదు. ఈ శక్తి బ్రహ్మ విద్యే గాని మరేదీ కాదు. శివరూపమైన బ్రహ్మతత్త్వాన్ని ఆశ్రయించి ఉన్నదది. విద్యచేతనే వేద్యమనేది పొందగలడు మానవుడు. వేద్యం ఈ జీవితానికి శివతత్త్వమేనని గదా వర్ణించాము. దానిని ఆశ్రయించిన శ్రీ రూపిణి అయిన ఈ విద్యయే మనకది ప్రసాదించగలదు. కనుకనే శ్రీవిద్య అనేది వైదికమైన బ్రహ్మ విద్యే అని గుర్తించాలి మనం. తాంత్రికులు భావిస్తున్నట్టు బ్రహ్మ విద్యకు వ్యతిరిక్తమైన మరేదో విద్య కాదిది.

మరొకచిత్రమేమంటే ఈ మూడు నామాలలోనూ శ్రీ అనే అక్షరానికి ప్రక్కన మకారం చేర్చి చెప్పటం. తన్మూలంగా ఈ నామాల నుచ్చరించేటపుడు శ్రీం శ్రీం అని మకారధ్వని చెవిలో పడుతున్నది. అది మనకు పంచదశీ విలక్షణమైన షోడశిని గుర్తుచేస్తున్నది. ఇది హయగ్రీవుడు బుద్ధి పూర్వకంగానే కల్పించినట్టు తోస్తున్నది. లేకుంటే రాజ్ఞి అనక మహారాజ్ఞి అనటం సింహాసనేశ్వరీ అనక శ్రీమత్ సింహాసనేశ్వరి అనటం జరిగి ఉండదు. మకార ధ్వని మనకు వినపడాలనే మూడింటిలోనూ శ్రీ ప్రక్కన మకారాన్ని ప్రయోగించాడాయన. శ్రీం అనేది షోడశీ రూపమైన మంత్రాక్షరం. అది బ్రహ్మ విద్యకు పర్యాయం. ఈ అక్షరం అక్షరమైన బ్రహ్మతత్త్వాన్నే మనకు సూచిస్తున్నదిక్కడ. యయా తదాక్షరమధిగమ్యతే అని ముండకోపనిషత్తు చెప్పిన పరవిద్య మనకీ మాటలో తేటపడుతున్నది. బ్రహ్మాకారమైన వృత్తినే ఈ శ్రీ శబ్దం సూచిస్తున్నది. అది కూడా ఒకసారి గాదు. శ్రీ శ్రీ శ్రీ అని మూడు మార్లు సూచిస్తున్నది. మనసా వచసా కర్మణా - త్రికరణాలతోనూ ఆ బ్రహ్మ విద్యను పట్టుకోవాలని ఆశయం. అలా త్రికరణ శుద్ధిగా పట్టుకొన్నప్పుడే త్రిగుణీకృతమైన ఫలాన్ని మనకందిస్తుంది. కనుకనే ఆదిలో ఈ అభిప్రాయాన్ని మూడు మార్లు ఎలా సూచించాడో అంతంలో కూడా అలాగే సూచించాడు హయ గ్రీవుడు. నామావళి చివర కూడా చూడండి మూడు మార్లు వస్తుంది ఈ శ్రీ శబ్దం. శ్రీ చక్ర రాజ నిలయా- శ్రీమత్త్రిపుర సుందరీ - శ్రీ శివా. ఈవిధంగా స్తోత్రానికి ఆద్యంతాలలో శ్రీ శబ్దాన్ని మూడు మార్లు ప్రయోగించటం ద్వారా శ్రీ విద్యకు బ్రహ్మ విద్యకు ఏ మాత్రమూ తేడా లేదని- బ్రహ్మ రూపమైన శివసాయుజ్యాన్ని అదే మనకు ముమ్మాటికీ ప్రసాదించే ఏకైకమైన ఆలంబమని మహర్షి

మనకు భంగ్యంతరంగా చాటి చెబుతున్నాడు. శ్రీ విద్యకు గల ప్రాధాన్యాన్ని కూడా మనకు ధ్వనింపజేస్తున్నాడు.

## 4. చిదగ్ని కుండ సంభూతా

బ్రహ్మవిద్యా రూపిణి అయిన శక్తే శివసాయుజ్య ప్రాప్తికి ఆలంబనమని నిర్ధారణ చేయటంలో ఏమిటి ఉపపత్తి అని అడిగితే దానికి ఈ నామం సమాధానం చెబుతున్నది. శక్తి అనేది చిదగ్నికుండ సంభూత. చిదగ్ని కుండమంటే అగ్ని కుండంలాంటి చైతన్యమని అర్థం. చైతన్యమే రాశీ భూతమైతే అదే అగ్నికుండం. దానికే శివమని నామాంతరం. అలాంటి శివచైతన్యంతో సంభూతా అంటే అవినాభూతంగా ఏకమై ఉన్నదేదో అది చిదగ్ని కుండ సంభూతా. ఒక్క క్షణం కూడా చైతన్యాన్ని ఎడబాయందాశక్తి. అలా ఎడబాయటం సంభవం కూడా కాదు. అలాగే అయితే అది జడత్వాన్ని పొందవలసి వస్తుంది. జడానికి చైతన్య స్పర్శ లేకుంటే అది అప్రమాణమవుతుంది. ప్రమాణానికి ఏది గోచరించదో అది ఉందని చెప్పలేము. ఆకాశం మొదలు భూమండలం వరకూ ఏ ఒక్క పదార్థం గాని ప్రమాణం చేతనే సిద్ధించవలసి ఉంది. చైతన్యమొక్కటే ప్రమాణంకోరని స్వతసిద్ధమైన పదార్థం. కారణమేమంటే అదే అన్నింటికీ ప్రమాణం. అంచేత శక్తి కూడా సిద్ధించాలంటే స్వతసిద్ధమైన చైతన్యాన్ని వదలి దూరం పోరాదు. దానితో అవిభక్తంగానే బ్రతుకు సాగించాలి. అదే సంభూతా అనే మాట మనకు సూచిస్తున్నది. సంభవమంటే జన్మించటమని కొందరర్థం చెబుతారు. అది పొరబాటు. సంభవమనే మాటకు అసలైన అర్థం కలయిక. లాక్షణికమైన అర్థమే జన్మ అనేది. ఇక్కడ ముఖ్యార్థంలోనే ఈ మాటకు మనం అర్థం చెప్పుకోవలసి ఉంది.

# 5. చిదేక రస రూపిణీ

చైతన్యం శక్తి అని రెండు మాటలు దొరలే సరికి రెండు వస్తువులున్నవేమో నని ఒక భ్రాంతి ఏర్పడవచ్చు చాలా మందికి. అలాంటి భ్రాంతి ఎవరుగాని పరవిద్యావిషయంలో పెట్టుకోరాదు. ఎందుకంటే వస్తువనేది ఇక్కడ ఒక్కటే. చైతన్యమైనా అదే. శక్తి అయినా అదే. చైతన్యానికి చెందినదే గనుక శక్తి దానికెప్పుడూ భిన్నంకాదని చెబుతూనే వచ్చాము. ఆ భావాన్నే ఈ నామం మనకు చక్కగా బయటపెడుతున్నది. రసమనగా స్వభావం. ఏకరసమంటే ఒకే స్వభావం. చిత్తంటే సైతన్యం, చైతన్యానికి ఏది స్వభావమో అదే దాని శక్తికి కూడా స్వభావమని అర్థం. చైతన్య స్వభావం కాక వేరొక స్వభావం అంటూ దానికి లేదు. కాబట్టి చైతన్యమొకటి శక్తి ఒకటి రెండు వస్తువులని భ్రమపడరాదు . రెండు మాటలు చెవిన బడుతున్నా రెండూ కలిసి చెప్పే అర్థం ఒక్కటే. అగ్ని జ్వాలా అనటం లాంటిదిది. అగ్నీ జ్వాలా అగ్నియే గాని వేరుగాదు. అయినా అగ్ని అని జ్వాల అని రెండుమాటలు వినిపిస్తుంటాయి. రెండు మాటలే గాని ఒక్కటే అర్థం. అందులో జ్వాలా అనేది నామమాత్రమే. వస్తుతః అది అగ్ని తత్త్వమే. అగ్నియే ఒకప్పుడు అగ్ని అని ఒకప్పుడు జ్వాల అని పేర్కొనబడుతున్నది. అలాగే అక్కడ అగ్ని లాగా చైతన్యమనే ఒకే ఒక తత్త్వం చిత్తని చిచ్ఛక్తిఅని రెండు విధలుగా వ్యవహరించబడుతున్నది. అగ్నికి జ్వాలలాగే చిత్తుదే చిచ్ఛక్తి. శక్తి శక్తిమంతులకు భేదంలేదని ముందే పేర్కొన్నాము. లేదు గనుకనే శక్తి అని వ్యవహరిస్తున్నా అది వస్తుతః చిద్రూపిణే. దానికదనంగా మరిప రూపమూ దానికున్నట్లు మనం అపోహ పడరాదు. చైతన్యమే శక్తి అని కూడా భావిస్తూపోవాలి సాధకుడు.

## 6. అప్రమేయా

చిదేకరూపిణే గనుక ఆశక్తి ప్రమేయ గాదు. అప్రమేయ. ప్రమేయుగానిదేదో దానికప్రమేయ అని పేరు. ప్రమాణానికి గోచరించేది ప్రమేయ. లోకంలో ఏ వస్తువైనా సరే ఏదో ఒక ప్రమాణానికి గోచరించవలసిందే. ప్రమాణానికి గోచరించని దానికి అస్తిత్వం లేదు. అస్తి అని చెప్పావుంటేనే అది ఏదో ఒక ప్రమాణంతో తెలుసికొని తెప్పవలసి వస్తుంది. చూడండి ఘటముంది పటముంది అని ప్రతిఒక్కడనిని ఉంది ఉంది అని వాటి అస్తిత్త్వాన్ని గ్రహిస్తున్నాము. దేనితో గ్రహిస్తున్నాము. కంటితో చూచి- చెవులతో విని- చర్మంతో స్పృశించి- ఇలాగే గదా గ్రహిస్తున్నాము. చక్షురాదులైన ఈ ఇంద్రియాలే ఘటపటాదులున్నాయని చెప్పటానికి ప్రమాణాలవుతున్నాయి. వీటికే ప్రత్యక్ష ప్రమాణమని పేరు. అలాగే దూరంగా ఒక పర్వతం మీద ధూమం పైకి లేవటం చూచి అక్కడ అగ్ని ఉందని మనం చూడక పోయినా దాని అస్తిత్వాన్ని మనం నిశ్శంకంగా చాటి చెబుతాము. చూడకుండా ఉందని ఎలా చెప్పగలిగాము. ఏది చూచావెూ దాని బలంతో చెప్పగలుగుతున్నాము. చూస్తున్నదేదక్కడ. ప్రత్యక్షమైన ధూమం. దాని బలంతో అగ్నిని ఊహిస్తున్నాము కాబట్టి దీనికనుమాన ప్రమాణమని పేరు. మానమంటే ప్రమాణానికి మరొక పేరు. ప్రత్యక్షమైన చక్షురాది ప్రమాణాన్ని అనుసరించి ఏర్పడుతుంది గనుక ఈ ప్రమాణానికి అనుమానమని పేరు వచ్చింది.

ఇంతకూ ప్రత్యక్షానుమానాలనేవి రెండే వస్తుతః మనకున్న ప్రమాణాలు. ఇవి రెండే మనకు నిసర్గ సిద్ధమైనవి. చక్షురాదులైన

బాహ్యేంద్రియాలు ఐదు. మనస్సనే అంతరింద్రియమొకటి. ఇవి రెండూ మనకు ఆజన్మసిద్ధమే గదా. ఇందులో మొదటిది ప్రత్యక్షమైతే రెండవది అనుమానమని పేర్కొన్నాము. మొదటి దానితో పర్వతం మీద ఉన్న ధూమాన్ని చూచి తెలుసుకొంటే రెండవదానితో అగ్నిని ఊహించి తెలుసుకొంటున్నాము. ప్రపంచంలో ఏజ్ఞానమైనా ఈ రెండింటి ద్వారా కలగవలసిందే.

ప్రస్తుత విషయంలో ఈ రెండు ప్రమాణాలూ పనిచేయటం లేదు. చిచ్ఛక్తి ఒకటి ఉన్నట్టు ప్రత్యక్షమూ చెప్పలేదు మనకు. అనుమానమూ చెప్పలేదు. కారణమేమంటే అది ప్రమేయం గాదు. ప్రత్యక్షానుమానాలకు రెండింటికీ విషయం కాదని అర్థం. ప్రమాణ విషయం కాకపోతే అది ఉన్నదని ఎలా నిరూపించగలమని ప్రశ్నవస్తుంది. ప్రమాణం పనిచేయక పోయినా దాని అస్తిత్వానికేలాటి ప్రతిబంధకమూ లేదు. ఏచేతనంటే అది ప్రమాణ రూపమే. ఏది నీవు ప్రమాణమంటున్నావో- అది ప్రత్యక్షమే గావచ్చు అనుమానమే గావచ్చు- రెండూ కూడా వాస్తవంలో చైతన్యమే గాని మరేమి కావు. చైతన్యమంటే జ్ఞానమే. జ్ఞానానికే గదా ఏదైనా గోచరించవలసింది. జ్ఞానమే చక్షుస్సు ద్వారా ప్రసరించి బాహ్యమైన వస్తుజాలాన్నీ- చిత్తం ద్వారా ప్రసరించి ఆంతరమైన సుఖదఃఖాదులనూ- ప్రతిఒక్క ప్రమేయాన్నీ ప్రమాణమై గ్రహిస్తున్నది. జ్ఞానం లేకపోతే కన్ను పనిచేయదు. చెవులు పనిచేయవు. మనసు పనిచేయదు. అవిపనిచేస్తున్నాయంటే వాటి ద్వారా పనిచేస్తున్నది జ్ఞానమే కనుక అదే ప్రమాణం. అలాంటి దానిని తెలుసుకోటానికి మరొక ప్రమాణంతో నిమిత్తమేముంది. దీపానికి దీపమక్కర లేనట్టే ప్రమాణానికి ప్రమాణం అక్కర లేదు. ఉందని చెబితే కర్మ కర్తృత్వ

దోషమనేది వచ్చి పడుతుంది. ఒకపదార్థం దానికదే కర్త దానికదే కర్మ కాలేదు. అగ్ని ఎంత కాల్చేదైనా తన్ను తాను కాల్చుకోలేదు గదా. అలాగే ఇక్కడ కూడా చైతన్యమనేది బాహ్యమైన ఘటపటాదులను గాని ఆభ్యంతరమైన సుఖదుఃఖాదులను గాని గ్రహించవలసిందే గాని తనకు తానే ప్రమాణమై తన స్వరూపాన్ని తానే ప్రమేయంగా చూడలేదు. అందుకే ఆ శక్తికి అప్రమేయ అనే పేరు సార్థమయింది.

## 7. స్వప్రకాశా

నిజమే గాని అప్రమేయమైతే అది ఉందని దానికస్తిత్వం చెప్పటమెలాగ అని మరలా ఒక అభియోగం ఏర్పడుతుంది. ఎందుకంటే ప్రమాణానికి గురి గాకుండా ఏ ఒక్కటీ సిద్ధించదని మీరే గదా సిద్ధాంతం చేశారు. ఘటపటాదులలోనూ సుఖదుఃఖాదులలోనూ అదే గదా మనం చూచిన వ్యవహారం. అలాంటప్పుడు ఆ సూత్రమే సర్వత్రా వర్తించ వలసి ఉంటుంది. అంటే అర్థం శక్తి అనే దానికి కూడా అస్తిత్వం ఏదో ఒక ప్రమాణం వల్లనే ఏర్పడవలసి ఉంది. కాని ప్రమాణానికి అది అవిషయమని మీరే తీర్మానించారు. అలా అవిషయమైతే అది అప్రమాణమే అవుతుంది. అప్రమాణమైనది ఎలా సిద్ధించగలదు- అని ప్రశ్న.

అప్రమాణమైతే సిద్ధించని మాట వాస్తవమే గాని అది మనకు ప్రమేయమైన వస్తువుల విషయంలోనే అనే సత్యం మనం మరచిపోరాదు. ప్రమేయమైనది కాదీ శక్తి. ఇది ప్రమేయాలనన్నింటినీ గుర్తించే ప్రమాణమేనని చెప్పాము. ప్రమాణం చైతన్యమే అయినప్పుడు దానికిక ప్రమాణంతో అవసరమేముంది. అవసరం లేకపోతే దానికస్తిత్వం ఎలా

సిద్ధిస్తుందని గదా ప్రశ్న. దాని అస్తిత్వాన్ని అదే గ్రహించగలదు. ప్రపంచమంతా ఇది అనే జ్ఞానానికి గోచరిస్తే- అది ఒక్కటీ నేను నేను అనే జ్ఞానానికి గోచరిస్తుంటుంది. అలా తన జ్ఞానానికే తాను స్ఫురిస్తుంటుంది గనుక దానిని స్వప్రకాశమని పేర్కొన్నారు. స్వ అంటే తనకు తానే ప్రకాశమంటే స్ఫురించటమని అర్థం. అది కర్మ కర్తృత్వ దోషమని కూడా మనం సందేహించనక్కరలేదు. అగ్ని అంటే కాలటం కాల్చటం రెండూ గ్రహించలేని జడపదార్థం కాబట్టి తనలో జరిగే ఏ వ్యవహారమూ తాను గుర్తించలేదు. ఇది అలా కాక చైతన్యరూపమైన మహా శక్తి కనుక నాకు నేనున్నానని- నేనున్నట్టు నాకు స్ఫురిస్తున్నదని తన స్ఫూర్తితో తానుండగలదు. అలా ఉన్నప్పుడే అది స్వతస్సిద్ధమనిపించుకోగలదు. తనకు తానే ప్రమాణమైనా ప్రమేయమైనా. ఇందులో మిగతా ప్రమేయాలలాంటిది కాదని చెప్పటానికి అప్రమేయు అన్నారు. తనకు తానే ప్రమేయమవుతున్నది గనుక స్వప్రకాశ అన్నారు.

## 8. సర్వగా

ఈ విధంగా ప్రమాణమూ ప్రమేయమూ రెండూ తానే అయి ప్రకాశించటమనేది చైతన్యానికి తప్ప మరి దేనికి గాని సంభవం కాదు. నేను అని భావించగలిగినదేదో దానికే సంభవం. అలాభావించ గలిగింది ఒక్క చైతన్యమే. అచేతనమైన ఆకాశాది భూతజాతమేదీ నేనున్నానని తన అస్తిత్వాన్ని తాను స్మరించలేదు. కనుకనే తన అస్తిత్వం కోసం మరొక ప్రమాణం మీద అవి ఆధారపడక తప్పటం లేదు. అలాంటి ప్రమాణం ఈ చైతన్యమే గాని మరొకటి లేదని ఇంతకు ముందే నిర్ణయించాము. చైతన్యమే ఇది ఆకాశమని ఇది వాయువని మనకు తెలుపుతున్నది. అది

తృప్తే తప్ప సమ్యగ్జ్ఞానానికి పూర్తిగా ఉపయోగపడుతుందనే తృప్తి కలగదు మనకు.

అంచేత లోకంలో మోక్షపురుషార్థాన్ని మనసారా అపేక్షించే సాధకులందరికీ శివాత్మ జ్ఞానమనేది ఎలా ఏర్పడాలో- ఎన్ని నామాలను ఏ క్రమంలో భావిస్తే అది ఏర్పడుతుందో- అన్ని నామాలనే గ్రహించి వాటిని రహోయాగక్రమానికనుకూలంగా మలచుకొంటూ వచ్చాను. యాదృచ్ఛికంగా అవి అష్టోత్తర శతమే కావటమొక విశేషం. అష్టోత్తరమైనా ఇది నా స్వకపోల కల్పితం కాదు. సహస్ర నామాలలోనివే కాబట్టి వాటిలాగ ఇవి మనకు ప్రామాణికమే . నేనీ నామావళి పరమార్థాన్ని మొదట సంస్కృత భాషలోనే వ్రాసి ప్రకటించాలని సంకల్పించాను. అందులోనే గ్రంథాన్ని వ్రాసి పూర్తి చేశాను కూడా. కాని అలాగే దాన్ని ప్రకటిస్తే చాలా మంది తెలుగువారికది అర్థం కాదేమో నని దానినే మరలా తెలుగులోకి అనువదించి ప్రస్తుతం మీకు వివరించి చెబుతున్నాను. ఇది మీకు చేస్తున్న వివరణమని నేను భావించటం లేదు. ఈ నెపంతో బహుకాలం నుంచి నా హృదయంలో దాగి మరుగు పడిన శివశక్తి సామరస్య జ్ఞానాన్ని నాకు నేనే వివరించుకొంటున్నానని తమ కందరికీ సవినయంగా మనవి చేస్తున్నాను.

ఇతి

శివశక్త్యుత్సంగ లాలితః

శ్రీనివాస మహా గణేశః.



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# శ్రీ లలితాష్టోత్తర రహస్యార్థము

ప్రణేత

తత్త్వార్థ బోధక, పరమశివారాధక

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

ప్రకాశకులు :

చిట్టా కృష్ణబ్రహ్మాం

మానవమందిరం రోడ్, భవానీపురం,

విజయవాడ - 520 012.

Brahmasri
Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# ముఖావలోకనము

లలితాష్టోత్తర రహస్యార్థమని ఈ గ్రంథానికి నేను పెట్టినపేరు. లోకాన తీత్య లలతే లలలితా తేన సోచ్యతే. లోకాలన్నిటికీ అతీతమైనదేదో అది లలిత. అలాటి దేవీస్వరూపాన్ని బోధిస్తుందీ గ్రంథం . దేవనమంటే ప్రకాశమనీ క్రీడించటమని కూడా అర్థమే. చైతన్యమనేది నిత్య ప్రకాశ శీలమైనది గనుక అది దేవ. అదే నామరూపాత్మకమైన జగద్రూపంగా పరిణమించి దానితో క్రీడిస్తే అది దేవి. దేవుని తాలూకు శక్తినే దేవి అన్నారు. శక్తి శక్తిమతో రభేదః . శక్తికీ శక్తి మంతుడికీ తేడా లేదు. రెండూ నిరాకారాలే అయినప్పుడు తేడా ఎలా ఉండగలదు. కనుక ఏది దేవుడో అదే దేవి. ఏది దేవియో అదే దేవుడు. నిరాకారమైన తత్త్వం గనుకనే లింగభేదం కూడా లేదు. నైవస్త్రీ నపుమానేష అని ఉపనిషత్తు ఘోషిస్తున్నది. అయినా శక్తిరూపిణి అయిన దేవిని స్త్రీగానూ శివరూపుడైన దేవుని పురుషుడుగానూ పేర్కొంటున్నారు లోకులు. దానికి కారణమేమంటే శక్తి ఎప్పుడూ అచేతనం గనుక తన పాటికి తాను స్వతంత్రంగా ఉండలేదు. చైతన్య రూపమైన శివతత్త్వాన్నిఆశ్రయించి ఉండాలి. అలా ఆశ్రయించి మెలగటం స్త్రీ లక్షణం గనుక లోక సామాన్యాన్ని బట్టి శక్తిని స్త్రీ రూపంగానూ దానికి ఆశ్రయమిచ్చే శివతత్త్వాన్ని పురుష రూపంగానూ భావించటం జరిగింది.

కాని ఒక విశేషమేమంటే గుణప్రధాన భావాన్ని బట్టి శాస్త్రజ్ఞు లీరెండింటికీ భేదం చెబుతుంటారు. శివతత్త్వాన్ని ప్రధానంగా భావించి చెబితే శక్తి దానికి గుణీభూతమవుతుంది. శక్తికి ప్రాధాన్యమిచ్చి చెబితే

శివతత్త్వం గుణీభూతమవుతుంది. కేవలం మన వివక్షను బట్టి కల్పించుకొన్న విభేదమే గాని ఇది వస్తు సిద్ధం గాదు . వస్తు తః రెండూ వేరు గావు. రెండని పేరేగాని రెండూ గలిసి ఒకే తత్త్వం. ఇదే శివశక్తి సామరస్యమంటే . అయితే శక్తి అనేది అస్వతంత్ర గదా అది ఎప్పుడూ శివతత్త్వాన్నాశ్రయించే గదా ఉండవలసింది అలాంటప్పుడు దానికి ఉపాసకు లెలాఇచ్చారు ప్రాధాన్యమని అడగవచ్చు. దీనికొక ప్రబలమైన కారణమున్నది . అదేమంటే శక్తి ద్వారా నే ఎప్పటికైనా మనమాశివతత్త్వాన్ని అందుకోవలసి ఉంటుంది. మరోమార్గం లేదు. లోకంలో ఎక్కడైనా చూడండి. సాధనం ద్వారానే సాధ్యమనేది లభిస్తుంది. సాధనం లేకుండా ఏది గానీ ఆశించలేము. లోకంలో ఎలాగో లోకోత్తరమైన విషయంలోకూడా ఇదే వ్యవహారం. ఇక్కడ సాధ్యమనేది మానవులందరికీ ఒక్కటే. అది శివసాయుజ్యం. వాస్తవంలో మనమంతా శివస్వరూపులమే అయినప్పటికీ అనాది సిద్ధమైన మన అవిద్యా ప్రభావం వల్ల శివస్వరూపులమనే స్మృతి మనకు లేకుండా పోయింది. తన్నిమిత్తంగా సుఖదుఃఖాది రూపమైన ఈ సంసార బంధమేర్పడింది మనకు. దీనిలోనుంచి మరలా మోక్షమే కావాలని కోరతే దూరమైపోయిన ఆ శివతత్త్వాన్ని మనకందించే సాధనం వెతకి పట్టుకోవాలి. అలాటి సాధనమీశక్తి ఒకటి తప్ప వేరొకటి కానరాదు.

కానీ శక్తి ఒక్కటే మోక్షసాధనమని చెప్పటంలో ఉపపత్తి ఏమిటని సందేహించవచ్చు. శక్తి అనేది ఆ శివతత్త్వం నుంచే బయటికి ప్రసరించి వచ్చింది. ఏది దేనిలో నుంచి ప్రసరించి వస్తుందో అదే దాన్ని మరలా మనకందజేస్తుంది. చూడండి. సూర్యమండలం నుంచి

తేజస్సు భూమండలం దాకా ప్రసరిస్తూ వచ్చింది. ఎక్కడబడితే అక్కడ మనకు దర్శనమిస్తుంది. ఇది ఏమిటా ఈ కనపడే తేజస్సని మనం అన్వేషిస్తూపోతే అది మనదృష్టిని ఆసౌరమండలం వరకూ తీసుకెడుతుంది. కార్యమనేదెప్పుడూ దానికారాణాన్నే మనకు జ్ఞాపకం చేస్తూ పోతుంది. ఇది లోకంలో మనకు సర్వత్రా తార్కాణమయ్యే విషయమే. ఒక ఘటం మృత్తికనూ పటం దాని తంతువులనూ వృక్షం దాని బీజమునూ మనసుకు తెస్తాయిగదా. ఇలాంటి కార్యకారణ భావానికి ఎన్నైనా ఉదాహరణలీయవచ్చు. ఎక్కడైనా కార్యాన్ని బట్టి కారణం ఊహించుకోలేకపోతే అది మన ప్రత్యభిజ్ఞాదౌర్బల్యమేగాని అక్కడ కారణ స్వరూపం లేక కాదు.

అంచేత ముందువర్ణించినట్టు శక్తి కూడా శివతత్త్వం నుంచి కార్య రూపంగా పరిణమిస్తూ వచ్చినదే. కనుక ఈ శక్తిని ఆలంబనం చేసుకొని సాధకుడు ప్రయాణం సాగిస్తే తప్పకుండా అతడాశివసాయుజ్యం పొందగలడనటంలో సందేహం లేదు. శివదూతీ అని అమ్మవారి నామావళి లో ప్రసిద్ధమైన నామమొకటి ఉంది. ఏమిటానామానికి అర్థం. ఒకదూతిక లాగా శివతత్త్వం దగ్గరి నుంచి వచ్చిందా శక్తి. ఎలాగని అడగవచ్చు . మొదట అది పరారూపంగా ఆ శివత్త్వంతోఏకమై ఉండేది. అప్పుడు ఎలాటి స్పందమూ లేదు. నిర్గమనమంతకన్నా లేదు. ఆ శివతత్త్వమే నేనీప్రపంచాన్నంతా సృష్టించాలి అనేకమైపోవాలి అని ఎప్పుడు ఆలోచించిందో అప్పుడీశక్తి ఇచ్ఛారూపిణీగా ప్రసరించింది. అప్పుడు దానికి ప్రశ్యంతి అని పేరు వచ్చింది. అదే మరలా క్రియా రూపంగా ఈ ప్రపంచాన్ని సృష్టించాలని ప్రయత్నించే సరికి కొంత పైకుబికి

మధ్యమ అని పేరు గాంచింది. ఆ మధ్యమే సూక్ష్మరూపాన్ని వదలి ఆకాశాది స్థూలరూపంగా ఎప్పుడు ఆవిర్భవించిందో అప్పుడది వైఖరి అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. ఈ నాలుగవదైన వైఖరీ రూపమే ఇప్పుడు మన అందరి దృష్టికీ కనిపిస్తూ ఉంది. కేవలమూ బ్రహ్మాండరూపంగా మనవెలపలే గాదు. పిండరూపంగా మన లోపల కూడా చేరిపోయింది. ఇందులో పరఅనేది ఒక్కటీ తప్ప విడిస్తే తక్కిన దశలు మూడూ ఆశక్తి తాలూకు కార్యరూపాలే. అందులోనూ వైఖరీ రూపమైన నాలుగవది మిగతావాటికన్నా చాలా స్పష్టంగా కనబడుతోంది . ఎప్పుడే గాని కనపడే దాన్ని ఆధారం చేసుకొనే కనపడని దాన్ని వెదకి పట్టుకోవాలంటారు పెద్దలు. కాబట్టి ప్రత్యక్షంగా కనిపించే ఈ వైఖరీ రూపాన్ని ఆలంబనం చేసుకొని ఆ పరమార్థాన్ని అన్వేషించే ప్రయత్నం చేయాలి మనం. ప్రయత్నిస్తే తప్పకుండా ఇది ఆ గమ్యాన్ని మనకు అందించి తీరుతుంది.

ఈ భావానికి సూచకమైన నామం మరొకటి కూడా ఉంది ఈ నామావళిలో అది శివజ్ఞాన ప్రదాయినీ అనేది. శివ సంబంధమైన జ్ఞానమేదుందో అది శివజ్ఞానం . అలాటి జ్ఞానాన్ని మనకు ప్రసాదించేది గనుక దేవికి శివజ్ఞాన ప్రదాయిని అని పేరు వచ్చింది. ఇప్పుడీ రెండు నామాలూ కలుపుకొని మనం పర్యాలోచన చేస్తే మనకేమని స్ఫురిస్తుందో మీరే చెప్పండి. ఏ పరాశక్తి శివతత్త్వమనే మూలస్థానం నుంచి వైఖరీరూపంగా ఇంత దూరం పరిణమిస్తూ వచ్చిందో ఆ శక్తే మరలా ఆ శివసాయుజ్యం చెందే జ్ఞానాన్ని మనకు ప్రసాదిస్తుందని గదా అర్థం .

కాని ఇక్కడ ఒక సందేహం కలగవచ్చు. జ్ఞానాన్ని ప్రసాదించినంత మాత్రాన అది మనకు శివసాయుజ్యం పొందటానికి సాధనమెలా అవుతుంది. మోక్షమార్గంలో సాధమనేది జ్ఞానం తప్ప మరేది కాదని మనమందరమూ గ్రహించవలసిన రహస్యం. కారణమేమంటే అసలు సృష్టి అనేది గాని జీవుడి ప్రవేశమనేది గాని యథార్థంగా జరగలేదు. అజ్ఞానం వల్లనే ఇదంతా జరిగినట్టు చేసినట్టు మనకు భాసిస్తున్నది. దీనికొక మంచి దృష్టాంతం మన అనుభవంలోనే కనిపిస్తుంది. ప్రతిరోజూ మనం రాత్రి కాలంలో నిద్ర పోవటం సహజం. అందులో ఏదో ఒక స్వప్నం రావటం కూడా సహజమే. అప్పుడు జరగేదేమిటి. మన స్వరూపాన్ని మనం మరచిపోయి మనకు భిన్నంగా ఏదో ఒక లోకాన్ని చూస్తూ అదే వాస్తవమని అందులోనే తిరుగుతుంటాము. తెల్లవారే సరికి మనకు ఏర్పడిన ఆ విస్మృతి మరలా జాగ్రత్సంబంధమైన స్మృతి మూలంగా తొలగి పోయి అదంతా అబద్ధమని గ్రహిస్తాము. ఇప్పుడాస్వప్నమనేది గాని అందులో కనిపించిన దృశ్యాలు గాని వాస్తవంగా ఏర్పడినవా. లేదు గదా. వాస్తవం కాకున్నా వాస్తవమని భావించాము. అంత మాత్రమే. ఆ భావాన్ని పోగొట్టుకొంటే చాలు. స్వప్న ప్రపంచాన్ని పోగొట్టుకొనే ప్రయత్నం వేరే అక్కర లేదు. అంటే వాస్తవమేదో దాన్ని గుర్తిస్తే చాలు. మరొక అనుష్ఠానమేది అక్కరలేదని భావం. అలాగే ఈ సృష్టి కూడా మన అజ్ఞాన జన్యమే గనుక జ్ఞానమే దానికి విరుగుడు. వేరే క్రియా రూపమైన ప్రయత్నమేది అనావశ్యకం.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ముందు వర్ణించినట్లు మనం శివస్వరూపులమైకూడా అది మరచి పోయాము. స్వప్నంలాంటి ఈ సంసార మార్గంలో వచ్చి ప్రవేశించావము. ఇక్కడే నిరంతరం పరిభ్రమిస్తున్నావము. మరచిపోవటం వల్లనే ఇదంతా మనకు సంప్రాప్తమయింది . కనుక మెళకువ వస్తే స్వప్న మెలా తొలగిపోతుందో అలాగే శివసంబంధి అయిన జ్ఞానముదయిస్తే ఇక్కడా మన అజ్ఞానం తొలగి పోతుంది. ఈ విధంగా మన స్వరూపాన్ని మనం గుర్తించటమే సాధనం గాని మరేక్రియా ఇక్కడా కూడా అక్కర లేదు. విస్మృతి స్మృతి ఇవి రెండే మాటలు. మొదటిది సమస్యా రెండవది దానికి పరిష్కారం. వీటికే అజ్ఞానమని జ్ఞానమని పర్యాయ పదాలు. అజ్ఞాన దృష్టికే పరాశక్తి వైఖరీ రూపంగా మారినట్లు మనకు భాసిస్తున్నది. అదే మనం ప్రపంచమని సృష్టి అని పేర్కొంటున్నాము. ఈ మారటమనేది ఇక్కడ సాంఖ్యులు చెప్పే పరిణామం కాదు. అద్వైతుల వివర్తం. మూలభూతమైన చైతన్యాన్ని విడిచి ఏ దశ గాని స్వతంత్రంగా లేదు. పర మొదలుకొని వైఖరి వరకు అన్ని దశలలోనూ ఆ శివచైతన్యం అనుస్యూతంగా చోటుచేసుకొనే ఉంది. అంటే ఏమన్నమాట. ఒకే ఒక చైతన్యం పరా పశ్యంతి మధ్యమలే గాక ఇప్పుడీ వైఖరీ రూపంగా కూడా మనకదే కనిపిస్తూ ఉంది. రజ్జువే సర్ప ధారాదులుగా కనిపిస్తున్నట్లు. అందుకే క్రియా రూపమైన సాధనమేదీ ఇందులో అక్కర లేదని ఘోషించటం. క్రియగాకుంటే మరేమిటి సాధనం. చెప్పాము గదా జ్ఞానమే నని. వైఖరీ రూపంగా కనిపిస్తూ ఉండటం అజ్ఞానం వల్లనైతే దీన్ని మరలా పరా రూపంగా చూడటం జ్ఞానం వల్ల అని గ్రహించాలి మనం. తమస్సును పారదోలటానికి తేజస్సే సాధనమైనట్లు అజ్ఞానానికి జ్ఞానమే సాధనం. తమస్సు పోతే అసలైన

వస్తువు గోచరించినట్లు జ్ఞానం వల్ల అజ్ఞానం తొలగితే ఈ సృష్టి అంతా శివాత్మకం గానే దర్శనమిస్తుంది.

కాబట్టి ఎక్కువగా ఈ విషయంలో శంకించనక్కర లేదు. చైతన్యశక్తే ఈ సమస్త సృష్టి. శక్తే భూతభౌతికాది వ్యక్తి రూపంగా భాసిస్తున్నది. కారణ చైతన్యానికి స్వరూపం శక్తి అయితే శక్తి స్వరూపమే జగత్తు. జగత్తని చూస్తూన్నది కూడా మనం ఆ శక్తినే. మరి దేనినీ గాదు. అమూర్తమైన శక్తే మూర్తమై కనిపిస్తున్నదని భావించాలి మనం . మాటిమాటికీ అలా భావిస్తూ పోతే ఈ శక్తి మరలా మనలనా మూలభూతమైన శివతత్త్వానికి తీసుకెళ్లగలదు. అంతవరకూ తిరోధాయిని అయిన ఆ శక్తే అప్పుడు మరలా అనుగ్రాహిణిగా మారుతుంది సాధకులకు . కనుకనే విద్యా విద్యా స్వరూపిణి అని ఆ దేవి కీర్తించబడుతూ ఉంది. అవిద్య మూలంగా శివాత్మకమైన మనరూపాన్ని కప్పి పుచ్చి అశివమైన సంసారంలో పడదోసింది మనలను. విద్య మూలంగా మరలా శివసాయుజ్యాన్ని అనుగ్రహించి అశివమైన సంసారాన్ని త్రోసిపుచ్చుతుంది. ఈ అవరోహణ ఆరోహణలనే రెండు భూమికలలోనే దేవీ తత్త్వమంతా పరిసమాప్త మవుతున్నది.

ఈ ప్రక్రియనే లలితా సహస్రనామమనే స్తోత్రం ద్వారా హయగ్రీవాదులైన ఆచార్యపురుషులు లోకానికి చాటి చెప్పారు. కేవల భావన వల్లనే దానిని గ్రహించాలి గనుక రహస్య నామ సాహస్రమని కూడా ఆ స్తోత్రానికి ప్రసిద్ధి వచ్చింది. ఇందులో రహస్యమేముందని అడగవచ్చు. వస్తుతః శివాత్మిక అయి కూడా శక్తి అశివాత్మకమైన సంసార రూపంగాభాసించటం ఒక రహస్యమైతే

మరలా ఆ తత్త్వాన్ని విద్యా బలంతో గుర్తించిన వాడికి అదే శివాత్మకమై భాసించటం వేరొక రహస్యం. ఈ రహస్య ద్వయం సాధకులందరి మనసులకు స్పష్టంగా బోధపడాలనే దృష్టితో దేవీ నామావళిని వ్యాఖ్యానం చేయాలని ఈనా ప్రయత్నం. వెయ్యి నామాలనూ నేను వ్యాఖ్యానించటం లేదు. ఆ క్రమంలో కూడా వ్యాఖ్యానించటం లేదు. వాటిలో నాకుకావలసిన కొన్ని నామాలను మాత్రమే తీసుకొని ఒక విలక్షణమైన క్రమంలో వాటిని వివరిస్తూ వచ్చాను.

ఇది ప్రసిద్ధమైన సంప్రదాయాన్ని ఉల్లంఘించటం గదా అని కొందరికి తోచవచ్చు. అలాంటి అపోహ ఏదీ పెట్టుకో నక్కర లేదు. సాధనమార్గంలో ప్రయాణం చేసే జిజ్ఞాసువులను ఉద్ధరించటానికి పనికి వచ్చే మార్గమిది. ఎలాగంటే నామసహస్రంలో రెండు నామాలు చాలా అద్భుతమైనవి కనిపిస్తాయి మనకు. ఒకటి నామ పారాయణ ప్రీతా. మరొకటి రహోయాగక్రమారాధ్యా. ఈ రెండింటి అర్థాన్ని కొంచెం లోతుకు దిగి విమర్శిస్తే చాలు. ప్రస్తుతం నేనవలంబించిన ఈ మార్గం ఎంత సమంజసమైనదో మీకే తెలిసిపోతుంది. నామ పారాయణప్రీతా అంటే నామపారాయణంచేత సంతోషిస్తుందట ఆదేవి. కనుకనే నామాపారాయణప్రీతా అని కీర్తించబడుతుంది. పారాయణమంటే ఎడతెగకుండా నామాలను ఉచ్చరించటమని గాదు. నామాలకు ఏ పారం ఉన్నదో ఆ పారాన్ని అయనం అనగా చేరటమని అర్థం. నామాలన్నింటికి ఒకానొక గమ్యం ఉన్నది. అదే నామ పారం. ఆ గమ్యాన్ని ఈ నామ జపం చేత అందుకోవాలి సాధకుడు. అప్పుడే అది నామపారాయణ మవుతుంది. ఆ దేవి కూడా అప్పుడే ప్రసన్న

అవుతుంది. దీనిని బట్టి జపమనేది కేవలం జపం కోసమే కాదు. దానికి లక్ష్యభూతమైన ఏ శివతత్త్వమున్నదో దాన్ని చేరటమే జపానికి తాత్పర్యమని మనకీనామం వల్ల ధ్వనిస్తున్నది.

మరి ఆ లక్ష్యాన్ని చేరటం ఎలాగ అని అడిగితే ఆ మార్గాన్ని మనకు ధ్వనింపజేస్తున్నది రహోయాగక్రమారాధ్యా అనే రెండవ నామం. రహోయాగమంటే రహస్యయాగం. అది జ్యోతిష్టోమాదుల మాదిరి బాహ్యంగా అనుష్ఠించే యజ్ఞం కాదు. ఆభ్యంతరంగా జరగ వలసిన జ్ఞాన యజ్ఞం. దానికి ఏ మార్గం అనుకూలమో ఆ మార్గంలోనే దేవినారాధించాలని భావం. అంతే అర్థం. శివశక్తి సామరస్య రూపమైన దేవీ తత్త్వజ్ఞానం ఏ క్రమంలో మనకు లభిస్తుందో ఆ క్రమాన్నే మనమీనామసహస్రంలో అన్వేషించవలసి ఉంది. అంతే గాక ఆ సాధన క్రమానికి ఉపకరించే నామాలేవున్నవో వాటినే తీసుకోవలసి ఉంది.

అసలు సహస్రనామాలని పేరేగాని అన్ని నామాలూ దేనిపాటికది విలక్షణంగా కనపడవు మనకు. వందల కొద్ది పునరుక్తులు కనిపిస్తాయి. శబ్దంలో కాకపోయినా అర్థంలో కుప్పతెప్పలు. ఒకే అర్థమిచ్చే నామాలు ఎన్నో దొర్లుతుంటాయి. ఈ విధమైన పునరుక్తులే గాక భావప్రతిపాదనలో కూడా ఒక హేతుబద్ధమైన క్రమమున్నట్టు కనిపించదు. నామావళిని నిశితంగా పరిశీలించే భావుకులకు ఇది నేను నిరూపించనక్కర లేదు. కాబట్టి అన్ని నామాలనూ ఆ క్రమంలోనే తీసుకోవాలని గాని వ్యాఖ్యానించాలని గాని నేను నిర్బంధం పెట్టుకోలేదు. అలా పెట్టుకొన్నా అది కేవలం సంప్రదాయాన్ని అనుసరించి పోయామనే



Yalamanchi Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

అవుతుంది. దీనిని బట్టి జపమనేది కేవలం జపం కోసమే కాదు. దానికి లక్ష్యభూతమైన ఏ శివతత్త్వమున్నదో దాన్ని చేరటమే జపానికి తాత్పర్యమని మనకీనామం వల్ల ధ్వనిస్తున్నది.

మరి ఆ లక్ష్యాన్ని చేరటం ఎలాగ అని అడిగితే ఆ మార్గాన్ని మనకు ధ్వనింపజేస్తూన్నది రహోయాగక్రమారాధ్యా అనే రెండవ నామం. రహోయాగమంటే రహస్యయాగం. అది జ్యోతిష్టోమాదుల మాదిరి బాహ్యంగా అనుష్ఠించే యజ్ఞం కాదు. ఆభ్యంతరంగా జరగ వలసిన జ్ఞాన యజ్ఞం. దానికి ఏ మార్గం అనుకూలమో ఆ మార్గంలోనే దేవినారాధించాలని భావం. అంటే అర్థం. శివశక్తి సామరస్య రూపమైన దేవీ తత్త్వజ్ఞానం ఏ క్రమంలో మనకు లభిస్తుందో ఆ క్రమాన్నే మనమీనామసహస్రంలో అన్వేషించవలసి ఉంది. అంతే గాక ఆ సాధన క్రమానికి ఉపకరించే నామాలేవున్నవో వాటినే తీసుకోవలసి ఉంది.

అసలు సహస్రనామాలని పేరేగాని అన్ని నామాలూ దేనిపాటికది విలక్షణంగా కనపడవు మనకు. వందల కొద్ది పునరుక్తులు కనిపిస్తాయి. శబ్దంలో కాకపోయినా అర్థంలో కుప్పతెప్పలు. ఒకే అర్థమిచ్చే నామాలు ఎన్నో దొర్లుతుంటాయి. ఈ విధమైన పునరుక్తులే గాక భావప్రతిపాదనలో కూడా ఒక హేతుబద్ధమైన క్రమమున్నట్టు కనిపించదు. నామావళిని నిశితంగా పరిశీలించే భావుకులకు ఇది నేను నిరూపించనక్కర లేదు. కాబట్టి అన్ని నామాలనూ ఆ క్రమంలోనే తీసుకోవాలని గాని వ్యాఖ్యానించాలని గాని నేను నిర్బంధం పెట్టుకోలేదు. అలా పెట్టుకొన్నా అది కేవలం సంప్రదాయాన్ని అనుసరించి పోయామనే

Yallamraju Srinivasa Rao
www.advaitam.in

# పూర్వార్థము

# అవరోహణ క్రమము

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# పూర్వార్థము - అవరోహణ క్రమము

1. శ్రీ మాతా — 1
2. శ్రీమహారాజ్ఞీ — 2
3. శ్రీమత్సింహాసనేశ్వరీ — 3
4. చిదగ్ని కుండ సంభూతా — 4
5. చిదేక రస రూపిణీ — 363
6. అప్రమేయా — 416
7. స్వప్రకాశా — 417
8. సర్వగా — 703
9. సర్వోపాధి వినిర్ముక్తా — 709
10. మహామాయా — 215
11. మహా శక్తిః — 217
12. ఇచ్ఛాశక్తి జ్ఞాన శక్తి క్రియాశక్తి స్వరూపిణీ — 659
13. చిచ్ఛక్తిః - చేతనా రూపా — 418 419
14. జడ శక్తిః - జడాత్మికా — 420,421
15. అనేక కోటి బ్రహ్మాండ జననీ — 621
16. ఆకీట బ్రహ్మ జననీ — 286
17. పరా- ప్రత్యక్చితీ రూపా — 366,367
18. పశ్యంతీ - పరదేవతా — 368,369
19. మధ్యమా — 370
20. వైఖరీ రూపా — 371
21. తత్త్వాధికా - తత్త్వమయీ — 906,907
22. చరాచర జగన్నాథా — 244
23. సర్వానుల్లంఘ్య శాసనా — 995
24. పంచకృత్య పరాయణా — 274
25. సృష్టి కర్త్రీ - బ్రహ్మ రూపా — 264,265
26. గోప్త్రీ - గోవింద రూపిణీ — 266,267
27. సంహారిణీ - రుద్ర రూపా — 268,269
28. తిరోధాన కరీ - ఈశ్వరీ — 270,271
29. సదాశివా - అనుగ్రహదా — 272,273
30. విశ్వరూపా - జాగరిణీ — 256,257
31. స్వపంతీ - తైజసాత్మికా — 258,259
32. సుప్తా - ప్రాజ్ఞాత్మికా — 260,261
33. తుర్యా-సర్వావస్థా వివర్జితా — 262,263
34. భవచక్ర ప్రవర్తినీ — 843
35. సుధాసాగర మధ్యస్థా — 61
36. కదంబ వన వాసినీ — 60
37. కులరూపిణీ — 897
38. త్వక్స్థా — 518
39. రుధిర సంస్థితా — 491
40. మాంస నిష్ఠా — 501
41. మేదో నిష్ఠా — 570
42. అస్థి సంస్థితా — 517
43. మజ్జా సంస్థా — 524
44. శుక్ర సంస్థితా — 531
45. సుమేరు శృంగ మధ్యస్థా — 55
46. చింతామణి గృహాంతస్థా — 57
47. జ్ఞాన విగ్రహా — 644
48. ఆత్మా — 620
49. ఆబాల గోప విదితా — 994
50. మనోరూపేక్షుకోదండా — 10
51. పంచతన్మాత్ర సాయకా — 11
52. రాగ స్వరూప పాశాఢ్యా — 8
53. క్రోధాకారాంకుశోజ్జ్వలా — 9
54. సర్వ మోహినీ — 704

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

తెలపకపోతే ఈ ప్రపంచమంతా అంధకార బంధురమే. ఎందుకంటే ఆకాశాదులేవీ తమకు తాము గోచరించలేవు. మరొకచైతన్యానికి గోచరించవు. అలాంటప్పుడు అంధకారం కాక మరేముంది.

అంచేత లోకంలో ఉండే ప్రమేయ జాతానికంతటికి సిద్ధి అనేది ఏర్పడాలంటే అది చైతన్యం మూలంగానే ఏర్పడాలి. చైతన్యం స్వత స్సిద్ధం గనుక దానికి మరొకదాని అవసరం లేదని చెప్పాము. అది తనపాటికి తాను సిద్ధించి తనకు తాను స్ఫురిస్తూ ఆ స్ఫూర్తినే ప్రమేయ జగత్తుకంతా పంచిపెడుతున్నది. అలా సర్వత్రా ప్రసరిస్తూ సర్వాన్నీ ప్రకాశింపజేస్తున్నది గనుకనే దానిని సర్వగా అని పేర్కొన్నారు. సర్వం గచ్ఛతీతి సర్వగా. చరాచరాత్మకమైన సకల పదార్థాలనూ వ్యాపించేది అని అర్థం. వ్యాప్తి అంటే వెలపలనే కాదు. లోపల వెలుపల రెంటి మధ్యలో కూడా అని అర్థం. ఎప్పుడైతే బహిరంతర్ మధ్యాలు మూడూ చైతన్యమే వ్యాపించిందో ఆ పదార్థమంతా చైతన్యశక్తి మయమే కావలసి ఉంది. ఎందుకంటే చైతన్యస్పర్శ లేని భాగానికి అస్తిత్వం లేకపోవలసి వస్తుంది. పదార్థమంతా ఉందని చెప్పామంటే అందులో అన్ని భాగాలూ చైతన్యంతో నిండి పోవలసిందే. అప్పటికి చైతన్యశక్తి అనేది తన వరకే గాక సర్వజగత్తునూ వ్యాపించి తీరవలసిందే. సర్వతోముఖమైన ఈ వ్యాప్తినే సర్వగా అనే ఈ నామం మనకు బోధిస్తున్నది.

## 9. సర్వోపాధి వినిర్ముక్తా

సర్వమూ అదే వ్యాపించిందనే సరికి సర్వమనేదొకటి ఏదో ఉంది దాని నిది వ్యాపిస్తుందని అపోహ కలగవచ్చు. అది తొలగిస్తున్నదీనామం. సర్వమూ కేవలం దాని ఉపాధులే. అలాటి ఉపాధులనుంచి వినిర్ముక్తా వివర్జితా. ఏ మాత్రమూ వాటి సంబంధం లేనిదా చైతన్య శక్తి. ఏమిటా సర్వోపాధులు. దానిచేత నిత్యమూ గ్రహించబడే ఈ నామరూపాత్మక ప్రపంచమే. అది ప్రమాణమైతే ఇది దానికి ప్రమేయమని చెప్పాము. అది ఇది అని మాటే గాని అక్కడ వాస్తవానికి రెండు లేవు. ఉన్నదొక్క చైతన్యమే. అది దేన్నో కాదు గ్రహిస్తున్నది కూడా. తన్ను తానే గ్రహిస్తున్నది. గ్రహిస్తుంటే దాన్ని ప్రమాణమన్నాము గ్రహించబడుతుంటే దాన్నే ప్రమేయమన్నాము. తనకు తానే ప్రమాణం - తనకు తానే ప్రమేయమది. చైతన్యం గనుకనే అది సంభవం. రెండు పాత్రలూ అదే అభినయించగల సామర్థ్యముంది దానికి . కనుకనే ప్రమేయమనేది మరొకటేదో ఉందని అపోహ పడరాదు. ఆ ఉందని భావించేదంతా దాని స్వరూపమే. విజ్ఞాన ఘన రూపిణి అని ఒక నామముంది. అది ఈ రహస్యాన్నే చెబుతుంది మనకు. సువర్ణ ఘనం అని పేర్కొంటారు లోకంలో. ఘనమంటే ఏమిటక్కడ అర్థం. సువర్ణం తప్ప మరే విజాతీయ పదార్థమూ దానిలో లేదని గదా. అలాగే జ్ఞానం తప్ప మరేదీ లేదని భావం. మరేదీ అంటే ఏమిటది. ఇదిగో ఈనామరూపాధికమైన సర్వం. దీనికే ఉపాధులని నామాంతరం.

ఏది ఒకదాని మీద ఆరోపించ బడుతుందో అది దానికుపాధి. ఈ ఆరోపణ అనేది రెండు విధాలుగా

జరగవచ్చునంటారు శాస్త్రజ్ఞులు. ఒక పీటమీద పుస్తకం పెడితే అది ఒక ఆరోపణ. పొయ్యి మీదనే పీఠ రూపం కనపడితే అది మరొక ఆరోపణ. పుస్తకం పీట అన్నప్పుడు అవి రెండూ వేర్వేరు పదార్థాలై ఒకదాని పైన వేరొకటి ఆరోపిత మయింది. మరి పీట కొయ్యా అన్నప్పుడు అలా వేర్వేరు పదార్థాలు కావవి. కొయ్యే పీట పీటే కొయ్య. కొయ్యకు భిన్నంగా పీట రూపమెక్కడా కానరాదు. అయినా కొయ్యలో పీట కనిపిస్తున్న దంటే పీట అనేదొకటి ఉండి కాదు కనిపించటం. ఉన్నదొక కొయ్యే. అదే కొయ్యలాగా పీట లాగా కూడా భాసిస్తున్నది.

అలాగే ప్రస్తుతమీ చైతన్య విషయం కూడా. చైతన్యమొక్కటే ఉన్న పదార్థమసలు. నామారూపాధులైన ఈ ఉపాధులేవీ లే.వు అయినా ఉన్నట్టు కనిపిస్తున్నాయి మనకు. కనిపిస్తున్నాయంటే ఇవి వాటి పాటికవి స్వతంత్రంగా ఉన్న పదార్థాలు కావు. పీట మీద పుస్తకం లాగా కాక కొయ్య మీద పీట ఆరోపితమైనట్టు ఆరోపితమయినవవి. పుస్తకమంటే కొయ్యకు వేరుగా ఉన్న వస్తువు. పీట వేరుగా ఉన్నదికాదు, వేరుగా ఉన్నట్టు భాసిస్తున్నదంమాత్రమే. ఆ మాటకు వస్తే కొయ్యే కొయ్యగానూ పీట గానూ భాసుసిస్తున్నదని గదా చెప్పాము. అలాగే ఈ సర్వోపాధులనేవి నిజంగా ఉన్నాయి చేశాయి అని చూడరాదు. చైతన్యం మీద ఆరోపితమైనవే ఇవి. పుస్తకం లాగా కాదు. పీట లాగా. పీటకొయ్యకు వేరుగా లేనట్టే ఇవి కూడా చైతన్యానికి వేరు కావు. చైతన్యమే శుద్ధ చైతన్యంగా- ఉపాధి ప్రపంచంగా కూడా కనిపిస్తున్నది. కంటే చైతన్యం కనిపిస్తే ప్రపంచం. గ్రహిస్తే ప్రమాణం గ్రహించబడితే అదే ప్రమేయం.

వస్తుతః ప్రమేయమని భావించే ఈ ఉపాధులెక్కడా లేవు. దేని మీద ఆరోపించటమూ లేదు. ద్వైతరూపమైన ఆరోపణ చూచి చూచి దానికి బాగా అలవాటు పడిందీలోకం. అలాటి లోక దృష్టితో చూచి ఈ ప్రపంచం కూడా ఒక ఉపాధి అని ఇది ఆ చైతన్యం మీద ఆరోపితమయిందని వ్యవహరిస్తున్నాము. నిజంలో ఇది దానికి భిన్నంగా లేనూ లేదు. ఆరోపితం కానూ లేదు. దానిచేతనే గ్రహించబడవలసినప్పుడు- దాని స్పర్శ లేకుంటే అస్తిత్వానికే నోచుకోనప్పుడు- ఇవి ఎక్కడ ఉన్నాయని. ఎలా ఆరోపితమయ్యాయని. అంచేత ఇవి ఇలా కనపడుతున్నాయే ఏమిటా ఎలాగా అని ఆశ్చర్యపడరాదు మనం. ఇవి కాదు కనపడట మసలు. చైతన్యమే ఈ ఉపాధుల రూపంలో మనకు దర్శనమిస్తున్నది. ఒక సముద్ర జలమే తరంగ ఫేన బుద్బుదాది రూపాలలో భాసించినట్లు భాసిస్తున్న దీనామ రూపాత్మక ప్రపంచమంతా. చైతన్యమే సర్వోపాధులూ కనుకనే సర్వోపాధి వినిర్ముక్త ఆ శక్తి. అంటే ఉపాధులేవి లేవు. శక్తి ఒక్కటే ఉన్నదని భావం.

## 10. మహామాయా

మరి ఈ ఉపాధులన్నీ అసత్యమయితే ఇవి మనకు కనపడరాదు గదా. లేనిపదార్థమెక్కడైనా కనపడుతుందా. కుందేటి కొమ్మును గాని వంధ్యాకుమారుని గాని ఎవరైనా చూచారా. చూడ గలరా. అలాగే శశవిషాణం లాంటి ఈ ప్రపంచాన్ని కూడా చూడలేము గదా మనం. అయినా చూస్తున్నామే అనుక్షణం. లేనిదయితే ఎలా చూడగలమని మరలా ప్రశ్న వస్తుంది. దీనికి సమాధానమే ఈ నామం. మహతీచ సా మాయాచ ఇతి

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

మహామాయా. బ్రహ్మాండమైన మాయా శక్తి అట అది. చైతన్యమే మహామాయా. అదే చైతన్యం అదే మాయ. మాయా మాయావి రెండూ అవే. శక్తి రూపంగా మాయా. శివ రూపంగా మాయావి. ఏమిటి మాయా అంటే మీయతే అనయా ఇతి మాయా. ఏది ఒక పదార్థాన్ని కొలిచి పారేస్తుందో అది మాయ. దేశ కాల వస్తువులనే మూడింటినీ ఇవి యింత అని కొలిచిచూపిందాశక్తి. అదే మాయా అనే మాటకర్థం.

కావచ్చు. శివతత్త్వం కన్నా భిన్నమైనదేని లేదు అంతా అబద్ధమని గదా వాకుబుచ్చారు. మరి ఈ దేశ కాలాదులేమిటి. వీటినది కొలవట మేమిటి. మృగతృష్ణాంభసి స్నాతః అన్నట్టుందీ మాట అని ఆశంకించవచ్చు. దీనికి సమాధానమేమంటే ఆ చైతన్య రూపమైన శివతత్త్వం తన్ను తానే ప్రపంచ రూపంగా మలుచుకొని చూపుతున్నది. అదే ఈ దేశ కాలాది ప్రపంచం. ఇది ఎలా సాధ్యమని ఆశ్చర్యపోరాదు. ఒక ఐంద్ర జాలికుడు ప్రదర్శించే మాయకే మనం జవాబు చెప్పలేము. వాడికి కూడా మాయావి అనే పేరు. వాడు చూపేది కూడా మాయే. వాడొక్కడే. మరొకడు వాడి ప్రక్కన ఎవడూ లేడు. అయినా వాడొక చోట మన ప్రక్కన కూచొని కనిపిస్తాడు. మరొక చోట దూరంగా పరుగెడు తుంటాడు. ఇంకొక చోట ఒక పగ్గం పైకి విసరి దాన్ని పట్టుకొని పాకి పోతుంటాడు. క్రిందపడి మరణిస్తాడు. మరలా బ్రతికి లేచివస్తాడు. క్రమంగానూ కనిపిస్తాడు. ఒకే మారూ కనిపిస్తాడనేక రూపాలలో. అనేక పదార్థాలను తనకు భిన్నంగా కల్పిస్తూ కూడా పోతాడు. అవన్నీ మనం గ్రుడ్లప్పగించి చూస్తూనే ఉంటాము.

పోనీ ఇదేదో క్వాచిత్కంగా ఎక్కడో ఏప్పుడో జరిగే సన్నివేశమని నమ్మకపోవచ్చు మనం. మరి ప్రతి దినమూ రాత్రి కాలంలో చూచే స్వప్నం మాటేమిటి. వీడు వాడనకుండా సర్వులమూ చూస్తుంటాము గదా స్వప్నమనేది. అందులో మనకు మనమే ఎన్నో భంగిమలలో గోచరిస్తుంటాము. ఎన్నో పదార్థాలు గోచరిస్తుంటాయి మన కండ్లకు. వాటితో ఎన్నో విధాలుగా వ్యవహరిస్తుంటాము. ఎక్కడినుంచి వచ్చాయి ఇవన్నీ. అన్నీ మన చైతన్య కల్పితమే గదా. మన చైతన్యమే తన్ను తాను వికల్పించుకొని అలా వివిధ రూపాలలో కనిపిస్తున్నదని ఒప్పుకోక తప్పదు మనం.

ఇలా లౌకికమైన మాయకే జవాబు చెప్పలేము మనం. ఇక లోకోత్తరమైన ఆ మహామాయకేమి చెప్పగలం. అందుకే దాన్ని మాహామాయ అన్నారు. ఇది మాయ అయితే అది మాహా మాయ. అన్ని మాయలకూ అతీతమైన మాయ. ఈ మాయావి తన మాయా బలంతో కొన్ని మాత్రమే చేయగలడు. అవి కూడా ఏదో హస్త లాఘవంతోనో కనుకట్టుతోనో సాధించగలడు. మనకు దృగ్గోచరం కాకపోయినా ఏవో ఉంటాయి వాడి దగ్గర కొన్ని పరికరాలు. వాటి సహాయంతోనే చేసి చూపుతుంటాడామహిమలన్నీ . పరమాత్మ విషయంలో ఇలాటి పరికరాలు కూడా అక్కర లేదు. నిరాకారం కాబట్టి హస్తలాఘవాదుల ప్రసక్తి లేదు. ఆమాటకు వస్తే ప్రదర్శించేది- ప్రదర్శానాన్ని చూచే ప్రేక్షక వర్గమూ రెండూ అ. కాబట్టి కనుకట్టు కూడా లేదు వాస్తవంలో. మరేమిటంటారు. అసహాయ శూరుడి లాగా ఏ పరికరమూ లేకుండానే ఏ మోసమూ లేకుండానే తనకు తానే అనేక రూపాలుగామారి తన దృష్టికి తానే గోచరిస్తూ తన రూపాలతో తానే అన్ని సంబంధాలూ పెట్టుకొని

వ్యవహారాలన్నీ సాగిస్తున్నదది. ఇంతకన్నా మాయా మర్మమేముంది. తనకు వేరుగా ఏదీ లేకపోయినా అన్నీ ఉన్నట్టు అనుభవానికి వస్తున్నదంటే అదే మాయ. ఇది ఎలాగా అని ప్రశ్నే లేదు. నహి దృష్టే అనుపపన్నం నామ. ఒక ప్రక్క కనిపిస్తుంటే ఇది ఎలా కనిపించ గలిగిందని అడగటం అనావశ్యకం. ఆకాశంలో నలుపు లేకున్నా కనిపిస్తుంది. ఎందుకు కనిపిస్తుందంటే ఏ మిటి జవాబు. చూస్తే కనిపిస్తున్నది. కనిపిస్తుంటే చూస్తున్నాము. చూడటం జీవుడి అవిద్యా దృష్టి అయితే అలా కనిపించటం ఈశ్వరుడి మాయా సృష్టి.

## 11. మహా శక్తిః

అఘటన ఘటనా పటీయసీ మాయా. అసంభవాన్ని సంభవంగానూ సంభవాన్ని అసంభవం గానూ చూపగలిగిందేదో అదే మాయ. అలాటిది దాని శక్తి. శక్తి రూపంగా ఉంటూనే ఏదేది కోరితే దాన్ని సృష్టించి చూపగలదు. శక్తి స్వభావమే అలాంటిది. అనేక రూపాలుగా పరిణమించటమే దాని స్వభావం. అలా కాకుంటే అది శక్తి అనిపించుకోలేదు. పరిణామం వల్లనే అది శక్తి అని అది ఒకటి ఉందని మనం గుర్తించ గలం. శ్వేతాశ్వతరోపనిషత్తు అలాగే చాటుతున్నది. పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బల క్రియాచ.

ఇలాంటి శక్తి లోకంలో సర్వత్రా కనపడుతూనే ఉంది మనకు. సముద్రంలో ఒకానొక శక్తి ఉంది. అది సముద్రం వరకే నిలిచిపోదు. తరంగ ఫేన బుద్బుదాదులైన అనేక వేషాలు ధరించి ప్రతిక్షణమూ ఆవిర్భవిస్తూనే ఉంటుంది. ఒక వృక్షంలో ఉన్న శక్తి

దాని వరకే ఆగి పోదు. అది కొమ్మలు రెమ్మలు ఆకులు పూవులు కాయలు ఇలా అనేక రూపాలలో అవతరించి కనిపిస్తూనే ఉంటుంది. శక్తి అనేది అంతర్గతంగా ఉండటమే గాక ఎప్పటికప్పుడు ఎలా బహిర్గతమయి కనిపిస్తుందో ఈ ఉదాహరణల వల్ల మనం గ్రహించవచ్చు.

అలాగే ఆ మహా శక్తి ఎలాంటిదో కూడా మనం గ్రహించవచ్చు. మహాశక్తి గనుకనే అది కూడా అండపిండ బ్రహ్మాండ రూపంగా అసంఖ్యాకమైన రూపాలలో బయటబడి మనకిలా నిత్యమూ భాసించటం మూలాన్నే అనన్యాదృశమైన దాని మహత్త్వం ఎలాంటిదో మనకు చెప్పకుండానే తెలిసుపోతున్నది. ఒకచిత్ర మేమంటే శక్తి అనేది అంతర్గతంగా ఉన్నంతవరకూ దానికి శక్తి అని మాత్రమే పేరు. అదే బహిర్గతమయి తన్ను తానే అనేక రూపాలలో ప్రదర్శిస్తూ పోతే దానికే మాయా అని నామ కరణం చేశారు పెద్దలు. రెండూ ఆ చైతన్య విలాసమే.

### 12. ఇచ్ఛాశక్తి జ్ఞాన శక్తి క్రియాశక్తి స్వరూపిణీ

అయితే ఒక్కటే అయి గూడా ఆశక్తి అనేక రూపాలలో ఎలా భాసించగలుగు తున్నది. అలా భాసించే అ శక్తులన్నీ ఎలా ఎలా ప్రసరిస్తూ పోతాయని జిజ్ఞాస కలగవచ్చు. శక్తి ఒక్కటే అయినా అది అనేక భూమికలు ధరించగలదు. ఇందులో ఆశ్చర్యమేమి లేదు. అనేక విధాలుగా పరిణమించటమే శక్తికున్న లక్షణమని ఇంతకు ముందే పేర్కొన్నాము. శక్తి అంటేనే పరిణామ శీలమైనది. అప్పుడే దానికి శక్తి అనే పేరు సార్థకమవుతున్నది.

ఎలా పరిణమిస్తుందని గదా ప్రశ్న. దాన్ని వివరిస్తున్నదీనామం. పరిణామం మూడు విధాలుగా సాగుతుంది. మొదట శక్తి అనేది జ్ఞాన రూపం. చిదేక రస రూపిణి అని పూర్వం ఈ భావాన్నే వర్ణించి చెప్పింది ఒక నామం. చిద్రూప గనుకనే స్వతంత్రమైనదీ ఆ శక్తి. స్వతంత్ర గనుకనే తన ఇచ్ఛానుసారంగా తాను పరిణమించ గలదు. ఇచ్ఛ అనేది జ్ఞానానికి మాత్రమే లక్షణం. మరి దేనికీ గాదు. అందుకే అణుశక్తి విద్యుత్ శక్తి అని ఇప్పుడు మన శాస్త్రజ్ఞులు చెప్పే శక్తులన్నీ దానితో పోల్చటానికి లేదు. ఇవి చేతన శక్తులు కావు. జడ శక్తులు. జడశక్తులు గనుకనే తమ ఇచ్ఛతో తాము ప్రవర్తించ లేవు. మరొక చైతన్య శక్తిని ఆశ్రయించి మెలగవలసిందే. దేనినీ ఆశ్రయించక తన పాటికి తాను ప్రవర్తించ గల శక్తి ఈ చైతన్య శక్తి ఒక్కటే. ఇది తన పాటికి తాను ప్రవర్తిస్తూ మిగతా వాటికి కూడా ప్రవృత్తి కల్పిస్తుంది. కనుకనే వాటికంటే ఇది విలక్షణమైన మహాశక్తి అయింది. ఇది లేనిదే మిగతా వాటి కసలు అస్తిత్వమే లేదు.

జ్ఞానశక్తి ఇచ్ఛాశక్తిగా మారి అది మరలా క్రియారూపాన్ని ధరిస్తున్నది. మొదటజ్ఞానం తరువాత ఇచ్ఛా ఆ తరువాత క్రియా. జ్ఞానరూపంగా ఉన్నంతవరకూ అది తనలో తానే ఇమిడిపోతుందాశక్తి. అది ప్రసరించాలని చూచేసరికి ఇచ్ఛగా మారుతుంది. ప్రసరించి క్రియ అవుతుంది. ఈ క్రియ అక్కడికి ఆగిపోదు. అది మరలా ఒక ఫలితాన్ని అందిస్తుంది. ఆ ఫలరూపమే ఈ సంసారమంతా. ఫలంకూడా ఫలం కోసమే కాదు. అది జీవుడి అనుభవం కోసం. ఫలభోక్త జీవుడే. అంచేత

మనబోటి జీవకోటి అనుభవానికే సుఖదుఃఖాత్మకమైన ఈ సంసారమనే మహా ఫలం. ఇది మనకందరికీ ప్రత్యక్ష సిద్ధమే.

ఈ ఫలానుభవంతో సమాప్తమవుతుంది ఆ మహాశక్తి పరిణామ యాత్ర. ఈ యాత్రలో ఇచ్ఛా క్రియా ఫల, అనుభవ అనేవి నాలుగూ నాలుగు మజిలీలు. నాలుగు భూమికలలోనూ ఆ జ్ఞానశక్తి ఒక్కటే అంతర్వాహినిగా ప్రసరిస్తూ వస్తున్నది. దాని స్పర్శలేకుండా ఏ దశ గాని తన పాటికి తాను నిలవలేదు. ఆ ఒక్కటే ఒక నర్తకి లాగా ఈ నాలుగు వేషాలు ధరించి బ్రహ్మాండంగా నర్తిస్తున్నది. కనుక ఫలానుభవం వరకూ పరచుకొని ఉన్న ఈ నాలుగవస్థలలోనూ చిద్రూపిణి అయిన ఆ పరదేవతనే దర్శిస్తూ పోవాలి మనం. అలా దర్శిస్తూ పోతే క్రమంగా మనమూ చిద్రూపాన్నే అందుకొని ఈ సంసార సాగరాన్ని దాటి పోగలము. ఇక్కడ ఒక సూక్ష్మాన్ని మనం గ్రహించవలసి ఉంది. జ్ఞాన ఇచ్ఛా క్రియాశక్తులలో మొట్ట మొదటిది జ్ఞానమే అయినా ఇచ్ఛా శక్తితో ప్రారంభమవుతున్నదీ నామం. జ్ఞానస్వరూపమైన శివతత్త్వం కంటే ఇచ్ఛాస్వరూపిణి అయిన పరాశక్తికి ప్రాధాన్యమివ్వటం కోసం దానితో మొదలయింది అని గ్రహించాలి మనం. అంతే గాక సృష్టిపరిణామానికంతటికీ ఇచ్ఛాశక్తే మూలంగనుక ఇచ్ఛతోనే ప్రారంభించవలసి వచ్చింది. అంతేగాని ఇందులో వ్యుత్క్రమదోషం ఏదో దొరలిందని భ్రమపడరాదు.

## 13. చిచ్ఛక్తిః - చేతనా రూపా

జ్ఞానశక్తి ఒక్కటే ఇచ్ఛారూపంగానూ క్రియారూపంగానూ పరిణమించిందని తెలుసుకొన్నాము. అది క్రియా రూపంగా ఫలరూపంగా కూడా ఎలా పరిణమిస్తున్నదో ఆ మార్గాన్ని ఇప్పుడు



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

బోధిస్తున్నదీనామం. చిచ్ఛక్తి అంటే జ్ఞానశక్తికే మారు పేరు. అది చైతన్య రూపం గనుకనే చేతనులైన జీవుల రూపంగా మారుతున్నది. జరాయుజాదులైన జీవులందరూ చేతన రూపులే. అచేతనులుకారు. మననశక్తి ప్రాణమశక్తి తో కూడుకొని ఉండటమే చేతనత్వం. అది ఈ జీవులందరికీ కనిపిస్తూ ఉన్న లక్షణమే.

ఇది చిచ్ఛక్తి వల్ల ఏర్పడినదే ఈ పరిణామం. అనేన జీవేమాత్మనా అనుప్రవిశ్య నామ రూపే వ్యాకరవాణి అని ఆ పరాదేవత సంకల్పించి అలాగే జీవ రూపంగా ప్రవేశించిందట. ఇక్కడ సంకల్పించిందనే అంశంలో అది ఉపాదానకారణమయింది. రెండింటి స్వరూపమూ ఆ చైతన్య శక్తే మరేది గాదు. పోతే లోకంలో ఇలాంటిది గాదు వ్యవహారం. ఏది నిమిత్తమో ఇక్కడ అది ఉపాదానం కాదు. మరి ఉపాదానమయిన మృత్సువర్ణాదులు నిమిత్తం గాదు. పరమార్థంలో మాత్రం ఉపాదాన నిమిత్తాలు రెండూ ఒక్కటే కావటం విశేషం. ఒకే శక్తి చిద్రూపంగా నిమిత్తమయి తనకు భిన్నగా మరొక వస్తువు లేదు గనుక అదే ఉపాదానం కూడా అవతున్నది.

అంచేత చేతనా రూపులైన ప్రాణులుగా ఎవరు చెలామణి అవుతున్నారో వారందరూ చిద్విశేషాలుగా కనిపిస్తున్నా నిజానికి చిన్మాత్రులే. ఘటాదులన్నీ మృద్విశేషాలుగా భాసిస్తున్నా మృణ్మాత్రమే గదా. ఇక్కడ చిచ్ఛక్తి అని చేతనా రూపా అని రెండు నామాలు మనకు రెండు రహస్యాలు బయట పెడుతున్నాయి. జగత్సృష్టికి శక్తియే ఆధారం. అయితే అది చిచ్ఛక్తి గనుక జడసృష్టికి చేతనమైన జీవసృష్టికి రెండింటికి ఆధార మవుతున్నది. చిచ్ఛక్తి అనే నామం నిమిత్తత్వాన్ని సూచేస్తే చేతనా రూపా అనే నామం

ఉపాధానత్వాన్ని చెబుతున్నది. అది కేవలం శక్తియే కాదు. ఈ కనిపించే జీవుల రూపంగా కూడా అదే పరిణమించిందని భావం. దీనిని బట్టి సమస్త చేతన ప్రపంచమూ చిదాత్మరూపంగా భావన చేయాలని బోధపడుతున్నది.

## 14. జడ శక్తిః - జడాత్మికా

అది కేవలం చిచ్ఛక్తే కాదు. దానికి భిన్నమైన జడశక్తి కూడా అదే నట. చిదేక రస రూపిణి అని గదా వర్ణించారు దేవిని. అలాంటప్పుడది చిచ్ఛక్తే కావాలి గాని దానికి విరుద్ధమైన జడశక్తి ఎలా కాగలదు. అదే చేతనా అదే జడ అని చెప్పటం పరస్పర విరుద్ధం గదా అని ప్రశ్న వస్తుంది. నిజమే అది చిద్రూపిణే ఆ శక్తి. జడ రూపిణి కాదు. అయినప్పటికీ ఆకాశాది భూతాలలో జడంగా భాసిస్తున్నది. శరీరాది పిండరూపాలలో కూడా అలాగే భాసిస్తుంది. అలా భాసిస్తున్నా అది యథార్థంగా జడ కాదు. జడ రూపంగా పరిణమించిన చైతన్య శక్తే.

ఇక్కడ ఒక రహస్యం గుర్తించాలి మనం. వస్తుతః చేతన అయినా ఆ శక్తి చేతనులైన మనుష్యాదులలో ఏ మాత్రమూ మార్పులేకుండా అలా చేతన రూపంగానే కనిపిస్తుంది. కేవలం పరిమాణంలో మాత్రమే హెచ్చు తగ్గులు పొందుతుంటుంది. పరిమాణంలోనే కాని గుణంలో కాదు. పోతే ఆకాశాది జడ పదార్థాల్లో బాగా మార్పు చెంది చైతన్యం మరుగు పడి పైకి అచేతనగా కనిపిస్తుంది. కనిపిస్తున్నప్పటికీ చైతన్యం అందులో లేదని గాదు అర్థం. పరిణామ క్రమంలో ఏర్పడ్డ విప్రకర్ష వల్ల అలా దానికి జడత్వమేర్పడినట్లు స్ఫురిస్తున్నది. అంతేగాని పూర్తిగా జడం

Brahmasri Yalamanchili Srinivasa Rao www.advaitavedanta.in

కాదు. పూర్తి జడమైతే చైతన్య స్పర్శకోలుపోయి అసలే కనిపించకూడదు మనకు జడమైన పదార్థమేది గాని. ఘటపటాదికమైన పదార్థాలన్నీ మనకు నిత్యమూ భాసిస్తున్నాయి గదా. చైతన్య స్పర్శ ఉండటం మూలాన్నే అలా భాసించ గలుగుతున్నాయని అర్థం చేసుకోవాలి మనం. అయితే చైతన్యమందులో అత్యల్పంగా ఉన్నందువల్ల బయట పడి కనిపించటం లేదు. అంత మాత్రమే.

అంచేతనే ఇలాంటి జడ పదార్థాల్లో వ్యాపించి ఉన్న శక్తి జడ శక్తి అని పేర్కొనబడుతున్నది. చైతన్యంతో ఓతప్రోతమయి ఉన్నదే ఈ జడశక్తి కూడా. దేవీ భాగవతంలో దేవి మహిషాసురుణ్ణే సంబోధించి చెప్పిన మాట ఈ భావాన్నే బల పరుస్తున్నది. జడాహం తస్య సాన్నిధ్యాత్ ప్రభవామి సచేతనా. నేను స్వతహాగా అచేతననైనా చేతనుడైన పరమాత్మతో నిత్యమూ కలిసి ఉన్నందు వల్ల చిద్రూపిణి నే ఎప్పుడూ. జడ రూపిణిని కాను. అని స్వయంగానే చాటి చెప్పిందా దేవి.

ఇలాటి జడ శక్తి చేత అది జడాత్మకంగా పరిణమిస్తున్నది. ఇక్కడ కూడా జడ శక్తి అనటంలో నిమిత్త కారణం జడాత్మికా అనటంలో ఉపాధాన కారణం తొంగి చూస్తున్నవి. అప్పటికి లోకంలో ఏయే జడ పదార్థాలు మన కంట పడుతున్నవో అవన్నీ అ జడ శక్తి పరిణమించిన రూపాలే అని గ్రహించాలి మనం. ఆ శక్తే ఘటమని పటమని కుడ్యమని ,కవాటమని ఇలాగా ఇన్ని రూపాలలో మారి కనిపిస్తున్నది. ఇంతకు ముందు ఎలాగైతే మనుష్య పశుపక్ష్యాది చేతన రూపాలుగా ఆ చిచ్ఛక్తే మారి కనిపిస్తున్నదని చెప్పామో అలాగే ఇక్కడా ఘటపటాది జడ పదార్థాల

రూపాలుగా ఆ దేవి జడ శక్తే పరిణమించి మనకు కనిపిస్తున్నది. రూపాలుగా పరిణమించటంలో ఆ శక్తి ఉపాదానమయితే- అలా పరిణమించాలనే సంకల్పంతో లేదా ప్రయత్నంతో ఆ శక్తి నిమిత్తమయింది. ఇంతకూ చేతనాచేతన ప్రపంచమంతా సృష్టించాలని సంకల్పించింది అదే. సంకల్పానుగుణంగా మారి కనిపిస్తూ ఉన్నదీ అదే.

## 15. అనేక కోటి బ్రహ్మాండ జననీ

ప్రతి ఒక్క పదార్థంలోనూ లోపల మరుగు పడి ఉన్న చైతన్య భాగమూ అదే - పైకి కనిపించే జడభాగమూ అదేనని తీర్మానించాము. ఇందులో నిమిత్తకారణంగా చేతనం. ఉపాదానంగా జడం. అప్పటికి చేతనాచేతన జగత్తంతా శక్త్యాత్మకమే అయి కూచుంది. కాగా ఈ జడసృష్టి ఎలా జరిగిందో- చేతన సృష్టి ఎలా జరిగిందో రెండు నామాలు మనకు ప్రపంచించి చెబుతున్నాయి. అందులో మొదట జడ సృష్టి ఎలా జరిగిందో విందాము

బ్రహ్మాండమంటే ఆకాశం. అదీ ఒకటి గాదు కోటి. ఒక కోటి గాదు అనేక కోట్లు. అసంఖ్యాకమని అర్థం. అందులో మనకు గోచరమవుతున్నదొక ఆకాశం. ఇది మనలను చుట్టూ వాటేసుకొని ఉంది. ఈ బ్రహ్మాండంలో తిరుగున్నాయి లెక్కలేనన్ని అండాండాలు అంటే సూర్య గ్రహ చంద్ర నక్షత్రాది గోళాలు. వాటిలో ఒకటి మనం నివసించే ఈ భూమండలం. దీనిలో మరలా పరిభ్రమిస్తున్నాయి మన శరీరాలనే పిండాండాలు. ఇవి ఎనభై నాలుగు లక్షల జీవ రాసులని పేరు. రాసులే ఇవి. ఒక్కొక్క రాశిలో కోటాన కోట్లు జీవ శరీరాలు.

ఈ ప్రకారంగా ఆలోచిస్తూ పోతే మన ఆలోచనే కుంటుపడుతుది. పని చేయక నిలిచి పోతుంది. ఇలాంటి ఇంతటి విస్తారం గల జడ ప్రకృతిని అవలీలగా బయట పెడుతున్నదంటే ఆ శక్తి ఎంత ప్రభావం గలదో ఎంతటిదో వర్ణనాతీతం. వర్ణించటమనే మాట వస్తే మనం కాదు. దానినదే వర్ణించి చెప్పవలసి ఉంటుంది.

## 16. ఆకీట బ్రహ్మ జననీ

కేవలం ఇలాంటి జడ ప్రకృతినే కాదు. చేతన ప్రకృతికి కూడా ఆ మహాశక్తే జనని. పిపిలికాది బ్రహ్మ పర్యంతమని వర్ణిస్తారు పెద్దలు. పిపీలకలంటే చీమలు దోమలు మొదలైన కీటకాలు. ఈ కీటకాలు మొదలుకొని సత్యలోకాధిపతి అయిన బ్రహ్మదేవుడి వరకు ఎంత చేతన ప్రపంచముందో దానినంతటిని సృష్టించింది ఆ మహాతల్లే. చేతనాచేతనాలనే రెండు రూపాలలో ఆవిడే గదా పరిణమించిందని వర్ణించాము. అందులో అచేతన భాగమెంతటిదో నిరూపించాము. ఇప్పుడు రెండవదైన చేతన భాగాన్ని నిరూపిస్తున్నదీనామం. జడ పదార్థాలలో మాదిరి చేతనాలలో శక్తి మార్పు చెందదు. గుణంలో మార్పు లేకున్నా పరిమాణంలో ఉన్నట్లు కనిపిస్తుంది. కీటకం మొదలు హిరణ్యగర్భుడి వరకు విచారిస్తూ పోతే చైతన్యంలో తారతమ్యమెంతో గోచరిస్తుంది. అది ఇలాంటిదని గాని ఇంత అని గాని లెక్కించి చూపలేము. ఆలోచనకు మించిన వ్యవహారమది.

భూలోకం మొదలు సత్యలోకం వరకు ఊర్ధ్వ లోకాలేడు. అతలం మొదలు పాతాళం వరకు అధో లోకాలేడు. వెరసి పద్నాలుగు లోకాలు. ఈలోకాలలో నివసించే దేవమానవ దానవాది

జాతులకు లెక్క లేదు. అంతే కాక పశుపక్షి సరీసృపాదులు కూడా ఎన్నో ఉన్నాయి. వాటిని పరిగణించలేము. అందులోనూ ప్రతిఒక్క జీవికీ మనసులో ఎన్ని ఆలోచనలో ఎన్ని మాటలో ఎన్ని శారీరకమైన చేష్టలో వర్ణించి చెప్పటానికి బ్రహ్మకు సాధ్యంకాదు. ఈ విధంగా ఇంత గొప్ప జడ చేతనాత్మకమైన సృష్టి వ్యాపారాన్ని సాగిస్తున్నదంటే ఆ మహా శక్తి ఎంత మహిమాన్వితో వేరుగా చెప్ప బనిలేదు. అంతే కాదు. సృష్టికి పూర్వం ఈ జడ చేతన ప్రపంచమంతా ఎక్కడో కాదు. ఆ మహా శక్తి గర్భంలోనే గుప్తమయి ఉన్నదట. విశ్వ గర్భా, స్వర్ణ గర్భా అని సహస్ర నామాలలో రెండు నామాలు దీనినే బయటపెడుతున్నాయి. విశ్వమంటే జడ ప్రపంచం. స్వర్ణ మంటే హిరణ్యగర్భుడికి పర్యాయమైన చేతన ప్రపంచం. ఈ రెండూ ఆవిడ గర్భంలో ఉన్నాయంటే అప్పుడది అవ్యక్తంగా ఉన్న శక్తి మాత్రమే. అదే సృష్టి చేయాలని ఎప్పుడు ఉన్ముఖమయిందో అవ్యక్తమయిన దశను విడిచి వ్యక్తమయిన జడచేతన రూపంగా పరిణమిస్తుంది. అలా పరిణమించినా కూడా ఈ వ్యక్తమయిన రూపం మరేదో కాదు. అవ్యక్తమయిన ఆ శక్తి రూపమే. అంతేగాదు. అవ్యక్తదశలోనే గాక వ్యక్త దశలో కూడా ఈ చేతనాచేతన జగత్తు ఆవిడ గర్భవాసంలోనే ఉంది. ఆ పరిధి దాటి ఎక్కడా అడుగు పెట్టలేదు.

### 17. పరా- ప్రత్యక్చితీ రూపా 18. పశ్యంతీ - పరదేవతా

కావచ్చు. కాని ఆ దేవి అవ్యక్త గదా . అవ్యక్త అయిన శక్తి మరలా వ్యక్త మయిన దశను ఎలా పొందగలిగింది. ఆ మార్గమిప్పుడు వివరించబడుతున్నది. అవ్యక్తమయిన శక్తి వ్యక్తంగా మారటంలో నాలుగు భూమిక లేర్పడుతున్నాయి. మొదటిది పర.

దానికి విశేషణమే ప్రత్యక్ అని చితిరూపమని. చిదేక రస రూపిణి అనిగదా ముందు పేర్కొన బడింది . ఆ చిత్తు ఎప్పుడూ ప్రత్యగ్రూపమే. పరాగ్రూపం కాదు. పరాగ్రూపమైతే అది విషయకోటిలో చేరిపోతుంది. విషయం కాదది .నరూపం గనుక ఎప్పుడూ విషయి గానే ఉంటుంది. ఇలాంటి చైతన్యమాత్ర స్వభావమైన శక్తికి పరా అని పేరు. దానికి పరంగా మరే దశా లేదు.

ఇలాంటి పర పరమశివునితో కలిసి ఉన్నంత వరకూ ఒక స్పందనమని గాని సృష్టి అని గాని ఎరగదు. అది సృష్టించాలని సంకల్పిస్తే దానికనుగుణంగా ఒక స్పందన ఏర్పడుతుంది. ఈ స్పందించే దశనే పశ్యంతి అని పేర్కొన్నారు. పశ్యంతి అనగా ఈక్షణ మని ఇచ్ఛాకారిణి అని అర్థం. ఈ ఇచ్ఛా శక్తే ఆ దేవి రెండవ దశ. పర జ్ఞానమయితే ఇది ఇచ్ఛ. లౌకికమైన న్యాయాన్ని బట్టి చూచినా ఇది మనకు బోధపడుతుంది. లోకంలో ఒక మానవుడు ఏదైనా ఒకటి సంకల్పించే ముందు నిశ్చలమైన మనసుతో ఉంటాడు. అతడేదైనా ఒకటి కోరితే నిశ్చలమైన ఆ మనసులో ఇచ్ఛారూపమైన ఒక చలనమేర్పడుతుంది. అలాగే ఆ భగవతి సంకల్పించనంత వరకూ పరగా ఉండి సంకల్పం చేసే సరికి పర పశ్యంతి గా మారుతున్నది.

## 19. మధ్యమా 20. వైఖరీ రూపా

పశ్యంతి తరువాత మధ్యమ అనేది మూడవ భూమిక. రెండు నాలుగు భూమికలకు మధ్యలో వస్తుంది గనుక దీనికి మధ్యమ అని పేరు వచ్చింది. ఇచ్ఛా రూపిణి అయిన శక్తి ఫలభాగిని కావాలంటే క్రియారూపాన్ని ధరించాలి గదా. ఈ ఇచ్ఛా క్రియలు

రెండింటి నడుమ మెలగుతున్నందు వల్ల కూడా దీనిని మధ్యమ అని పేర్కొన వచ్చు. ఈ దశలో నామారూపాత్మకమయిన సృష్టి అంతా ఇంకా స్పష్టంగా బయట పడలేదు. అతి సూక్ష్మ రూపంగానే వర్తిస్తుంది. అందుకే దీనికి ముకుళితావస్థ అని పేరు పెట్టారు తాంత్రికులు.

ఈ ముకుళితావస్థే క్రమంగా వికస్వరమయ్యే సరికి అది వైఖరీ రూపంగా మారుతుంది. ఇది ఆ పరాభట్టారిక నాలుగవ భూమిక. విశేషేణ ఖరా విఖరా- విఖరైవ వైఖరీ. విశేషంగా కఠినమైనదేదో అది వైఖరి. పృథివ్యాదికమైన ఈ జడ ప్రపంచమంతా స్థూలంగా కఠినంగా కనపడుతూ ఉంది మనకు. ఇదే వైఖరి అంటే. శక్తి తాలూకు అతి స్థూలమైన అవస్థ ఇది. అతి సూక్ష్మ పర అయితే అతి స్థూల వైఖరి. ఎక్కడే గాని ఇదే వరస. సృష్టి ఎప్పుడూ సూక్ష్మంతో మొదలయి స్థూలంతో ముగుస్తుంది. ఇందులో అతి సూక్ష్మ పర. కొంత సూక్ష్మ పశ్యంతి. కొంత స్థూల మధ్యమ. అతి స్థూల వైఖరి. ఇలా ఉత్తరోత్తరం అవ్యక్త మయిన దశ నుంచి వ్యక్తమైన దశ వరకు ప్రయాణిస్తున్నదా శక్తి.

## 21. తత్త్వాధికా - తత్త్వమయీ

అవ్యక్త వ్యక్త అని రెండు వర్గాలుగా పరిగణించినప్పటికి వస్తుతః అది రెండుగాదా శక్తి. పర మొదలు కొని వైఖరి వరకు కనిపించే అన్ని భూమికలలోనూ ఆ పరా భట్టారికే దేదీప్యమానంగా వెలిగిపోతున్నది. భూమికలు మాత్రమే ఇవన్నీ ఆవిడకు. వీటి మూలంగా ఆవిడ స్వరూపానికెప్పుడూ ముప్పు లేదు. అసలు

మార్పే లేదు. స్వరూపమనే దావిడకు సత్తా స్ఫూర్తులు రెండే. వాటికే సచ్చిత్తులని నామాంతరం. రెండూ నిరాకారమే గనుక ఒకే ఒక తత్త్వం. స్థితిని విడిచి చితి లేదు. చితిని విడిచి స్థితి లేదు. ఇలాంటి నిర్విశేషమయినది దేవీ స్వరూపం. ఇచ్ఛాదుల దగ్గర నుంచి వృధివ్యాధి భూత జాలం వరకు మిగతా దశలన్నీ దానికి విశేషాలే.

ఈ విశేషాలకే తత్త్వాలని కూడా పేరు. శివాది క్షిత్యంతం ముప్పై ఆరు తత్త్వాలను పరిగణిస్తారు తాంత్రికులు. అందులో శివ తత్త్వమొకటి తప్ప తక్కిన దంతా విశేష రూపమే. శివతత్త్వం చిన్మాత్ర స్వరూపం గనుక అది విశేషం గాదు. నిర్విశేష సామాన్య రూపం. అలాంటి దానితో అభిన్నమైనది గనుక శక్తి కూడా శివతత్త్వం లాగా తత్త్వాధిక. మిగతా విశేష రూపములైన తత్త్వాలన్నింటికీ అతీతమైనదని భావం.

తత్త్వాధిక అయి కూడా మరలా అది తత్త్వమయి అని పేరు గాంచింది. ఇదే చిత్రం. తత్త్వమయి అంటే షట్త్రింశత్తత్త్వ రూపిణి అని అర్థం. అంటే ముప్పై ఐదు తత్త్వాలకు అతీతమయి కూడా మరలా ఆ తత్త్వాల రూపంలోనే చేరి పోయిందట ఆ శక్తి. ఇది ఎలా సంభవమని సందేహించనక్కర లేదు. అన్ని దశలలోనూ ఆ శక్తి తత్త్వం తాలూకు ప్రత్యభిజ్ఞ మనకు కలుగుతూనే ఉంటుంది. ఇది ఆ శక్తి రూపమే గదా అని ఎక్కడి కక్కడ జ్ఞప్తికి వస్తూనే ఉంటుందని భావం. శివతత్త్వం మొదలు భూతత్త్వం వరకూ- అది నామమే కావచ్చు రూపమే గావచ్చు క్రియే గావచ్చు- ఏది పరీక్షించి చూచినా ఈ ఉపాధులన్నీ సచ్చిద్రూపమైన శక్తి చేతనే ఆవరింప బడి ఉన్నాయి. ప్రతి ఒక్కటీ లోకంలో అస్తి భాతి- ఉన్నది కనిపిస్తున్నదనే చూస్తుంటాము. లేదు కనిపించటం లేదని

అనుకోము. కాగా నామ రూప క్రియలలో ఎక్కడి కక్కడ విశేషాలు కనిపిస్తే కనిపించ వచ్చు. కాని ఆ విశేషాలన్నీ సామాన్యరూప మయిన సచ్చిత్తులను దాటి పోవు. వాటిని విడిచి ఎక్కడా ఉండలేవు.

కనుకనే వీటన్నిటికీ ఉపాదాన భూత అయిన ఆ దేవికి తత్త్వమయి అని పేరు వచ్చింది. తత్త్వమయి అనే మాటలో హిరణ్మయి అన్నట్టు ప్రపంచానికి ఉపాదాన కారణ మనే భావమే స్ఫురిస్తున్నది. హిరణ్మయమైన ఆభరణాలు హిరణ్యానికి వేరు కావు గదా. అలాగే తత్త్వమయి అయినా ఆ దేవికి ఈ తత్త్వాలన్నీ వేరుగా లేవని ప్రతిపాదించినట్టయింది. కనుకనే పరాశక్తి తాలుకు నామ రూప ప్రపంచమంతా దాని విభూతి గానే భావించాలి మనం. చిచ్ఛక్తే ఈ రూపాలలో మనకు గోచరిస్తున్నది.

తత్త్వాధిక అనే నామం ఆ శక్తి ఈ ప్రపంచానికి నిమిత్తకారణమని సూచిస్తున్నది. నిమిత్తమెప్పుడూ ఘటానికి కుమ్మరి లాగా దూర దూరంగానే ఉంటుంది. తత్త్వమయి అనే నామం ఆ శక్తి దీనికి ఉపాదానమని సూచిస్తున్నది. ఉపాదానమెప్పుడూ సువర్ణంలాగా కార్య జగత్తుతో ఏకమై ఉంటుంది. దీనిని బట్టి శక్తి ప్రపంచానికి ఎంత దూరమో అంత దగ్గర అనే రహస్యమొకటి మనకు ధ్వనిస్తున్నది. ఇంతకూ ఉపాదాననిమిత్తాలు రెండూ ఈ ప్రపంచానికా శక్తి ఒక్కటే అనటం మూలంగా జగదాత్మికా జగన్నియామికా కూడా ఆ మహా శక్తేనని మరొక భావం కూడా మనకు తేట పడుతున్నది. జగదాత్మిక అంటే జగత్తంతా తానే అని జగన్నియామికా అంటే జగద్రూపంగా మారిన తన్ను తానే నియమిస్తున్నదని భావం. దీనిని బట్టి జీవుడికిక ఏ బాధ్యతా లేదు. అంతా ఆ దేవి విలాసమే. ఎటు వచ్చి అలాంటి

నిర్విచారమైన భావమేర్పడాలి ఈ జీవుడికి. అప్పుడే ఈ సంసార బంధం నుంచి విముక్తుడు కాగలడు.

## 22. చరాచర జగన్నాథా

కాని ఇలాంటి మహా భాగ్యం మనకింకా కలగటం లేదంటే ఆశ్చర్యం. సర్వ ప్రపంచమూ పర నుంచి వైఖరి వరకూ- శివ నుంచి క్షితి వరకూ- అంతా దేవీ మయమయి కూడా మనకలా భాసించక పోవటం ఎంత దురదృష్టం. ఆవిడే జగదాత్మికా ఆవిడే జగన్నియామికా- మనదేమీ లేదు- అనే ఉదాసీన బుద్ధి మనకేమాత్రమూ కలగటం లేదు. మీదు మిక్కిలి మనమే కర్తలం- మనమే భోక్తలమని భావిస్తూ అలాగే ప్రవర్తిస్తున్నాము. నిజంలో కర్తలమూ కాము భోక్తలమూ కాము మనం. ఆ దేవియే సర్వ కర్త్రి. ఆవిడే సర్వ ఫల భోక్త్రి. ఎందుకంటే చరాచర జగన్నాథ ఆవిడ. చరాచరాలంటే చేతనాచేతనాలు. వీటన్నిటికీ ఆవిడ నాథ. నాస్తి అథ అనంతరం యస్యాః సా నాథా. ఏది తప్ప విడిచి మరి ఒక శరణ్యమంటూ లేదో దానికి నాథ అని పేరు. జీవులందరికీ ఏకైకమయిన శరణ్యం ఆ పరాశక్తే. ఆవిడ వివర్తమే గదా ఈ చరాచర జగత్తు. అంచేత ఆ శక్తే సర్వస్వమని దానికర్తృత్వాన్నే సర్వ వ్యవహారాలలోనూ దర్శించాలి మనం. భోక్తృత్వం గూడా ఆ శక్తిదేనని భావించాలి. మధ్యలో మనం మన బుద్ధులతో ప్రవేశించరాదు. ఆ చైతన్య రసం చేతనే గదా అనువిద్ధమై ఉన్నాయి మన బుద్ధులు కూడా

## 23. సర్వానుల్లంఘ్య శాసనా

ప్రవేశించటమని చెప్పాము. మాట సామెతే గాని అలా

ప్రవేశించటం గూడా మనకు సాధ్యం కాని పని. కారణమేమంటే ఆవిడ సర్వాను ల్లంఘ్య శాసన. సర్వులంటే ఇటు జీవులు అటు జగత్తు సకల పదార్థాలు- ఆ మహా శక్తి శాసనాన్ని అణు మాత్రం కూడా ఉల్లంఘించి పోలేవు. అనుల్లంఘ్యమయినది ఆవిడ శాసనం. మహా రాజ్ఞి అని గదా వర్ణించారాదేవిని. ఒకరాజ్ఞి లాగానే అప్రతిహతమైన శాసనంతో పరిపాలిస్తున్నదీ జగత్తునంతటినీ. ప్రతి ఒక్క ప్రాణి ఆ విడ ఆజ్ఞను శిరసా వహించి నడచు కోవలసిందే. అతిక్రమించి పోవటానికి లేదు. కాకపోయినా ఎలా అతి క్రమించ గలము. అండపిండాదికమైన సమస్తమూ ఆవిడ క్షేత్రమే. క్షేత్రేశీ క్షేత్ర పాలినీ అని ఆవిడ పేర్లు. అలాంటప్పుడు ఆవిడ పొలం సరిహద్దులు దాటి అడుగు బయట పెట్టటానికి ఎవరికీ సాధ్యం కాదు.

కారణ మేమంటే జగదాత్మిక జగన్నియామిక అని గదా వర్ణించాము. జగదాత్మకత్వం వల్ల చతుర్దశ భువనాలూ ఆవిడ చేతిలోనే ఉన్నాయి. జగన్నియామకత్వం వల్ల వాటి మీద ఆవిడ ఆధిపత్యమే సాగుతున్నది. ఏది ఎక్కడ ఎలా ఉండాలో అది అక్కడ అలాగే ఉండాలి. మరొక విధంగా ఉండటం అనేది సంభవం కాదు. ఇలాంటి నియమానికే శాసనమని పరు, సర్వాత్మకత్వం వల్లనే ఇది సంభమవుతుంది. కనుక ఆ పరిధి లోనే జీవ యాత్ర సాగించే మనబోటి జీవులందరికీ ఆ పరిధిని దాటి పోవటం కలలోని వార్త. మనకే గాదు. మనకతీతమైన శక్తులని భావించే ముప్పైమూడు కోట్ల దేవతలకే అది తలకు మించిన వ్యవహారం. భీషాస్మాత్ వాతః పవతే - భీషోదేతి సూర్యః అని ఉపనిషద్వాణి. ఆ మహాశక్తి భయంతో గాలి వీస్తున్నదట సూర్యుడు

ప్రకాశిస్తున్నాడట. వాయ్వాది దేవతలకే దిక్కులేనప్పుడిక మానవమాత్రుల మాట చెప్పేదేముంది. అంచేత మనమే కర్తలమన్నింటికి అనే అభిమానాన్ని దూరంగా పరిత్యజించి ఆ మహా శక్తి శాసనాన్ని అనుసరించి పోవటం ఎంతైనా శ్రేయస్కరం.

## 24. పంచకృత్య పరాయణా

పోతే ఆ పరా భట్టారిక శాసనమెలాంటిది- ఎలా శాసిస్తున్నదీ ప్రపంచాన్ని- అనే విషయాన్ని వర్ణిస్తున్నదీ నామం. ఆవిడ పంచకృత్య పరాయణ. పంచకృత్యాలంటే ఐదు పనులు. ఆ ఐదు పనులూ చేయటమే పరాయణం. ఆవిడ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించటానికే పరా రూపిణి అయిన ఆ శక్తి వైఖరి వరకూ ప్రయాణం చేసి వచ్చింది. సృష్టి స్థితి సంహారం - తిరోధానం అనుగ్రహం- అనేవే ఆ పంచకృత్యాలు.

వీటిలో సృష్టి స్థితి లయాలనేవి మూడూ ఆ దేవి జగదాత్మ కత్వాన్ని తెలుపుతున్నాయి. ప్రపంచ రూపంగా పరిణమించింది ఆవిడే గదా. పోతే తిరోధాన అనుగ్రహాలనేవి రెండూ ఆవిడ జగన్నియామకత్వాన్ని చాటుతున్నాయి. తన చైతన్య శక్తిని సంకోచింప జేసుకొని ఆవిడ ఈ జీవకోటిని సృష్టించింది. సంకోచ కారణంగా వీరి జ్ఞానైశ్వార్యాలను తిరోహితం చేసింది. ఇదే తిరోధానమంటే మరలా క్రమంగా వికసింప జేస్తూ ఈ జీవ కోటిని ఆవిడే అనుగ్రహిస్తుంది. అప్పుడు తిరోహితమయిన జ్ఞానైశ్వర్యాలు పరిపూర్ణత చెంది జీవుడు తరించ గలడు. తిరోధాన అనుగ్రహాలు ఆవిడ నిరంకుశంగా చేయుటం లేదు. జీవులు చేసుకొన్న సుకృత దుష్కృతాల కనుగుణంగా ఆవిడ సాగించే

వ్యాపారాలివి. అలా కాకుంటే రాగద్వేష దూషిత కావలసి వస్తుంది ఆ పరా శక్తి. అది ఆవిడ నిరంజనత్వానికి భంగకర మవుతుంది.

ఇక్కడ పంచకృత్యములని పరిగణించినప్పటికీ వస్తుతః అవి పంచ కృత్యాలు కావు. ఆ మాటకు వస్తే రెండే ఆ దేవి నిర్వహించే కృత్యాలు. సృష్టి స్థితి లయాలని వర్ణించిన మొదటి మూడూ తిరోధానమనే నాలుగవ దానిలోనే చేరిపోతాయి. తిరోధాన శక్తికి అదనంగా ఆ మూడు వ్యాపారాలూ కానరావు. ఎందుకంటే పరిపూర్ణమయిన శివచైతన్యం తిరోహితం కావటం మూలాన్నే ప్రపంచ సృష్టి స్థితి సంహారాలు ఏర్పడినట్లు జీవుడికి భాసిస్తున్నది. ఇలాంటి తిరోధానమే లేకుంటే ఏదీ నిర్మాణమూ కాదు. నిలవనూ నిలవదు. మరలా లయమయ్యే ప్రసక్తీ లేదు. పరిశుద్ధమూ పరిపూర్ణమూ అయిన ఆ చైతన్యం అలాగే చెక్కు చెదరకుండా ఉండి పోగలదు. అది సృష్టి స్థితి అంటూ మరొక లాగా మారటమనేదే ఉండబోదు.

**25.** సృష్టి కర్త్రీ - బ్రహ్మ రూపా **26.** గోప్త్రీ - గోవింద రూపిణీ

**27.** సంహారిణీ - రుద్ర రూపా **28.** తిరోధాన కరీ - ఈశ్వరీ

**29.** సదాశివా - అనుగ్రహదా.

ప్రస్తుతమూ సృష్ట్యాదులైన పంచకృత్యాలనూ - వాటినాదేవి ఎలా నిర్వర్తిస్తుందో ఆ విధానాన్నీ - సవిస్తరంగా నిరూపిస్తున్నదీనామావళి. మొదట బ్రహ్మ అనే రూపాన్ని ధరించి ఈ చరాచర జగత్తునూ సృష్టిస్తున్న దాదేవి. బృహధాతువు నుంచి ఏర్పడింది బ్రహ్మ అనే శబ్దం. ఆ ధాతువుకు స్ఫోటనమని అర్థం. స్ఫుటితమయ్యే ఆ శక్తి ఈ ప్రపంచాన్ని కల్పించింది. స్ఫుటితం

కాకుంటే సృష్టించటమనేది అసంభవం. స్ఫుటన చెందిన ఆ దశే బ్రహ్మ రూపా. బ్రహ్మ రూపా అని పేరెక్కొనటం వల్ల ఆ శక్తి తానే బ్రహ్మ అయి సృజిస్తున్నదని ధ్వనిస్తుంది. అంటే శక్తికి భిన్నంగా బ్రహ్మదేవుడొకడు వేరే లేడని భావం. పరా శక్తే బ్రహ్మ అనే రూపంలో మలుపు తిరిగి కనిపిస్తున్నది. సువర్ణమే మలుపు తిరిగి కటక కుండలాది రూపాలలో కనిపించినట్టు. కనుక స్ఫుటిత అని పేర్కొన్నా అది వాస్తవంలో అస్ఫుటితమే. స్ఫుటితమయి కనిపించటం కేవలమొక ఆభాస. అంతేకాదు. ఇక్కడ బ్రహ్మ రూపా అనటంలో ఉపాదానమూ - సృష్టి కర్త్రీ అనటంలో నిమిత్తమూ రెండు ఆ శక్తే అవుతున్నదని మరలా వర్ణించినట్టయింది. దీని మూలంగా సృష్టి ఆవిడే సృష్టి కర్త్రి ఆవిడే. ఆ పరా శక్తికి వ్యతిరిక్తంగా ఏది చూడరాదని కూడా సాధకుణ్ణి హెచ్చరించినట్టయింది.

సృష్టి ఎలాగో స్థితి కూడా అలాగే శక్తి కర్తృకం శక్త్యాత్మకమే నని గ్రహించాలి మనం. గోప్త్రీ - గోవింద రూపిణీ అని ప్రపంచ స్థితిని వర్ణిస్తున్నది నామం. గోవింద రూపాన్ని ధరించి జగత్తును గోపనం అంటే పాలనం చేస్తున్నదట. గో అంటే అనేకర్థాలున్నాయి. ఇంద్రియ జ్ఞాన వృత్తులకు కూడా గో అనే పేరు. వాటితో వ్యవహరించే దేవత ఏదో అది గోవింద రూపిణి. దీని మూలంగా జగద్వ్యవహార రూపమైన స్థితి ధ్వనిస్తున్నది. ఇక్కడా ముందు వర్ణించినట్టు గోవిందుడనే వేషం వేసుకొని జగత్ స్థితి రూపంగా కనిపిస్తున్నదీ - దీన్ని నియమిస్తున్నదీ - ఆ దేవేనని సూచిస్తున్నదీ నామం.

ఇలాగే రుద్ర రూపాన్నికూడా దాల్చి స్వకృతమైన విశ్వాన్ని సంహరిస్తున్నది దేవి. సంహరిస్తున్నదంటే తన స్వరూపంలో కలుపుకొంటున్నదని భావం. కనుకనే సర్వాత్మనా ఈ జగత్తు ప్రళయ కాలంలో నశిస్తుందని శంకించరాదు. కేవల మంతర్భావనమే సంహారమంటే. శక్తి బయటపడటమే సృష్టి. మరుగు పడటమే లయం. ఎంచేత నంటే లేనిది రాదు ఉన్నది పోదని సిద్ధాంతం. రుద్ర అంటే రోదనం చేసేది. రోదనం చేయటమంటే ఇక్కడ ధ్వని చేయటం. అనాహత రూపమైన స్పందమే ధ్వని. దానికే చలనమని కూడా పేరు. చలనాత్మకమైనది ప్రాణం. అది లయ కాలంలో పిండాండాన్ని బ్రహ్మాండాన్ని రెండింటిని వదలి పోతూ మూలస్థానమైన చిచ్ఛక్తిలో లీనమవుతుంది. అందుకే దాన్ని రుద్ర అని నిర్దేశించారు. శక్తే ప్రాణ రూపంగా అవతరించి మరలా శక్తి రూపాన్నే పొందుతున్నది. ఇదే సంహారమనే వ్యాపారం.

ఇలా ఈ మూడు కార్యాలూ అనుష్ఠిస్తూ తన చితిశక్తినది కప్పి పుచ్చుతున్నది. తిరోధాన కాలంలో దానికీశ్వరి అని పేరు. ఈశ్వర రూపంగా పరిణమిస్తుందని అర్థం. ఈశనం చేయుటమే ఈశ్వరత్వం. నియంత్రించే సామర్థ్యం. ఈ నియంత్రణ మూలంగానే తిరోహితమవుతున్నది జీవుల శివస్వరూపం. అలాంటి తిరోధానం చేస్తూ - తిరోధానమవుతూ- రెండు రూపాలుగా ఉన్నదా ఈశ్వరి. ఇలా తిరోధానమే గాదు. దానికి భిన్నంగా సాధక జనుల ననుగ్రహించే అనుగ్రాహిణి కూడా అదే. తన్ను తాను ఎలా సంకోచించుకోగలదో అలాగే తన ఇష్టానుసారంగా వ్యాకోచించగలదా దేవి. ఒక మహాభుజంగి లాగా సంకోచ వ్యాకోచాలు రెండు పనులూ చేయగలదు. అలా చేసినప్పుడు దానికి సదాశివా

అని వ్యవహారం. పూర్ణ వికాస భాసురం కాబట్టి సంసారరూపమైన అశివమంతా ఎగిరి పోతుంది. కనుక అంతా శివస్వరూపమే. ఈ శివాత్మకమైన దశ సదా నిలిచి ఉంటుంది గనుక సదా శివా అనే సంజ్ఞా దాని కన్వర్థం.

ఇది ఆ దేవి అయిదవ భూమిక. ఇదే అసలాదేవి సహజావస్థ. సదా అని పేర్కొనటంలో తెలిసి పోతున్నదది. దీనికి దిగువ చెప్పిన ఆ నాలుగు దశలూ కేవలం ప్రతీతి సిద్ధమే గాని వస్తు సిద్ధం కానేరవు. జీవుడి దృష్టి కేది గోచరమో అది ప్రతీతి సిద్ధం. ఈశ్వర దృష్టికేది అనుభవగోచరమో అది వస్తు సిద్ధం. అది చిన్మాత్రమే మరేది గాదు. దానినలాగే అనుభవానికి తెచ్చుకోలేక ఈ జీవుడు తన శరీరమాత్ర పరిచ్ఛిన్నంగా అభిమానిస్తున్నాడు. తన్నిమిత్తంగా దానికి బాహ్యమైన జగత్తునంతా సర్గ స్థితి లయాత్మకంగా దర్శిస్తున్నాడు. దేవి తిరోధాన శక్తి చేత తన చైతన్య స్వభావ మడుగున బడిపోయి సంసార సాగరంలో తలమునుక లవుతున్నాడు.

**30.** విశ్వరూపా - జాగరిణీ **31.** స్వపంతీ - తైజసాత్మికా

**32.** సుప్తా - ప్రాజ్ఞాత్మికా **33.** తుర్యా-సర్వావస్థా వివర్జితా

ఈ విధంగా తన పూర్ణ స్వరూపం మరుగు పడి అపూర్ణుడనని తన్ను తానెంతవరకు భావిస్తాడో - అంత వరకూ అతని దృష్టినే అనుసరించి ఆ దేవి తన పూర్ణత్వాన్ని కప్పి పుచ్చి దాని స్థానంలో తన అపూర్ణమైన రూపాన్నే చూపుతూ పోతుంది. అదే ఈ సంసార మండలం. చిత్స్వరూపాన్ని సంసారరూపంగా మార్చుకొని బయటపడుతుందని అర్థం. వెలపలే కాదు. లోపలా

కూడా పిండరూపాన్ని ధరించి కనిపిస్తుంటుంది. ఈ కనిపించే శరీరమే పిండమంటే. ఈశరీరాన్ని అభిమానించే చైతన్య ఖండమే జీవుడు. వీడిని యావజ్జీవమూ అంటి పట్టుకొని మూడవస్థలున్నాయి. వాటిలో ప్రతిక్షణమూ తగులుకొని తన పూర్ణమైన చిద్రూపాన్ని ఎప్పుడూ గుర్తించడీ జీవుడు. జాగ్రత్తులోనే కాదు. స్వప్నంలోనే కాదు. సుషుప్తిలోనే కాదు. మూడు దశలలో కూడా ఆ స్పృహ లేదు వీడికి. జాగ్రద్దశలో వీడికి విశ్వుడని పేరు. స్వప్నంలో తైజసుడని పేరు. సుషుప్తిలో వీడికే ప్రాజ్ఞుడని పేరు.

ఈ మూడు దశలూ ఈ జీవుడే అనుభవిస్తున్నాడని మన భ్రమే కేవలం. నిజానికి ఏదశా వీడు వీడుగా అనుభవించటం లేదు. అవస్థా త్రయాన్నీ అనుభవిస్తున్నది వీడిలో అంతర్యామినిగా ఉన్న ఆ దేవతే వాస్తవానికి. ఆవిడే జాగ్రత్తులో విశ్వుడని స్వప్నంలో తైజసుడని సుషుప్తిలో ప్రాజ్ఞుడని పేరు పెట్టుకొని ఆయా వ్యవహారాలు నడుపుతున్నది. ఆ దేవతకు వేరుగా మరొక చైతన్య ధాతువే లేదు గనుక జీవ రూపంగా వ్యవహరిస్తున్నది కూడా ఆవిడే కావలసి ఉంది.

అయితే అలాంటప్పుడు జీవులకు చెప్పే ఈ సంసార బంధం ఆ దేవతకే ప్రాప్తిస్తుంది గదా అని సందేహించవచ్చు. అలాంటి సందేహం పెట్టుకోనక్కర లేదు. కారణమేమంటే ఆ దేవి సర్వావస్థా వివర్జిత. జాగ్రదాదులైన అవస్థలన్నింటిలో ప్రవర్తిస్తున్నా అందులో ఏ అవస్థ కూడా ఆవిడనంటి ముట్టదు. వాటి నుంచి ఎప్పుడూ వివర్జితే. అంటే పైదొలగి ఉన్నదే. చిన్మాత్ర స్వరూపిణి గదా ఆ దేవత. చైతన్యమనేది దేశ కాల వస్త్వాదులకు దేనికి కూడా గురి అయ్యేది కాదు. అంచేత ఈ జాగ్రదాదులైన ఆ

మూడు దశలకూ అతీతంగా తురీయమైన దశ అది. తురీయమంటే నాలుగవదని అర్థం.

వాస్తవంలో తురీయమని గూడా దీనిని పరిగణించరాదు. మూడుదశలున్నప్పుడే నాలుగవదనే దానికి అవకాశం. అసలు జాగ్రదాదులైన మూడు దశలే యథార్థంగా లేవు. చైతన్య వ్యతిరిక్తంగా ఏ ఒక్క దశా లేదని గదా చెప్పాము. ఉన్నట్టు కనిపిస్తున్నవే గాని నిజంలో అవి మిథ్యా భూతమే. అవి మిథ్య అయినప్పుడు తురీయమనే మాటకిక అర్థమేముంది. అయినప్పటికి జీవుడి దృష్టిని బట్టి చెప్పవలసి వస్తున్నదీ అవస్థా చతుష్టయం. అందులో జాగ్రత్స్వప్న సుషుప్తులనే మూడు దశలనూ యథార్థమని భావిస్తూ జీవుడీ సంసార క్లేశమనుభవిస్తూ వీటికి విలక్షణంగా తురీయమనే దశ ఒకటి ఉందని- దానిని అందుకోవాలని కోరుతుంటాడు. అంతే గాని నాలుగు దశలూ తురీయమేనని గుర్తించటం లేదు. ఈ గుర్తించటం ఎంత వరకు జరగదో అంత వరకూ ఆ దేవి తిరోధానమనే కాలపాశం నుంచి మనకు విముక్తి లేదు. మీదు మిక్కిలి ఆ పాశం మనల నంతకంతకు చుట్టి పడవేస్తూనే ఉంటుంది.

## 34. భవచక్ర ప్రవర్తినీ

అది ఎలాగని అడిగితే చెబుతున్నదీనామం భవచక్ర ప్రవర్తినీ అని. భవమంటే జన్మ. భవమంటే సంసారం. సంసారమనేది చక్రంలాగా తిరుగుతూ ఉంటుంది. కనుకనే దీనికి సంసారమని పేరు పెట్టారు. సంసరతీతి సంసారః. అవిచ్ఛిన్నంగా ఒక చక్రంలాగానే పరిభ్రమిస్తుంటుందని భావం. ఈ చక్రంలో చిక్కుబడి పోయాడి జీవుడు. దీని నుంచి బయట పడలేక

పోతున్నాడు. అది భ్రమిస్తుంటే దానితో పాటు తాను పరిభ్రమిస్తూ ఒక జన్మ నుంచి మరొక జన్మ లోనికి వచ్చి పడుతున్నాడు.

ఇక్కడ కూడా జీవుడు కాదు ఈ సంసారమూ కాదు పరిభ్రమించటం వాస్తవంలో. ఈ భవ చక్రానికి ప్రవర్తని ఆ పరా శక్తే. ఆవిడే ప్రవర్తింప జేస్తున్నది. ప్రవర్తిస్తున్నది. రెండు విధాలా ఈ నాటకం అభినయిస్తున్నదావిడే. జగదాత్మిక గనుక భవ చక్ర రూపంగా ప్రవర్తిస్తున్నది. జగన్నియామిక గనుక ఈ భవ చక్రాన్ని ప్రవర్తింప జేస్తున్నది. మొదటి అర్థంలో ప్రవర్తినీ అని - రెండవ అర్థంలో ప్రవర్తనీ అని చెప్పుకోవాలి ఈ నామాన్ని.

కనుక యధార్థంలో భవచక్రమనేదొకటి ఎక్కడా లేదు. ఉన్నదంతా దేవీ స్వరూపమే. దానినలాగే చూడలేక ఈ జీవుడు ఆ దేవతనే భవచక్ర రూపిణిగా దర్శిస్తున్నాడు. దర్శిస్తుంటే వీడి దృష్టిననుసరించి ఆ దేవి కూడా తన స్వరూపాన్ని మభ్య పెట్టి ఈ సంసార రూపంగానే వీడికి దర్శనమిస్తున్నది.

**35.** సుధాసాగర మధ్యస్థా **36.** కదంబ వన వాసినీ

ఎలా దర్శనమిస్తున్నది. ఎక్కడ ఇస్తున్నదీ. సుధాసాగరమధ్యస్థ అయి దర్శనమిస్తున్నది. సుధాసాగరం మన చుట్టూ కనిపించే ఈ సంసార మండలమే. సుష్ఠు ధీయతే పీయతే ఇతి సుధా. చక్కగా ఆస్వాదించే దేదో అది సుధా. అంటే అమృతమని అర్థం. పంచేంద్రియాలతోనూ అంతరింద్రియమైన మనసుతోనూ తనివి దీర ఆస్వాదిస్తున్నామీ సంసారాన్ని మనం. కనుకనే దీనిని అమృతంతో పోల్చి చెప్పారు. అమృత రసం లాగా మనకిది ఆస్వాదయోగ్యమయి కనిపిస్తున్నా నిజానికిది సాగరమే.

గరంతో కూడినదేదో అది సగరం. గరమంటే గరళం లేదా విషమని అర్థం. సగరమంటే అప్పటికి విషంతో కూడినది. సగరమే సాగరం. అది ఈ సంసారమే మనపాలిటికి.

అంచేత ఆపాతతః ఇది సుధా రసం లాగా కనిపిస్తున్నా ఈ సంసారం- ఎప్పటికైనా ఇది హాలాహల విషంగానే పరిణమించే ప్రమాదముంది. సుధారసమనేది సుఖానికి- విషరసమనేది దుఃఖానికి ప్రతీక. రెండింటి నడుమా బిందుస్థానంలో వర్తిస్తూ ఆ దేవి ఈ జీవుడి లాగా సుఖం చేత గాని దుఖం చేత గాని స్పృశించ బడదు. కారణం సామ్యావస్థలో ఉండటమే. సామ్యావస్థే మూల ప్రకృతి. అంచేత సుఖదుఃఖాదుల చేత నియమించబడదు. మీదుమిక్కిలి వాటినే తాను నియమించ గలదు. ఇలాంటి మాహాత్మ్యం కలిగిన ఆ దేవీ స్వరూపాన్ని పట్టుకో లేక ఈ జీవుడు దానికి భిన్నంగా సుఖదుఃఖాలకే పట్టుబడుతున్నాడు. వాటితో యావజ్జీవమూ పరితపిస్తున్నాడు.

ఇంత మాత్రంతోనే దేవీ యాత్ర ముగియ లేదు. సాగరం లాగా ఈ సంసార మండలాన్ని ప్రసరింప జేసి ఇందులో ఒక కదంబ వనాన్ని గూడా ప్రతిష్ఠించింది. ఏమిటీ కదంబ వనం. మరేదో గాదు. జీవుల తాలుకు ఏ వాసనా ప్రపంచముందో అదే కదంబ వనం. వృక్షాల లాగా అనేక జన్మలనుంచి సంచితమైనవి వాసనలైతే- వనం లాగా వాటికాశ్రయమైనది మన ఆశయం. కదంబమనేది మంచి వాసనకు నిలయమైన వృక్షమని లోకంలో ప్రసిద్ధి. దాని లాగా సుఖదుఃఖాది వాసనలు కూడా యావజ్జీవమూ ఈ ప్రాణులను అంటి పట్టుకొని ఉంటాయి. ఎప్పటికి విడిచి పెట్టవు. జన్మాంతరాలలోకి కూడా సంక్రమిస్తాయి.

## 37. కులరూపిణీ

ఇప్పుడీ కదంబవనమనేది ప్రాణులనెలా పరివేష్టించి ఉందో- వారినెలా విడిచి పోదో- వివరిస్తున్న దీనామం. కులరూపిణీ. కులమంటే పాంచభౌతికమైన ఈ శరీరం. పృథివ్యాదులైన పంచభూతాల తామస రాజసాంశములతో తయారయిందిది. మనసు కూడా సాత్వికాంశతో తయారయినదే. ఇలాగా ఈ శరీరం ప్రకృతి గుణాలతో ఏర్పడటం మూలంగా దీన్ని సంఘాతమని వేదాంతులు- కులమని తాంత్రికులు పేర్కొంటారు.

ఏదైనా కావచ్చు. సర్వథా ఇది ప్రకృతి జన్యం. ప్రకృతి కధీనం. ఇందులో ప్రవేశించాడని చెప్పే జీవుడే దానికధీనం కాడు. చిన్మాత్ర స్వరూపుడు జీవుడంటే. అతడు జడప్రకృతికి ఎలా వశపడుతాడు. కాని తాను చిన్మాత్రుడనని అతడు తన స్వరూపాన్ని గుర్తించటం లేదు. పైగా అనాది వాసనా బలంతో శరీరం మేరకే తన స్వరూపాన్ని దించుకొని చూస్తున్నాడు. ఇదిగో ఈ అభిమానమే జీవుణ్ణి ఈశ్వరుడికి దూరం చేస్తున్నది. ఆ ఈశ్వర శక్తే కులరూపిణి అయి ఒక కులాయం లాంటి ఈ కులంలో పక్షి లాంటి ఈ జీవుణ్ణి తెచ్చి పడవేసింది.

## 38. త్వక్స్థా 38. రుధిరసంస్థితా 40. మాంస నిష్ఠా 41. మేదో నిష్ఠా 42. అస్థి సంస్థితా 43. మజ్జా సంస్థా 44. శుక్ర సంస్థితా

పడవేసి ఊరక కూచోలేదు. సప్త ధాతువుల రూపాలు ధరించి వాటితో ఈ జీవుణ్ణి గట్టిగా చుట్టి వేసింది. త్వగస్పృఙ్మాంస మేదోస్థి మజ్జా శుక్రాలని ఇవి సప్త ధాతువులు. ఇవి ఏడూ ఏడు

స్తంభాల లాగా ఈ శరీరమనే గృహాన్ని ధరించి ఇది పడిపోకుండా నిలుపుతున్నాయి. కనుకనే వీటికి ధాతువులని పేరు పెట్టారు. ఇవి ఏడు గట్టి పారల లాగా మన శరీరాల లోలోనికి చొచ్చుకొని పోయి లోపలా వెలుపలా గట్టిగా దీన్ని చుట్టుముట్టి ఉన్నాయి. ఎప్పుడూ దీనిని విడిచి పెట్టవు.

ఇందులో త్వక్కు మొదలుకొని అస్థి వరకు ఉన్న ఐదు ధాతువులూ మనకు బాగా తెలిసినవే. మజ్జా శుక్రమనేవి రెండూ అంత ప్రసిద్ధమైనవి కావు. మజ్జ అంటే ఎముకలలో ఉన్న చమురువంటి పదార్థం. శుక్రమంటే శ్వేత వర్ణమయిన పురుష బీజం. ఇవి రెండూ చాలా పుష్టికరమైనవి అవసరమైనవి శరీర స్థితి గతులకు.

ఇప్పుడీ ధాతువులు ఏడు ఆ పరా శక్తికి బాహ్యంగా ఎక్కడో లేవు. శరీరంలో ఉన్నా అవి శక్తి రూపాలే. శక్తే ఆయారూపాలతో పరిణమిస్తూ త్వగింద్రియం దగ్గర నుంచి సుక్ర ధాతువు వరకూ వ్యాపించి ఉంది. ఆయా ధాతువుల రూపాలలో ప్రచ్ఛన్నంగా మెలగుతూ జీవుడి దృష్టికంతుపట్టకుండా ఉన్నది. ఇక్కడ ఒక సూక్ష్మాన్ని గమనించాలి మనం. స్థా సంస్థా సంస్థితా నిష్ఠా అని వర్ణించినంత మాత్రాన ఆ ధాతువులకు శక్తికి తేడా ఉందని చూడ రాదు. ధాతువులలో శక్తి వచ్చి కూచున్నదని భావించరాదు. శక్తియే ధాతువు ధాతువే శక్తి. తానే ధాతువై తానే దానిలో వచ్చి కూచున్నదా శక్తి. ఆధారమూ అదే ఆధేయమూ అదే. అలా భావించినప్పుడే శక్తి సర్వాత్మకమనే అద్వైత భావం సురక్షితమవుతుంది. కనుక సంస్థా అనే మాటకు శక్తే త్వగాది రూపాలలో మలుపు తిరిగి ఉందని అర్థం చెప్పుకోవలసి ఉంది.

**45.** సుమేరు శృంగ మధ్యస్థా **46.** చింతామణి గృహాంతస్థా

త్వగింద్రియం మొదలు శుక్రధాతువు వరకూ అన్ని రూపాలూ ధరించి ఉండటమే గాదా శక్తి. మేరుదండాన్ని గూడా ఆరోహించి దాని శిఖరాన్ని కూడా అందుకొని దాని మధ్య నిలిచి ఉన్నది. భౌతికమైన మేరువు సుమేరువు కాదు. శరీర గర్భంలో ఉన్న మేరు దండమే సుమేరువు. మూలాధారం నుంచి సహస్రారం వరకు సాగిపోయిన వెన్నెముకే అది. ఈ వెన్నెముక శరీరమనే గృహానికంతటికీ మూల స్తంభం వంటిది. ఇది భగ్నమయితే ఆ శరీరం శరీరమే కాదు.

మేరు దండం బ్రహ్మ దండమని దీనికే నామాంతరాలు. దీని ఎడమ కుడి భాగాలలో ఇడ పింగళ అనే రెండు నాడులు ఊర్ధ్వ ముఖంగా పయనిస్తున్నాయి. ఆ రెండింటి నడుమ సుషుమ్న అనే సూక్ష్మమైన మరొక నాడి ఊర్ధ్వముఖంగానే ప్రసరిస్తున్నది. దానినే కుండలిని అని పేర్కొంటారు యోగులు. కుండలిని అంటే ఆడు పాము. పాములాగా ఇది కూడా పుట్టవంటి మూలాధారం నుంచి సాగి సహస్రారం వరకు ప్రాకి పోతున్నది గనుక కుండలిని అని వర్ణించారు దీన్ని. అలా ప్రాకి పోతూ మేరుశృంగం లాంటి సహస్రారాన్ని అంటే మనో గహ్వరాన్ని అందుకొని అందులోనే విశ్రమిస్తున్నదది.

ఈ విధంగా సాగి పోయే దీని ఊర్ధ్వ యానాన్ని సాధకులెవరు గుర్తిస్తారో వారే దేవీ తత్త్వాన్ని కూడా గుర్తించి తరించ గలరు. అలా గుర్తించి మానవులు తరించాలనే సంకల్పం తోనే ఆ దేవి మన బుద్ధి గుహలో ప్రవేశించి అక్కడే నివసిస్తూ ఈ

మానవుడెప్పుడు తన్ను గుర్తిస్తాడా అని ప్రతీక్షిస్తుంటుంది. ఈ ప్రతీక్షించే దేవీ గృహం కూడా మన ఈ శరీరంలోనే ఉంది. అదే చింతామణి గృహం. గృహం లాంటిది గనుకనే ఇది గృహ మయింది. అది మన బుద్ధే. దీనిలో ఎన్నో మణులు కూడా పోగై ఉన్నాయి. అవే చింతామణులు. చింతలంటే బుద్ధి వృత్తులు. మన ఆలోచనలే. అవే మణుల లాగా ఒకదానికొకటి చేరి బుద్ధి విజ్ఞానంగా పరిణమిస్తున్నాయి. సముద్ర తరంగాల లాంటివివి. సముద్రం మన బుద్ధి అయితే తరంగాలీ ఆలోచనలు. ఇవే మాటిమాటికి ఆవృత్తమవుతూ వాసనలను పుట్టిస్తాయి. అవి కదంబ వాసనల లాగే మన ఈ శరీర వృక్షాన్ని వదలి పోవు. ఈ మొత్తాన్ని కొనా మొదలు వ్యాపించి ఉన్నదా దేవి. ఆవిడే సుమేరు శృంగం. ఆవిడే శృంగ మధ్యస్థ. ఆవిడే చింతామణి గృహం. ఆవిడే తదంతస్థ. ఆ దేవత స్వరూపాన్ని కాదని ఇందులో ఏ ఒక్కటి మనదంటూ లేదు.

## 47. జ్ఞాన విగ్రహా 48. ఆత్మా

మనదేదీ లేదు. అంతా ఆ దేవతే వ్యాపించి ఉందని చెప్పుకొన్నాము. అంతా అంటే త్వగింద్రియం నుంచి సహస్రారం వరకు ఈ సంఘాతమంతా అని అర్థం. దీనినే విగ్రహమని కూడా పేర్కొన వచ్చు. ఈ విగ్రహం మనకిప్పుడు జ్ఞేయంగా కనిపిస్తున్నది. జ్ఞేయమంటే జ్ఞానానికి విషయం. నిజానికి జ్ఞాన విషయం కాదిది. జ్ఞాన స్వరూపమే. అంతా దేవతా స్వరూపమే నన్నప్పుడు అది జ్ఞానమే కావాలి గాని జ్ఞాన విషయమెలా కాగలదు. జ్ఞాన స్వరూపిణే గదా దేవి. ఆవిడ కేదైనా ఒక విగ్రహ ముందంటే అది జ్ఞానమే. విగ్రహం కాని విగ్రహమది. నిరాకారమైనది జ్ఞానం. అలాంటి జ్ఞాన

శక్తి చింతామణి గృహమైన మనసునే కాదు. శరీర మాపాద మస్తకమూ వ్యాపించ గలదు. దాని స్పర్శ ఎక్కడ లేదో అక్కడ అనుభవమే ఏర్పడదు. పాదంలో ఒక ముల్లు గ్రుచ్చుకొంటే దాని వేదన శిరసు దాకా ప్రసరిస్తున్నది. పాదం వరకే సమసి పోదు. వేదన మాట అలా ఉంచి అసలు మనకొక పాదమున్నదనే విషయం కూడా జ్ఞానం లేకుంటే అనుభవానికి రాదు. కేవలం మన ఊ పిండాండమే కాదు. బాహ్యమైన బ్రహ్మాండం కూడా జ్ఞాన ప్రసరణ వల్లనే మనకిది ఫలానా అని భాసిస్తున్నది. సౌరమండలం వరకూ మన జ్ఞానం ప్రసరించక పోతే అది సౌరమండలమని మనమెలా గుర్తించగలుగు తున్నాము. అంచేత జ్ఞేయమైన పదార్థమొకటి ఉండాలన్నా- అది మనకు స్ఫురించాలన్నా- అంతకు ముందు జ్ఞానమనేది ఉండి తీరాలి.

ఈ జ్ఞానానికే ఆత్మ అని కూడా మరొక పేరు. అతతి సర్వత్ర వ్యాప్నోతి ఇతి ఆత్మా. ఏది సర్వత్ర వ్యాపిస్తుందో అది ఆత్మ. యదాప్నోతి యదాదత్తే -యచ్చాత్తి విషయానిహ - యచ్చాస్య సంతతో భావః - తదాత్మేతి నిగద్యతే- అని నిర్వచనం చేశారు పెద్దలు. మొదట అది ఈ జ్ఞేయ జగత్తును వ్యాపిస్తుంది. తరువాత ఇదమిద్ధమని దాన్ని గ్రహిస్తుంది. పిమ్మట దాన్ని కబళిస్తుంది లేదా తనలో ఇముడ్చుకొంటుంది. అనంతరం జ్ఞేయమనే ఉపాధిని పూర్తిగా మర్దించి దానికి మారుగా తానే సర్వత్ర వర్తిస్తుంది. ఇలా జ్ఞేయమూ జ్ఞానమనే తేడా లేకుండా సర్వమూ తానై భాసించటమే ఆత్మ అనే మాటకు అసలైన అర్థం. ఆత్మ అంటే నేనున్నాను అనే స్ఫురణ లేదా అనుభవమే గదా. నేనున్నానని తన సద్భావాన్నే ఎలా గుర్తిస్తుందో అలాగే ఈ అనాత్మ ప్రపంచం కూడా ఒకటి ఉందని

అదే గుర్తించ గలదు. ఇలాటి సంవేదన ఒక్కటే గాని రెండు మూడు అనే ప్రసక్తి లేదు. అనుభవమనేది ఎక్కడే గాని ఏకరూపమే. జ్ఞానమే అనుభవం. ఏ జ్ఞానమైనా అది జ్ఞానమే. అలాగే ఏ అనుభవమైనా అనుభవమే. నేననే అనుభవమెలాంటిదో నేను గ్రహించే ప్రపంచానుభవం గూడా అలాంటిదే గనుక రెండూ కలిసి ఒకే అనుభవమని మనం గ్రహించ వలసి ఉంది.

## 49. ఆబాల గోప విదితా

అంతా ఆత్మ స్వరూపమేనని చెప్పాము. ఆత్మ అంటే ఏమిటో కూడా నిర్వచించాము. పోతే ఈ ఆత్మ అనేది ఎవరికీ అందకుండా ఎక్కడో పరోక్షంగా ఉన్న పదార్థం కాదు. ఆ మాటకు వస్తే ఆబాల గోపాలమూ సర్వులకూ విదితమే. అనుభవ సిద్ధమే. బాల అంటే అత్యంత మూఢుడు. మరి గోప అంటె రాజనే గాక సకల శాస్త్రజ్ఞుడైన పండితుడని కూడా అర్థమే. మూఢుడు ప్రౌఢుడు-వీరిద్దరినీ ఉదాహరించటాన్ని బట్టి మిగతా లోకుల సంగతి వేరుగా చెప్ప బని లేదు. అందరూ వీరిద్దరి మధ్య ఉన్న అంతస్థులలోనే చేరిపోతారు. వీరూ వారని హెచ్చు తగ్గులు లేకుండా అందరికీ ఆత్మ అంటే ఏమిటో విదితమైన విషయమే.

అందరికీ విదితమేనని ఎలా చెప్ప గలం. నీవెవరినైనా అడగి చూడు. ఎవడవు నీవని అడిగితే ఏమి చెబుతాడు జవాబు. నేనేనంటాడు. నేనుకానని తన్ను తాను దూరం చేసుకొని మాటాడడు. ఆత్మ అనే భావమే మనసులో లేకుంటే నేను అనే మాట వాడి నోట రాదు. ఈ నేననే స్ఫురణే ఆత్మ అనే మాటకర్థం. కాబట్టి ఒక బాలుడేమిటి. గోపాలుడేమిటి. ఇది

సర్వులకూ విదితమే. అయితే వచ్చిందేమంటే విదితమైనా విదితంకానిదే అయింది. సామాన్య రూపంగా తెలుసునే గాని ప్రతి ఒక్కరికీ విశేషరూపంగా తెలియదు. దేహమే నేను- ప్రాణమే నేను-మనస్సే నేను-నేను కర్తను నేను భోక్తను- అని ఇలా దానితో దీనితో ముడి పెట్టి చూస్తామేగాని మనం- వాటి నుంచి వేరుచేసి వాటికి సాక్షి అయి విశుద్ధమైన చైతన్యమే నేనని విశేష రూపంగా చూడటం లేదు.

అలాగే చూడగలిగితే ఇక నేమి. సంసార బంధమే లేకపోయేది. సర్వమూ నేనే నని భావించినప్పుడిక నాకు వేరుగా సంసారమెక్కడిది. అంచేత విదితమైకూడా అది అవిదితమే అవుతున్నది మానవులకు. పండితులూ పామరులని తేడా లేదీ విషయంలో. అనాత్మను కూడా ఆత్మ అని చూడనంతవరకూ పండితుడను కొనేవాడుకూడా పామరుడే నిజానికి. పండా ఆత్మ విషయా బుద్ధిః-సా యేషాం తే పండితాః అన్నారు భగవత్పాదులు. ఆత్మ అంటే ఎమిటో పూర్తిగా పట్టుకొన్నవాడే పండితుడు. ఆయా విద్యలలో ఆరి తేరిన వాడు కాడు. ఎన్ని విద్య లభ్యసించినా నేను- ఇది అని ఆత్మానాత్మలను వేరుగా చూస్తున్నవాడు ఆత్మజ్ఞుడెలా కాగలడు. ఆత్మజ్ఞుడు కాని వాడు పండితుడెలాకాగలడు.

**50. మనోరూపేక్షుకోదండా 51. పంచతన్మాత్ర సాయకా**

**52. రాగ స్వరూప పాశాఢ్యా 53. క్రోధాకారాంకుశోజ్జ్వలా**

ఈ భేద దర్శనం వల్లనే ఆత్మ మనకీ శరీరంలోనే ప్రకాశిస్తున్నా అది అఖండ రూపంగా సాక్షాత్కరించటం లేదు. మీదు మిక్కిలి దానికి భిన్నంగా ఎక్కడికక్కడ ఖండమై

కనిపిస్తున్నది. అలా ఖండమైన ఆత్మ చైతన్యమే మానవుడి మనస్సు. నిజానికిది జ్ఞానాత్మకమే అయినా పరిపూర్ణమైనది కాదా జ్ఞానం. నానా విధమైన వృత్తుల మూలంగా పరిచ్ఛిన్నమైపోయింది. నామ రూపాలకు చెందిన వృత్తులు ప్రతి క్షణమూ వందలు వేలు పుడుతుంటాయి. గిడుతుంటాయి. తరంగాలకు సాగరంలాగా ఇలాంటి వృత్తులన్నింటికీ రాశిలాంటిది మనస్సు.

ఈ మనస్సు లోనే వచ్చి ప్రవేశించందా చిచ్ఛక్తి సాక్షాత్తుగా. చింతామణి గృహాంతస్థా అని ఇంతకు ముందే కదా వర్ణించి చెప్పాము. సర్వగత అయి కూడా ఆ దేవి మానవుల మనస్సు లోనే ఎక్కువగా ప్రకటమై కనిపిస్తుంది. కాని వేల కొలది మానవులలో ఎవడోఒక డుంటాడు దాని నిదమిత్థమని గ్రహించ గలవాడు. తతిమా వాళ్ళంతా ఎంత విద్యా వంతులైనా కేవలం మూఢులే. మనసు శ్రేయస్సాధన మైకూడా మన అనభిజ్ఞత వల్ల అది ప్రేయస్సాధనంగానే మిగిలి పోతున్నది. అలాటి అనభిజ్ఞులకా దేవి మనసనే దాని నొక ఇక్షు కోదండంగానే చూపుతుంటుంది. ఇక్షు కోదండమంటే చెరకు గడ. మనసే ఒక చెరకు. చెరకు లాగా రుచికరమే అయినా కోదండం గనుక భయంకరం. కోదండమంటే ధనుస్సు గదా భయంకరం గాక ఎలా పోతుంది. చెరకు లాగా మనస్సుకు కూడా ఎన్నో పర్వాలున్నాయి. పర్వమంటే గణుపు. మనసు లోకలిగే వృత్తులే దాని గణుపులు. ప్రతి పర్వ రసోదయమన్నారు. చెరకులో గణుపు గణుపుకూ రుచి మారుతూపోతుంది. ఆస్వాదించే కొద్దీ అభిలాష పెరుగుతూ పోతుంది. అలాగే మనోవృత్తులు కూడా అనుభవానికి వచ్చే కొద్దీ ఇంకా అనుభవించాలనే కాంక్ష ఎక్కువౌతుంది. తృష్ణ అనేది



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

పెరగటమే గాని తరగటమెప్పుడూ కానరాదు. ఇలాంటి సామ్యం గమనించే నేమో ఇక్షు దండంతో పోల్చి చెప్పారు మనస్సును.

ఎవంగుణ విశిష్టమైన ఈ మనస్సనే దాన్ని ఒక కోదండంలాగా చేతిలో ధరించి ఉన్నదా దేవి. ఇక్షు కాండంలాగా ఏదేది రోచకమని భావిస్తున్నామో అది నిజానికి రోచకం కాదు. దేవీ హస్త ధృతమైన ఒక భయంకరమైన ధనుర్దండం. ధనుస్సుతో ఏమి చేస్తుందా దేవి. ఆకర్ణాంతమూ లాగి పుంఖానుపుంఖంగా బాణాలను ప్రయోగిస్తుంది. సాయకాలంటే బాణాలే. అవి ఏవో కావు. పంచతన్మాత్ర రూపమైన పంచ బాణాలవి. శబ్ద స్పర్శ రూప రస గంధాలనే భూత సూక్ష్మాలకు తన్మాత్రలని పేరు. అవి చక్షురాదులైన ఇంద్రియాల ద్వారా బాణాలలాగా ప్రవేశిస్తాయి మన మనస్సులో అవే వాసనలు. వాటినే బాణాలుగా చేసుకొని ఆ మహాశక్తి మనసనే కార్ముకంలో ఎక్కు పెట్టి ప్రయోగిస్తుంది మరలా. ఇలా ఆసార ప్రసారాలతో ఇటూ అటూ లాగబడుతోంది మానవుడి మనస్సనే ధనుస్సు. పోతే ధారా పాతంగా ప్రయోగించే ఆ బాణాలేవో కావు. ఇంద్రియ వ్యాపారాలే. ఇవి కూడా ఆ దేవి హస్తంలోనే విన్యస్తమై ఉన్నాయి.

అంత మాత్రమే కాదు. ఇంకా కొన్ని ఉన్నాయి దివ్యాయుధాలావిడ చేతిలో. ఒకటి పాశం. మరొకటి అంకుశం. అందులో పాశమనేది రాగం. అంకుశమనేది క్రోధం. రాగద్వేషాలనే భావాలే పాశాంకుశ రూపాలు ధరించి దేవీ హస్త ద్వయాన్ని అలంకరించి ఉన్నాయి. పాశంతో మనలను చుడుతుందావిడ. అంకుశంతో నలగగొడుతుంది. అంటే అర్థం. రాగ ద్వేషాలే సుఖ దుఃఖ ప్రదాలు జీవులకు.

Yalamanchili Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

ఇలా ఈ నాలుగు నామాలూ జీవుల సంసార బంధమంటే ఏమిటో కన్నులకు కట్టినట్టు చూపుతున్నాయి. మొదట మనస్సంకల్పమూ- దానిననుసరించి చక్షురాది వృత్తులూ- వాటి వల్ల విషయగ్రహణం- అందులో ఒకటంటే రాగం మరొకటంటే ద్వేషం- తన్నిమిత్తంగా సుఖదుఃఖాద్యనుభవం. సమస్తమైన సంసార బంధమూ ఇదే మనకు. ఇంత కన్నా వేరే లేదు.

ఇక్కడ చిత్తేంద్రియ రాగద్వేషాలనే నాలుగూ ధనుర్బాణపాశాంకుశాలై- దేవి వాటిని తన నాలుగు చేతులలో ధరించి ఉందని వర్ణించటం మూలంగా మనకు బోధపడే రహస్యమేమిటి. ఇవన్నీ ఆ మహా శక్తి వశంలోనేగాని మన వశంలో లేవు. పైగా మనమే వాటికి వశవర్తులమై ఉన్నాము. అజ్ఞానం వల్ల వాటికధీనమై జన్మించాము. అలాగే జీవ యాత్ర సాగిస్తున్నాము. ఈ అజ్ఞాన పిశాచి తొలగిపోనంతవరకూ చేతిలో ఉన్న ఆ నాలుగాయుధాలతో మనలనావిడ బాధిస్తూనే ఉంటుంది. దేవీ తత్త్వ జ్ఞానమార్జించి ఎప్పటికైనా దానికి చికిత్స చేయగలిగితే- అప్పుడే మనల ననుగ్రహించి తన ఆయుధాలను ఉపసంహరిస్తుంది. ప్రయోగోపసంహారాలు రెండూ ఆవిడే చేయగలదు కనుక తదీయ జ్ఞానమే శరణ్యమనే సాధన రహస్యాన్ని మనకు బోధ చేయటానికే నాలుగు బాహువులతో నాలుగు దివ్యాయుధాలు ధరించిందని ఇలా వర్ణించటం.

## 54. సర్వ మోహినీ

కాగా ఎవరీ ఆధ్యాత్మిక రహస్యాన్ని గ్రహించలేరో- గ్రహించి ఆ మహా శక్తినాత్మ రూపంగా భావించరో- వారందరూ అనాద్యవిద్యా నిశీథంలో పడి ఒడలు తెలియక నిద్రిస్తున్నారు. అతి దుర్లభమైన

మానవ జన్మ ఎత్తి కూడా పశువులలాగా నిరర్ధకమైన జీవితం గడుపుతున్నారు. సంసార తరణోపాయంమేమిటో దాని కోసం ఈషణ్మాత్రం కూడా ప్రయత్నించటం లేదు. ఇలాంటి పశుప్రాయులైన మానవులందరినీ ఆ మహామాయ అంతకంతకూ మోహ సాగరంలోనే ముంచి వేస్తుంది. సర్వ జగన్మోహిని కదా ఆ మహా శక్తి. మోహింప జేయుటంలో ఆశ్చర్యమేముంది. అజ్ఞానుల కెప్పుడూ ఆవిడ మోహినే. నూటికి తొంభైతొమ్మిది మంది అజ్ఞానులే లోకంలో. కనుకనే సర్వ మోహినీ అనే పేరు సార్ధక మావిడకు.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఇంత వరకూ నడచిన గ్రంథం పర దేవత అవరోహణ క్రమాన్ని వర్ణిస్తూ వచ్చింది. శ్రీ మాతా అనే నామం మొదలుకొని సర్వ మోహినీ అనే నామం వరకూ యాభై నాలుగు నామాలతో వర్ణించింది ఆ మహా శక్తి అవరోహణ మార్గం. మహా శక్తి అంటే ఆవిడ జగన్మాత గదా జీవులందరికీ తల్లి అయిన ఆ దేవి సర్వ మోహిని అయి మహా సాగరంలో పడవేయటమేమిటని సందేహం కలుగుతుంది. తల్లికెపుడూ బిడ్డలమీద వాత్సల్యమే ఉంటుంది కాని శత్రువుల మీద చూపినట్టు ద్వేషం చూపరాదు. అలాంటప్పుడు జగత్తుకంతా తల్లి అయిన ఆ దేవత ఎందుకిలా పగసాధిస్తున్నదని సందేహించటం సహజమే. దీనికి సమాధానమింతకు ముందే సూచించి ఉన్నాము. అయినా ఇప్పుడు ప్రసంగం వచ్చింది కాబట్టి మరి కొంత విపులంగా చర్చించ వలసి ఉంది.

ఆ దేవి మన కందరికీ మాతృ దేవతే సందేహంలేదు. మాత గనుకనే వాస్తవంలో మన మీద ద్వేషంలే దావిడకు. మనలనీ మోహార్ణవంలో పారేయనూలేదు. అసలావిడ తన స్థానం నుంచి కదలి వచ్చి ఈ లోకంలోకి అవతరించనూ లేదు. ఇదంతా కేవలం అవిద్యా కల్పితమే. అనాది సిద్ధమైన అవిద్యా దోషం వల్ల మనమంతా ఆత్మ స్వరూపాన్ని మరచిపోయి దానినే జీవ రూపంగా కొంత - జగద్రూపంగా కొంత విభజించి చూస్తున్నాము. తన్మూలంగా సాంసారికమైన తాపత్రయము మనుభవిస్తున్నాము. అనుభవిస్తూ దీనికంతటికీ ఆ దేవి తిరోధాన శక్తే హేతువని ఊహిస్తున్నాము.

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

నిజానికా దేవి ఎప్పుడూ మన దృష్టికి తిరోధానం చెందలేదు. ఆత్మ చైతన్యమే గనుక ఎక్కడ బడితే అక్కడ సచ్చిద్రూపంగా ప్రకాసిస్తూనే ఉన్నది. ఇంతెందుకు. జీవుడని గాని జగత్తని గాని ఎదేది నీకు లోకంలో గోచరిస్తున్నదో- ప్రతి ఒక్కటీ అది ఉన్నదనీ భాసిస్తున్నదనే గదా చూస్తున్నావు. ఈ విధంగా నేనూ ఇదీ అనే వికల్పం లేకుండా ఎప్పుడీ సర్వమూ సచ్చిద్రూపంగానే గోచరిస్తున్నదో- అప్పుడా దేవి నీకు తిరోహిత ఎలా అయింది. దానినలా గ్రహించలేని మన బుద్ధి విజ్ఞానమే వాస్తవంలో తిరోహితమై కూచుంది.

ఇదిగో ఇలాటి జీవుల తిరోహిత జ్ఞాన దృష్టిని బట్టే ఆ మహా శక్తి అవతరించింది- అవతరించి మనమీద తన సమ్మోహనాస్త్రం ప్రయోగించిందనీ తలిసీ తెలియక వ్యవహరిస్తున్నాము మనం. యదార్థంగా ఆ దేవత అవరోహణ చెందనూ లేదు. మనలను మోహింప జేయనూ లేదు. సర్వమూ కాల్పనికమే కాని పారమార్థికం కాదు. కనుకనే ఇది దేవి తాలూకు అవరోహణమని గాని సంమ్మోహనంకూడా ఆవిడదే ననిగాని భావించరాదు. అజ్ఞాన వశాత్తు అవతరించింది మనబోటి జీవులమే. సమ్మోహితులమై ఈ భవసాగరంలో వచ్చి పడింది కూడా మనమే. చైతన్య శక్తిని గుర్తించని నేరంగా వచ్చి పడ్డాము కనుక మన ఈ దిగి రావటమూ ఈపాటు పడటమూ మనదే ఆ దేవత కారోపిస్తున్నాము. దేవతే ఇదంతా జరుపుతున్నదని భ్రమపడుతున్నాము.

అంచేత మాత అపరాధం కాదిది. కేవలం ఆవిడ కన్న ఈ బిడ్డలదే. అజ్ఞానమే ఈ జీవులు చేసిన అపరాధం. అది ఆ తల్లి స్వరూపాన్ని ఫలానా అని గుర్తించకపోవటం. అదే ఈ జీవులనా

తల్లికి దూరం చేసింది. ఈ దూరమైపోవటమే అవరోహణం. మరలా ఎప్పుడాదేవి తాలూకు జ్ఞానముదయిస్తుందో- అప్పుడీ బిడ్డలా తల్లి ఒడిలోనే చేరిపో గలరు. ఇదే ఆరోహణం. జీవులకు సంబంధిచిన ఇలాటి ఆరోహణ అవరోహణలే దేవి ఆరోహణ అవరోహణలని భావించాలి మనం. ఇందులో అవరోహణ నామావళి ఇక్కడికి సమాప్తమైంది. ప్రస్తుతం దానికి భిన్నంగా దేవి ఆరోహణ నామావళి వర్ణించ బడుతున్నది.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in

# ఉత్తరార్ధము

# ఆరోహణ క్రమము

Yallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

# ఉత్తరార్ధము - ఆరోహణ క్రమము

1. అవ్యాజ కరుణా మూర్తిః 992
2. దేవ కార్య సముద్యతా 5
3. శివ దూతీ 408
4. గురు మూర్తిః 604
5. శాస్త్ర సారా 845
6. శివ జ్ఞాన ప్రదాయినీ 727
7. పశు పాశ విమోచనీ 354
8. ముక్తిదా 736
9. బహిర్ముఖ సుదుర్లభా 871
10. అంతర్ముఖ సమారాధ్యా 870
11. మిథ్యా జగ దధిష్ఠానా 735
12. విద్యావిద్యా స్వరూపిణీ 402,403
13. దుష్ట దూరా 193
14. శిష్టేష్టా 411
15. సంహృతాశేష పాషండా 355
16. సదాచార ప్రవర్తికా 356
17. సమయాచార తత్పరా 96
18. సంప్రదాయేశ్వరీ 711
19. మహా విద్యా 585
20. బ్రహ్మాత్మైక్య స్వరూపిణీ 673
21. తత్త్వమర్థ స్వరూపిణీ 908
22. విమర్శరూపిణీ 449
23. పరావరా 790
24. ప్రసిద్ధా 395
25. భావనా గమ్యా 113
26. ధ్యాన గమ్యా 642
27. ధ్యాతృ ధ్యాన ధ్యేయ రూపా 254
28. నిర్భేదా 178
29. భేద నాశినీ 179
30. నిర్మమా 164
31. నిరహంకారా 161
32. మృత్యు మథనీ 181
33. నిర్భవా 174
34. శాంతా 141
35. బ్రాహ్మీ 676
36. పరా నిష్ఠా 574
37. హేయోపాదేయ వర్జితా 304
38. అభ్యాసా తిశయ జ్ఞాతా 990
39. మైత్ర్యాది వాసనా లభ్యా 571
40. అజ్ఞాన ధ్వాంత దీపికా 993
41. జ్ఞాన జ్ఞేయ స్వరూపిణీ 981
42. సామరస్య పరాయణా 792
43. స్వస్థా 914
44. ఏకాకినీ 666
45. దుఃఖ హంత్రీ 191
46. పురుషార్థప్రదా 292
47. స్వర్గాప వర్గదా 764
48. నిర్వాణ సుఖ దాయినీ 390
49. సద్యః ప్రసాదినీ 383
50. యజమాన స్వరూపిణీ 883
51. సర్వాంత ర్యామినీ 819
52. పూర్ణా 293
53. శాశ్వతీ 957
54. శ్రీ శివా 998

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

## 1. అవ్యాజ కరుణా మూర్తిః

కరుణా మూర్తి ఆ దేవి. మూర్తీ భవించిన కారుణ్యం. జగజ్జనని గదా. తన సంతానం మీద కరుణ లేక ఎలా పోతుంది. తప్పకుండా తాను కన్న బిడ్డల మీద ఎన లేని వాత్సల్యముండి తీరాలి. అది కూడా సవ్యాజం కాదు. అవ్యాజం. వ్యాజమంటే దాచుకోవటం. మనకివ్వ కుండా ఎదీ ఆవిడ దాచుకోలేదు. సత్తా స్ఫురత్తలే గదా ఆవిడ దగ్గర ఉన్న సొమ్ము. అది ఎలాటి లోభమూ లేకుండా సమస్త ప్రపంచానికీ పంచి పెట్టింది మహా తల్లి. ఎక్కడంటే అక్కడ కనపడుతూనే ఉన్నాయవి. సామాన్య రూపంగానే కాదు. విశేషాల రూపంగా కూడా ప్రదర్శిస్తున్నది. వెలపల పెండ్లాం బిడ్డలు- ఇల్లూ వాకిలి- ధన ధాన్యాలు- అనే సద్విశేషాల నెలా అనుభవిస్తున్నామో- లోపల వాటి తాలూకు సుఖ దుఃఖాది చిద్విశేషాలను కూడా అనుభవించ గలుగుతున్నాము. రెండు విధాలుగా మనకావిడ తన ఆస్తినంతా పంచి ఇస్తున్నప్పు డావిడ కరుణా మూర్తి కాక నిష్కరుణ ఎలా అవుతుంది. ఎలాటి వ్యాజమూ లోభమూ లేని వాత్సల్యమది.

వ్యాజమనేది ఎద్దైనా ఉన్నదంటే అది మనబోటి ప్రాణ కోటికే ఉన్నదింకా. ఇంత గొప్ప పారితోషిక మావిడ మనకు ప్రసాదిస్తుంటే ఆ తల్లి వాత్సల్యాన్నే మరచి పోయాము మనం. ఇంత ఇచ్చింది కదా అని తృప్తి కూడా చెందటం లేదు. ఇంకా అది కావాలిది కావాలని కోరుతూ కోరికల వెంట పడి పోతున్నాము. చేతిలో ఉన్నదానితో తృప్తి చెందక పరుల చేతిలోదికూడ లాగుకొని మింగుతున్నాము. ఇలా విశేషాల వెంట పరుగిడుతున్నామేగాని అన్నింటిలో సామాన్య రూపిణిగా వ్యాపించిన ఆ జగన్మాతను గుర్తించటం లేదు.



Yallamraju Srinivasa Rao
www.advaitam.in

అందుకే ఆవిడ అనుగ్రహం కూడా మన పాలిటికి ఆగ్రహమై పరిణమించింది జన్మ జన్మల నుంచీ. ఎవరైతే అలా విస్మరించరో- తమకు వరప్రసాదిని అయిన ఆవిడను ఎప్పుడూ స్మరిస్తుంటారో- తద్దర్శనం కోసం ఎకరుతుంటారో- అలాంటి వారావిడ అనుగ్రహాని కెప్పుడూ పాత్రులే. కరుణామృత ధారలలో నిత్యమూ అభిషిక్తులే. అట్టి వారికావిడ మోహిని కాదు. అనుగ్రాహిణి. తత్వజ్ఞులు కాబట్టి వారి మీద మోహాంధకారం పని చేయదు. జ్ఞాన ప్రకాశంలో నామ రూపాలు మరుగు పడి ఆవిడ సచ్చిత్ స్వరూపమే నిత్యమూ దర్శన మిస్తుంది. ఉత్తర గోగ్రహణంలో అందరూ ఒడలు తెలియక పడిపోయినా- మెళకువతో ఉండి చూచే భీష్మ ద్రోణులలాంటి వారు వారు.

## 2. దేవ కార్య సముద్యతా

దేవీ కారుణ్యానికి నోచుకొన్న పుణ్య పురుషు లెలాంటి వారని అడిగితే చెబుతున్నదీ నామం. దేవ అంటే స్వర్గ వాసులైన దేవతలని కాదు. దైవ గుణ సంపన్నులైన మానవులే ఇక్కడ దేవతలు. స్వర్గ వాసులైకూడా దుశ్చరిత్రులైతే దేవీ ప్రసాదానికి పాత్రులే కారు. కనుక మనుష్యులలోనే శమదమాదులూ శ్రద్ధాదులూ అమానిత్వాదులూ మొదలైన సద్గుణాలలవడిన వారందరూ నిజానికి దేవతలే.

అలాంటి దేవతల కార్య మేదో అదే దేవ కార్యం. దేవీ స్వరూపాన్ని తెలుసుకోవాలనే కోరికే అది. తెలుసుకొని ఈ భవ సాగరం నుంచి బయటపడాలనే వారి తాపత్రయం. అంచేత సంసార తరణమనే తత్ కార్యాన్ని సాధించటానికే సముద్యతా. ఎప్పుడూ బద్ధ కంకణ అయి ఉంటుందా దేవి. ఎప్పుడూ అలాంటి

వారి నుపేక్షించదు. జ్ఞాన సముపార్జన కోసం ఎంతెంత వారు ప్రయత్నిస్తే అంతంత దాని ననుగ్రహిస్తుంది. మరి జ్ఞానులే అయి తన సాక్షాత్కారమే కోరితే నిజ స్వరూపంతో వారికి సాక్షాత్కరిస్తుంది.

## 3. శివ దూతీ

అసలందు కోసమే శివ కామేశ్వరాంకస్థ అయి కూడా ఆవిడ అక్కడే కూచోక తన స్థానం వదిలేసి ఆ పరమ శివుడు పంపిన ఒక దూతిక లాగా దివి నుంచి భువికి దిగి వచ్చింది. పరిత్రాణాయ సాధూనాం అని గదా భగవానుడి మాట. దైవ గుణ సంపన్నులైన ముముక్షువులందరూ సాధువులే. వారిని తరింప జేయటమే ఆవిడ కర్తవ్యం. అందుకే అంత దూరం నుంచి మన దగ్గరికి ఆవిడ దిగి రావటం. శివ దూతి అనే పేరు కూడా అంచేతనే ఆవిడకు సార్థకమౌతున్నది.

ఒక దూతి చేసే కృత్యానికి దౌత్యమని పేరు. అది ఎదో కాదు. ఒకరు చెప్పి పంపిన సందేశం మరొకరికి అంద జేయటమే. సందేశ ప్రేషకు డిక్కడ శుద్ధ చైతన్య రూపుడైన పరమాత్మ. చిన్మాత్ర రూపుడు కనుక ఆయన కూటస్థుడు. కదలలేడు. కదిలి ఎక్కడికీ రాలేడు. పోతే ఆయన క్రియా శక్తి ఈ పరా దేవత. క్రియా రూపిణి గనుకనే నిమిష మాత్రంలో ఎక్కడికైనా పయనించ గలదు. భాను మండల మాకాశంలో కదలకుండా ఒక చోట ఉన్నప్పటికీ దాని దీప్తి మండలం నుంచి బయలు వెడలి దశ దిశలా వ్యాపించటం లేదా. అలాగే ఆ దేవి కూడా సర్వ వ్యాపిని. వ్యాపిని గనుకనే ఆ దేవుని సందేశం లాంటి సర్వాత్మ విజ్ఞానాన్ని లక్ష్యంగా పెట్టుకొని అది ఈ

జిజ్ఞాసుల కందివ్వటం కోసమింత దూరం శివ దూతి అయి కదలి వచ్చింది.

## 4. గురు మూర్తిః

కావచ్చు. దూతిక లాగా దిగి వచ్చిందని భావించటాని కేమిటి నిదర్శనం. ఎలా గ్రహించవలసి ఉంటుంది మనం. గురు మూర్తి అనే మాట దానికి సమాధానం. గురు మూర్తి అని దేవికి పేరు. ఆ దేవి ఎప్పుడూ తన రూపంతో తాను మనకు సాక్షాత్కరించదు. శక్తి రూపిణి కదా ఆవిడ. ఎలా సాక్షాత్కరించ గలదు. శక్తి ఎప్పుడూ గోచరించదు గదా. కనుక ఒకానొక సద్గురువు రూపంలోనే మనకావిడ దర్శనమిస్తుంది. లోకంలో తత్త్వ దర్శనులైన ఆచార్య పురుషు లెవరున్నారో- వారందరూ దేవీ స్వరూపులే. దేవికీ వారికీ భేదం లేదు. ఆ మహా దేవే మన ఈ దేవ కార్యాన్ని సాధించటానికి ఆయా సద్గురువుల రూపాన్ని ధరించి మనకు ప్రత్యక్షమౌతున్నది. గురు స్సాక్షాత్ పరం బ్రహ్మ అనే సుభాషితంలోని అంతరార్థమిదే. గురువుకూ దేవతకూ తేడా లేదని చెప్పటమే.

నిరాకార అయిన దేవి గురువనే పేరుతో సాకార అయి మనకు కనిపిస్తున్నది. ఎవరెవరు బ్రహ్మ విద్య నర్థిస్తున్నారో వారికా విద్య నుపదేసిస్తున్నది. ఉపదేశించి క్రమంగా వారినీ సంసార సాగరం నుంచి తరింప జేస్తున్నది. అంతే వాసులైన ఈ జిజ్ఞాసువులకు కూడా అలంటి సద్గురువులను సేవించటం ధర్మం. తద్వి జ్ఞానార్థం స గురుమేవాభి గచ్ఛేత్ అని ఉపనిషత్తు చెప్పనే చెప్పింది. ఏమిటి దీనికర్థం. బ్రహ్మ విజ్ఞానార్థి అయిన ప్రతి ఒక్కడూ గురూప సదనం చేయవలసిందే. నిత్యమూ వారినాశ్రయించి తదనుగ్రహంతో విజ్ఞాన

మందుకోవలసిందే. తప్పదు. అప్పుడే అది ఫల ప్రదమౌతుంది వారికి. దేవ కార్య సముద్యత అయిన ఆ దేవి ప్రయత్నం కూడా సఫలమౌతుంది.

## 5. శాస్త్ర సారా

గురువులైన వారు తమ శిష్యులకెలా బోధిస్తారు- వారిసెలా ఉద్ధరిస్తారు- అని అడిగితే దానికి సమాధానమీ నామం. బోధ అనేది నిరంకుశంగా చేయడే గురువుగాని. దానికొక ప్రమాణముండి తీరాలి. తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే అని చాటుతున్నది గీత. శాస్త్రమే దేన్నికైనా ప్రమాణం. జ్ఞాన సాధనమే కదా ప్రమాణమంటే . ప్రమాణం లేకుండా ప్రమేయం ఆలూకు జ్ఞానమెప్పుడూ సిద్ధించదు. ప్రమేయమిక్కడ సర్వాత్మ భావం. అది శాస్త్ర ప్రమాణం చేతనే తప్ప ప్రత్యక్షానుమానాలతో సిద్ధించేది కాదు. అవి రెండూ అనాత్మ ప్రపంచానికి చెందినవే గాని ఆత్మకు చెందనవి కావు. కనుక శాస్త్రానికి మాత్రమే ఇక్కడ ప్రవేశం.

శాస్త్రానికి మాత్రం ఆత్మ ఎలా విషయమౌతుంది. సర్వ ప్రమాణాలకూ అది అవిషయమని కదా చెప్పారు. కనుకనే గదా అప్రమేయమని దానికి పేరు వచ్చింది. వాస్తవమే. ప్రమాణానికి విషయం కాదాత్మ. శాస్త్రంకూడా దాన్ని విషయంగా చూపదు. దానికేవేవి విషయాలౌతున్నవో వాటన్నిటినీ కాదని త్రోసిపుచ్చుతూ దాని జ్ఞానం మనకందిస్తుంది. శాస్త్ర సారమంతా ఇదే. ఇలా నిషేధముఖంగా ప్రమాణమౌతుంది శాస్త్రం. విధి ముఖంగా కాదు. కనుకనే ప్రమాణమని చెప్పినా పొరబాటు లేదు. ఇంతకూ ఆగమరూపమైన శాస్త్రం వల్లనే మనకాత్మ జ్ఞానం కలుగుతుంది.

శాస్త్రమనేది అటు గురువులకూ ఇటు శిష్యులకూ నడుమ ఏర్పడిన ఒక వంతెన లాంటిది. తాను తరించి తన శిష్యులకు గూడ తరణోపాయాన్ని ఉపదేశించాలి గురువు. దానికి సాధనం శాస్త్ర జ్ఞానమే. అది గురువుకు అనుభవరూపమైతే శిష్యుడికి శ్రవణమననాది రూపం. అద్దరినీ ఇద్దరినీ కలిపేది శాస్త్ర ప్రమాణం. సారమంటే ప్రమాణమనే అర్థం.

## 6. శివ జ్ఞాన ప్రదాయినీ

శాస్త్రమే ప్రమాణం కావచ్చు. కాని శాస్త్రమనేది ఒక ఆత్మ జ్ఞానమే కాదుగదా. ధర్మ జ్ఞానం కూడా మనకు బోధిస్తున్నది. రెండు విధాలుగా ప్రవర్తిస్తుంటుంది శాస్త్రం. ధర్మం కోసమొకటీ. బ్రహ్మం కోసమొకటీ. అలాంటపుడు శాస్త్రమంతా ఆత్మ జ్ఞానం కోసమే అని ఎలా నిర్ణయించగలం.

ఇలాంటి సంశయాన్ని తొలగిస్తున్నదీ నామం. శివ సంబంధమైన జ్ఞానం శివ జ్ఞానం. దాన్ని మనకు ప్రదానం చేస్తుంది కాబట్టి దేవికి శివ జ్ఞాన ప్రదాయిని అని పేరు. జ్ఞానమనేది రెండు విధాలు. ఒకటి శివం. వేరొకటి అశివం. ఇందులో మిథ్యా భూతమైన జగత్తుకు చెందినవి గనుక లోక జ్ఞానం మొదలు ధర్మ జ్ఞానం వరకు అన్ని జ్ఞానాలూ అశివమే. ఇతర జ్ఞానాల కంటే ధర్మ జ్ఞానమనేది ప్రశస్తతరమని నీకు తోచినా- ఆలోచిస్తే అది కూడా శివ జ్ఞాన మనిపించుకోదు. ఎందుకంటే స్వర్గాది అనిత్య సుఖానుభవంతోనే అది సమసి పోతున్నది. యదేహ కర్మ చితో లోకః క్షీయతే- తథా అముత్ర పుణ్యచితోపి క్షీయతే అని శాస్త్రమే దాని అనిత్యత్వాన్ని బయట పెడుతున్నది. కాబట్టి ధర్మ జ్ఞానం కూడా వాస్తవానికి అశివమే.

ఇలా పరిహరిస్తూ పోతే చివరకు పరి శేష న్యాయంగా ఏది మిగులుతుందో అలాంటి ఆత్మ జ్ఞానమే శివమైన జ్ఞానమని తేలుతున్నది. అశివాత్మకమైన ఈ సంసారమంతా అందులోనే తుదకు ప్రవిలయమై పోతున్నది. దాన్ని ప్రవిలాపనం చేసి తద్ద్వారా శివమైన తత్త్వాన్ని చేర్చేది మనకిది ఒక్కటే. కనుక వాస్తవంలో శాస్త్ర ప్రమాణాని కంతటికీ ప్రమేయ భూతమైనదీ ఆత్మ జ్ఞానమే. మహా అయితే ధర్మ జ్ఞానం ఆ జ్ఞానానికి అంగభూతమై దూరంగా దాని కుపకరిస్తున్నది. అంచేత రెండింటికీ పరస్పర వైరుధ్యముందని కూడా మనం భావించ నక్కరలేదు.

## 7. పశు పాశ విమోచనీ 8. ముక్తిదా

ఆ పరా భట్టారిక గురు రూపంగా అవతరించి శాస్త్ర సర్వస్వమైన ఆత్మ జ్ఞానాన్ని మన కందిస్తుందని చెప్పాము. అది అందు కొన్నందు వల్ల మానవులకు కలిగే ప్రయోజన మేమిటని ఇప్పుడు పేర్కొన బడుతున్నది. పశు పాశవిమోచనమే ఆ ప్రయోజనం. పాశంతో కట్టివేయబడే దేమిటో అది పశువు. అవి చతుష్పాత్తులే కాదు. ద్విపాత్తైన మానవుడు కూడా ఒక పశువే. వీడు కూడా అనేక పాశాలతో కట్టబడిన వాడే. ఏమిటా పాశాలు. అవి వీడిని ఎలా కట్టి వేస్తున్నాయి. అవిద్యా అస్మితా రాగ ద్వేష అభినివేశా లనే అయిదింటినీ క్లేశాలని పరిగణించారు యోగ శాస్త్రజ్ఞులు. ఈ క్లేశాలే మనలను కట్టి వేసే పాశాలు. బంధన రూపమైన వివి. వీటి మూలంగానే మనకీ సంసార బంధమేర్పడింది. ఇందులో మొదటిది అవిద్య అనే పాశం. ఈ కనిపించే సర్వమూ- దీనిని కంటున్న నేనూ- రెండూ ఆత్మే అనే విద్య లేకపోవటమే అవిద్య. ఇది మన ఆత్మ చైతన్యాన్ని కప్పివేసింది.

తత్కారణంగా ఈ దేహమే నా ఆత్మ అని ఈ మేరకే నా స్వరూపాన్ని పరిమితం చేసి చూస్తున్నాను. ఇదే అస్మిత అనే రెండవ పాశం.

ఆ తరువాత రాగ ద్వేషాలనే మరి రెండు పాశాలేర్పడ్డాయి. ఒకటి అనుకూలిస్తే రాగం. ప్రతికూలిస్తే ద్వేషం. శరీరమాత్రమే ఆత్మ అని అభిమానించినప్పుడు ఇవి రెండూ తప్పవు. ఇవి రెండూ అంతకంతకు బలమయ్యే కొద్దీ అభినివేశమనేది ఎర్పడుతుంది. అత్యంతమూ వాటిలోనికి చొచ్చుకొని పోవటమే అభినివేశం. ఇది ఐదవ పాశం మనపాలిటికి. ఐదింటిలో అవిద్య అనేది తమస్సు. అస్మిత మోహం. రాగం మహా మోహం. ద్వేషం తామిస్రం. అభినివేశం అంధతామిస్రం. ఇలా చూస్తే ఐదూ ఐదు నరకాలు కూడా మనపాలిటికి. వాటిలో మొదటిది కొంత అదర్శనమైతే కడపటిది అత్యంత మదర్శనం.

ఈ విధంగా ఉత్తరోత్తరం పేర్కొన పడ్డ ఈ ఐదు పాశాలతో చుట్టు బడ్డ ఈ జీవుడు పశువు గాక మరి ఎవడు. పంచ గుణీకృతమైన పశుత్వమిది. ఈ పశువును చుట్టు కొన్న అవిద్యాదులైన ఐదు పాశాలలోనూ అవిద్య అనేది మూలకారణం. అది వదలి పోతే తతిమావన్నీ వాటిపాటికవే తొలగి పోతాయి. అయితే ఈ అవిద్య ఎలా తొలగి పోతుంది. ఆత్మ విషయమైన విద్య చేతనే అది తొలగుతుంది. ఇంకొక ఉపాయం లేదు. శివ జ్ఞాన రూపమైన ఈ ఆత్మ విద్యను ఆ దేవి ఎప్పుడు ప్రసాదిస్తుందో- అప్పు డవిద్యతోపాటు సకల పాశాలూ తెగిపోగలవు. అంతవరకూ పాశ బద్ధుడైన జీవుడు వాటి నుంచి విమోచనం పొందగలడు.

పాశ విమోచనానికే ముక్తి అని పేరు. ముక్తి అనే మహా ఫలాన్ని వెనువెంటనే ప్రసాదిస్తుందా పర దేవత. కనుకనే ఆవిడ ముక్తిదా అని కీర్తించ బడుతున్నది. అయితే సాధకుల కిక్కడ ఒక ఆశంక కలగ వచ్చు. ఆత్మ జ్ఞాన సమ కాలంలోనే మోక్షమెలా సిద్ధిస్తుందని. జ్ఞానమంటే మనసులో కలిగే ఒకానొక వృత్తి గదా. అది మానసికమే గాని భౌతికంగాదు. భౌతికమైన ప్రపంచమొకటి కొనసాగుతుండగా మానసికంగా జ్ఞానమేర్పడి నప్పటికీ అది దీనిని ఎలా ప్రవిలాపనం చేయ గలదు. కనుక తద్విలాపనార్థం బాహ్యమైన కర్మ ఏదైనా కొంత చేయవలసి వస్తుంది. అప్పుడే అది అను భవ మౌతుంది.

ఇలాంటి కుశంకలు పెట్టుకో నక్కరలేదు. శంకించే అవకాశం కూడా లేదిక్కడ. ఎందుకంటే మిగతా జ్ఞానాల లాంటిది కాదాత్మ జ్ఞానం. వృత్తి అయినా అది ఖండ వృత్తి కాదు. అఖండాకారమైన ఆత్మ వృత్తి. కనుక నామ రూప వివర్జితమది. కనుకనే కేవలం సాధకుడి మనసులోనే గాక బాహ్యంగా ఉన్న సమస్త వస్తువులనూ వ్యాపిస్తుంది. వ్యాపిస్తూ సమస్తమైన నామ రూపాలనూ కబళిస్తుంది. దాని సత్త కన్నా వ్యతి రిక్తమైన సత్త నామ రూపాలకు లేదుకదా. అంచేత విద్య ఉదయించట మేమిటి. దానితో అవిద్యా- అవిద్యా కార్యమైన ప్రపంచమూ- రెండూ ఒక్క మారుగా ప్రవిలయం కావటమేమిటి. అప్రయత్నంగా జరిగి పోతాయి. కనుక ప్రపంచాన్ని ప్రవిలయం చేసుకోటానికి జ్ఞానంతో పాటు మరొక క్రియ ఏదీ అక్కర లేదు. లేకుంటే ఇక జ్ఞాన సమకాలంలోనే పాశ విమోచనమూ- విమోచన సమకాలమే ముక్తీ- అప్పటికప్పుడు మనకు సిద్ధించినట్టే.

## 9. బహిర్ముఖ సుదుర్లభా 10. అంతర్ముఖ సమారాధ్యా

ముక్తి అనేది కరతలామలకంలాగా అప్రయత్నంగానే సిద్ధిస్తుందని పేర్కొన్నాము. అది కూడా ఆత్మ జ్ఞానమే గాని మరేదీ కాదు. ఈ ఆత్మ అనేది అహం ప్రత్యయరూపమే గదా. అది మానవులందరికీ ఆజన్మ సిద్ధమే. ప్రసిద్ధమే. కారణమేమంటే నేను అని తన్ను తాను భావించని వాడు ఎవడూ లేడు. ఆత్మ ఇంత ప్రసిద్ధమైనప్పుడు తద్విషయమైన జ్ఞానానికి మాత్రం మనమెందుకు గాను ప్రయత్నించాలి. జ్ఞాన స్వరూపమే గదా ఆత్మ అంటే. ఈ జ్ఞానం మనకిప్పుడు ఉండనే ఉన్నది. అలాంటప్పుడు ప్రయత్నం దేనికని ఆక్షేపణ.

దీనికి సమాధానమే బహిర్ముఖ సుదుర్లభా. లబ్ధుమశక్యా దుర్లభా. సుష్టు దుర్లభా సుదుర్లభా. ఎప్పటికీ పొందటానికి సాధ్యం కానిదని అర్థం. ఆ దేవీ తత్త్వాన్ని అందుకొనే ఆశ మనకెప్పటికీ లేదు. అలాంటి అతీతమైనదా తత్త్వం. జ్ఞానమే అతీతమైనప్పుడు ముక్తి ఇక ఎలా సంభవం. కానీ ఆ దేవత సర్వ వ్యాపినీ ప్రసిద్ధా అని ఇంతకు పూర్వం చాలా మార్లు వర్ణించారు గదా అంటే అలా వర్ణించినప్పటికీ ఆవిడ దర్శనం దుర్లభమేనట. కారణమేమని అడిగితే ఏదో కాదది మానవుల బహిర్ముఖత్వమే.

మానవులందరూ నూటికి తొంభైతొమ్మిది మంది బహిర్ముఖులై బ్రతుకుతుంటారు. మనం బహిర్ముఖులం కావటం మూలాన్నే ఆవిడ సర్వ వ్యాపినీ సుప్రసిద్ధా అయి కూడా మనకు దుర్లభ అయి పోయింది. బహిర్ముఖత్వ మేమిటని అడగవచ్చు. దానికభిముఖంగా లేక పోవటమే బహిర్ముఖత్వం. పదార్థం మన

ఎదట ఉన్నప్పటికీ దాన్ని మనం గమనించక పోతే అది మన కగోచరమే. ఒక ఘటం గాని పటం గాని మన కండ్ల ఎదుటనే ఉండవచ్చు. అయినా మన దృష్టి దాని మీద పడనంత వరకూ అది దగ్గర ఉన్నా కంటికి కనపడదు. దగ్గరై కూడా అది దూరమే. కారణం దాన్ని చూడక మరేదేదో చూస్తుంటుంది మన దృష్టి. ఎది చూస్తామో అదే కని పిస్తుందే గాని ఎది ఉంటుందో అది కాదు.

ఈ విధంగా అసలు దాన్ని చూడక దాని కన్యమైన వస్తువులను చూస్తూపోవటమే బహిర్ముఖత్వం. ప్రస్తుతం మన మందరమీ నామ రూప ప్రపంచాన్నే చూస్తున్నాము. నిత్యమూ దీనితోనే వ్యవహరిస్తున్నాము. పుత్రుడనీ మిత్రుడనీ కళత్రమనీ సుఖమనీ దుఃఖమనీ ఇలాగే చూస్తున్నాము. కనుక ఈ ఉపాధులే ప్రతి క్షణమూ మన కుపలభ్యమౌ తుంటాయి. మరి ఆ పరా శక్తి వీటన్నిటిలో అధిష్ఠాన రూపంగా ఉంటున్నా మనకంటికి గోచరం కాదు. కారణం ఆ దృష్టి లేదు మనకు. అందుకే ఆ తత్త్వం దుర్లభం దుర్లభతరమై కూచుంది మనకు. స్వతహాగా దుర్లభం కాకున్నా మన దృష్టికలా పరిణమించింది. కనుక ఇంతకూ ఇది ఆవిడ దోషం కాదు. మనదే.

అలాగైతే మరలా ఆ స్వరూపాన్ని అందుకొనే మార్గమేమిటి. మన దృష్టి బహిర్ముఖంకాక అంతర్ముఖ మెప్పుడౌతుందో అప్పుడా దృష్టితో ఆ దేవతను ఆరాధించి పట్టుకోవచ్చు. ఆరాధించట మంటే నిరంతరం దాని మీదనే చూపు నిలపటం. ఆ స్పృహతోనే ఉండటం. అలా ఉండగలిగితే ప్రసన్న అయి ఆ దేవి సుఖంగా మనకు ప్రత్యక్షమౌతుంది. కేవలం దృష్టి లేకనే వ్యవహిత అని భ్రమిస్తున్నాము కాని నిజాని కెప్పుడూ సన్నిహితే. కనుక వ్యవధానం

తొలగితే చాలు. బయటబడి కనిపిస్తుంది తత్త్వం. చీకట్లో ఉన్న ఘట పటాదులు వెలుగుతో చీకటి తొలగితే ప్రకాశించి నట్లని భావించాలి మనం. కనుకనే దుర్లభ అయి కూడా సులభే మరలా ఆ దేవత. దుర్లభ బహిర్దృష్టికి. సులభ అంతర్దృష్టికి.

ఇక్కడ బహిరంతరాలంటే మనస్సుకు వెలపలా మనస్సుకు లోపలా అని భావించరాదు. మనసు లోపల కూడా పుత్ర కళత్రాది భావాలు ఉదయిస్తున్నంత వరకూ అది బహిర్ముఖత్వమే. అలాగే బాహ్యంగా కూడా నామ రూపాలను వదిలేసి వాటి అస్తిత్వాన్ని మాత్రమే గుర్తిస్తున్నంత వరకూ అది అంతర్ముఖత్వమే. అంటే ఏమన్నమాట. సచ్చిద్రూపమైన అధిష్ఠానానికి విముఖులమై మెలగటమే మానవుల బహిర్ముఖత- నామ రూపాది విశేష దృష్టికి స్వస్తి చెప్పి కేవల సత్తా మాత్ర దర్శనమే అంతర్ముఖత అని గుర్తించాలి మనం.

## 11. మిథ్యా జగ దధిష్ఠానా

ఇప్పుడీ అంతర్ముఖ దృష్టిని మానవుడెలా అభ్యసించాలని ప్రశ్న. మిథ్యా జగ దధిష్ఠానా అని దీనికి సమాధానం. ఈ భావంతో ఆ దేవిని నిత్యమూ మనసులో భావిస్తూపోవాలి. ఆ మహా శక్తే సమస్తమైన జత్తుకూ అధిష్ఠానం. అంటే ఆధార పీఠం. పీఠం కనపడటం లేదు మన దృష్టికి. దాని మీద ఆరోపితమైన చిత్ర విచిత్ర ప్రపంచమే గోచరిస్తున్నది. ఇది ఎంత వరకిలా భాసిస్తుంటుందో ఈ జగత్తు- అంతవరకూ అక్కడే ఉన్న ఆ అధిష్ఠానం దీని చేత ఆచ్ఛాదితమై బయటపడదు. కేవలమూ ఆరోపిత రూపంగానే అది మనకు భాసిస్తుంది. భాసిస్తున్న ఈ

ఆరోపిత జగత్తు కూడా ఒకటి కాదు. శాఖోపశాఖాత్మకం. అందులోకూడా నిలకడ లేదు. క్షణ క్షణమూ పరివర్తన చెందుతుంది. పరివర్తన చెందుతూ సుఖ దుఃఖాదులైన ఫలితాలు కూడా ఒకటి కాదు అనేకంగా మనకందజేస్తుంది. అవి మన కనుకూలమూ కావచ్చు. ప్రతికూలమూ కావచ్చు. ఎదైనా అనుభవించ వలసిందే తప్పదు.

ఇలాంటి అనర్థ జాతమంతా అధిష్ఠాన దృష్టి లేనందువల్లనే వచ్చి పడుతున్నది. దానికి కారణం ఆరోపిత దృష్టి ఉండటమే. కాబట్టి ఈ ఆరోపితమైన జగత్తు మిథ్యా భూత మయ్యే లాగా మనం ప్రయత్నం సాగించవలసి ఉంది. అసలిది మిథ్యా భూతమే. తథ్యమెప్పుడూ కాదు. ఆత్మ చైతన్యానికి ఆభాస రూపమే కదా ఇది. సూర్య రశ్మికి మృగ తృష్ణిక వంటిది. సూర్య రశ్మే సత్యం. మృగ తృష్ణ కాదు. అలా కనిపిస్తున్నా అది రశ్మి గానే సత్యం గాని జల రూపంగా కాదు. జల రూపంగా అయితే అది మిథ్యే అనాలి మనం.

ఇలాగే ఇక్కడా ఈ నామ రూపాత్మకమైన జగత్తు ఎండమావులలాగా ప్రతీయమానమౌతున్నా చైతన్య రశ్మికి ఇది కూడా ఒక ఛాయె. చైతన్య రూపంగానే ఇది సత్యంగాని తన రూపంలో గాదు. తన రూపంలో ఇది ఎప్పుడూ మిథ్యా భూతమే కాని సత్యంలాగా భాసిస్తుంటుంది. అక్కడ సూర్య తేజస్సును దర్శించక జలమెలా భాసిస్తున్నదో- అలాగే చైతన్య తేజస్సును గ్రహించలేక ఇది కూడా ప్రతీతమౌతున్నది. ఎంతెంత చైతన్య దీప్తిని మనసులో భావిస్తామో- తదాకారమైన దృష్టినవలంబించి ధ్యానిస్తామో- అంతంత ఈ జగత్తు ఆభాసమై మిథ్యాభూతమై చివరకభావమై పోగలదు. సర్వ జగత్తూ ఇలా అభావమైపోతే-

ఎండమావుల స్థానంలో సూర్యా లోకంలాగా జగత్తు స్థానంలో సర్వత్రా ఆ చిదాలోకమే దర్శనమిస్తుంది.

## 12. విద్యావిద్యా స్వరూపిణీ

దీనినిబట్టి మానవులందరికీ మిథ్యా దృష్టి సత్య దృష్టి అని రెండు దృష్టులు చెప్పుకోవలసి వస్తున్నది. అవి ఇటు వ్యవహారలో అటు పరమార్థంలో కూడా కనిపిస్తాయి. వ్యవహారంలోకూడా ఇది ఇలాంటిదని గ్రహించనంత వరకూ అది మిథ్యా దృష్టే. అలాగే ఇది నేను ఇంతకు ముందు అనుకొన్నలాంటిది కాదు ఇలాంటి స్వభావం కలదని ఎప్పుడు గ్రహిస్తామో అది సత్య దృష్టి. ఈ సత్య మిథ్యా దృష్టులకే విద్యావిద్యలని మారు పేరు. ఇందులో సత్య దృష్టి విద్య. మిథ్యా దృష్టి అవిద్య. కాగా పరమార్థ విషయంలో విద్య కూడా వస్తుతః అవిద్యే. ఋగ్వేదం మొదలుకొని అన్ని విద్యలకూ అవిద్యలేనని నామకరణం చేసింది ముండకోపనిషత్తు. మరి విద్య ఏదని అడిగితే యయాతదక్షర మధిగమ్యతే. దేని ద్వారా అక్షరమైన తత్త్వాన్ని అందుకోగలమో అది అని వర్ణించి చెప్పింది.

ప్రస్తుతం విద్యావిద్యా స్వరూపిణి అని ఆ దేవిని వర్ణిస్తున్నదీ నామం. చిదేక రసరూపిణి అయిన ఆ దేవి విద్యా స్వరూపిణే కావాలిగాని అవిద్యా స్వరూపిణి ఎలా అయింది. అంతే గాక విమర్శ రూపిణీ విద్యా అని సహస్ర నామాలలో ఇతరత్రా విద్యా రూపిణిగానే కీర్తించ బడుతున్న దావిడ. అవిద్యా రూపిణిగా ఎక్కడా చెప్పబడలేదు. అలాంటప్పుడీ నామానికి అర్థ మేమిటి.

దీనికి సమాధాన మేమంటే విద్యావిద్య లనేవి ఆ దేవతవి కావు. మనకు చెందినవవి. విద్యా దృష్టితో మనం చూస్తే ఆ దేవత

విద్యా రూపిణిగా స్ఫురిస్తుంది. అవిద్యా దృష్టితో చూస్తే అవిద్యా రూపిణిగా భాసిస్తుంది. మనకు గల విద్య ఉదయాస్తమయాలు చెందుతున్న విద్య. విద్య ఉదయించి నప్పుడవిద్య అస్తమిస్తుంది మనకు. అవిద్య ఉదయిస్తే విద్య అస్తంగత మౌతుంది. ఈ విధంగా ఉదయాస్తమయాలు పొందుతున్నది మన విద్య. పోతే ఆ దేవత తాలూకు విద్య ఎప్పుడూ వ్యభిచరించదు. సకృత్విభాతా అని వేదం బోధించినట్టు నిత్యమూ ఉదయించే ఉంటుంది గాని అస్తమయ మనేది ఎరగదు. అందుకే సదోదితా నిత్యోదితా అని కూడా ఆ దేవి పేర్కొన-బడుతున్నది.

కావచ్చు కాని అలాంటప్పుడావిడ స్వరూపం విద్యావిద్యాత్మకంగా వర్ణించటమెలా సమంజసమని సందేహమింకా తీరలేదు. విద్యావిద్యలనేవి ఒకదానికొకటి సాపేక్షమైన భావాలు. విద్యను బట్టి అవిద్య. అవిద్యను బట్టి విద్య. ఇలాంటి అపేక్షా బుద్ధి ఎక్కడ తొలగుతుందో- అది దేవీ స్వరూపమని గ్రహించాలి మనం. కనుకనే విద్యావిద్యలు రెండూ వేరుగా కాక ఆవిడ స్వరూపంలోనే ఏకమై ఉన్నట్టు వర్ణించబడింది. విద్య అయినా ఆవిడ స్వరూపమే అవిద్య అయినా స్వరూపమే. స్వరూపానికి భిన్నంగా అదీ లేదు. ఇదీ లేదు. దీనిని బట్టే పరస్పర విరుద్ధమైన ఆ రెండింటినీ- వాటి తాలూకు బుద్ధులనూ- ఆ దేవీ స్వూపంలోనే లయం చేసి చిదేక రస రూపంగానే తత్త్వాన్ని భావించాలని ఈ నామానికి తాత్పర్యం.

Yallamraju Srinivasa Rao
www.adhyatmikam.in

## 13. దుష్టదూరా 14. శిష్టేష్టా

ఆ విధంగా భావించలేని వారెవరో వారందరూ దుష్టులు. దుష్టులైన వారికా దేవి ఎప్పుడూ దూరంగానే ఉండిపోతుంది. ఎప్పటికీ గోచరం కాదు. వారు దుష్టులెలా అయ్యారని అడగవచ్చు. దోషాల చేత దూషితులైన వారు వారంతా. ఈ దోషాలు మూడు విధాలని పరిగణించారు శాస్త్రజ్ఞులు. వాటినే పాపాలని కూడా పేర్కొంటారు. అందులో మొదటిది అవిద్య. రెండవది కామం. మూడవది కర్మ. ఆత్మ జ్ఞానం లేకపోవటమే అవిద్య. దాని చేత ఆత్మే అనాత్మగా భాసిస్తుంటుంది. అవే పుత్ర కళత్రాదులు- ధన ధాన్యాదులు. భాసించే సరికి వాటిని సొంతం చేసుకోవా లనిపిస్తుంది. అది కామం. దానితో ఆ విషయాలను సాధించటం కోస మొక ప్రయత్న మేర్పడుతుంది. అది కర్మ. కర్మ వల్ల ఫలం. ఫలం వల్ల చివరకు అనుభవం. ఇంతకూ ఈ సంసారాని కంతటికీ హేతుభూత మైనవీ మూడే. అవిద్యా కామ కర్మలు.

ఈ మూడు దోషాలు మన లెంతవర కంటి పట్టుకొంటాయో- అంత వరకూ మనమంతా దుష్టులమే. దుష్టులం గనుకనే ఆవిడ మనకు దూరమైపోయింది. యథార్థంలో పోలేదావిడ. మన కగోచరం కావటమే ఆ పోవటం. అందుకు కారణమీ దోష త్రయమే. ఇవి మూడూ మూడు తెరలై దేవీ స్వరూపానికీ మన బుద్ధులకూ నడుమ అడ్డుపడుతున్నాయి. దీని మూలంగానే ఆ తత్త్వం మనకు దూరమైంది. కనుకనే ఆ దేవతకు దుష్టదూరా అని పేరు రావటం.

అయితే మరలా ఆవిడ మనదగ్గర కెలా వస్తుంది. వచ్చి మన చిత్త వృత్తు లన్నింటినీ వ్యాపించి మన చిత్తాన్ని తన స్వరూపంలోఎలా లయం చేస్తుందని ప్రశ్న. దానికి జవాబు చెబుతున్నారు శిష్టేష్టా అని. మూడు దోషాలూ నిర్మూలమైతే చాలు. దుష్టుడు శిష్టుడుగా మారిపోతాడు. అలాటి శిష్టుడికి ఇష్టమౌతుంది దేవి. ఏషణమంటే కోరటమనీ అన్వేషించటమనీ కూడా అర్థమే. తత్త్వాన్ని అన్వేషించి తన స్వరూపంగా భావించాలని సాధకుడు కోరుతాడు కాబట్టి రెండూ ఇక్కడ చెప్పుకోవచ్చు. ఒకటి పొందాలని మొదట ఇచ్ఛ- తరువాత అన్వేషణ- అన్వేషించిన దానితో తాదాత్మ్యం చెందాలని మరలా ఇచ్ఛా- కలగటం సహజమే.

ఒక మధురమైన పదార్థాన్ని తినాలని మొదట ఇచ్ఛ ఏర్పడుతుంది. ఇచ్ఛ బలీయమైతే వెంటనే దాన్ని కొని తీసుకురావాలని ప్రయత్నిస్తాము. ఆ ప్రయత్నం బలీయమైతే అది తప్పకుండా లభిస్తుంది. ఆస్వాదిస్తాము. ఆప్యాయనం చెందుతాము. ఇక్కడ కూడా ఆ దేవత ఆత్మ రూపిణి అయి కూడా బహుకాలం నుంచి అది మనం విస్మరించాము. ఉన్నట్టుండి మరలా దాన్ని గ్రహించాలని ఇచ్ఛ ఏర్పడుతుంది. ఏర్పడిందో లేదో దాన్ని సాధించటానికి ప్రేరణ చేస్తుంది. ప్రేరణ బలమయ్యే కొద్దీ అన్వేషించి దాన్ని ఆత్మ స్వరూపంగా అనుభవించగలం. సందేహం లేదు. శిష్టుల చేత అన్వేషింపబడేదీ- వారికిష్టమైనదీ గనుక ఆ దేవి శిష్టేష్ట అయింది. అలాగే శిష్టులంటే తనకిష్టం గనుక కూడా ఆవిడ శిష్టేష్ట అయిందని చెప్పినా చెప్పవచ్చు. శిష్టులావిడను కోరితే శిష్టుల నావిడ కోరుతుందని భావం. ప్రియోహి జ్ఞానినోత్యర్థ- మహం సచ మమ ప్రియః- అని గదా భగవానుడిచ్చిన హామీ.

అవశ్యంగా ఆ శక్తి వారిన నుగ్రహించి తీరుతుంది. మధురమైన పదార్థ మనుభవానికి వచ్చినట్టనే అనుకోరాదు. భక్ష్య భోజ్యాదులు మనం తయారు చేస్తే తయారయ్యేవి. లేదా తయారైనవి అంగడి నుంచి తెచ్చుకొని భుజించేవి. ఇక్కడ అలాంటి వ్యవహారం కాదు. ఆ శక్తి సర్వతో వ్యాపిని. సర్వ వస్వాత్మిక. దానినెవరూ తయారు చేయనక్కరలేదు. ఎక్కడి నుంచీ తే నక్కరలేదు. అంతకు పూర్వమే మన దగ్గరే మన స్వరూపంగానే ఉన్నదది. కేవలం దానిని మరుగు పుచ్చిన ఈ మూడు దోషాలను దూరం చేయగలిగితే చాలు. మన కభిన్నంగానే అది మన అనుభవానికి రాగలదు. ఈ ప్రత్యభిజ్ఞానమూ లేదా గుర్తించటమే శిష్టులమైన మనబోటి వారంతా చేయవలసిన సాధన.

### 15. సంహృతాశేష పాషండా 16. సదాచార ప్రవర్తికా

వాస్తవమే. కాని దుష్టులుకూడా శిష్టులలాగే సృష్టి అయిన వారు కదా. అలాంటప్పుడు దుష్టులని వారి నుపేక్షించటం దేనికి. కరుణా మూర్తి అని గదా పేరా జగజ్జననికి. ఏమిటీ పక్షపాతం. దుష్టులను కూడా ఆవిడ శిష్టులలాగా పాలించ వలసిందే అని ప్రశ్న వస్తుంది.

నిజమే. పాలించవలసిందే. సందేహం లేదు. పాలిస్తున్నది కూడా అసలు. ఎలాగంటే సంహృతా సేష పాషండ ఆవిడ. అవైదికములై పురుషార్థానికి మనలను దూరంచేసే చార్వాకాది మతాలు చాలా ఉన్నాయి లోకంలో. వాటికి పాషండ మతాలని పేరు. అలాంటి వాటిని నిశ్శేషంగా నిర్మూలిస్తుందా దేవి. అందుకే ఆ దేవికీ పేరు వచ్చింది.

పాషండ మతాలన్నీ తరుచుగా లోకంలో చలామణీ అవుతుంటాయి. ఫలితం వెంటనే కనిపిస్తుంది కాబట్టి అవంటే మానవులకెంతో ఆకర్షణ. సాధారణంగా మానవులు తొంభై తొమ్మిది మంది మంద ప్రజ్ఞులు. కనుకనే దుష్టమత సాంగత్యంతో దుష్టులై పోతుంటారు. లౌకికమైన ప్రయోజనాల చేతనే సంతుష్టులై అంత కంటే అతిరిక్తమైన ఫలితంకోసం ప్రయత్నించరు. అంధ గోలాంగూల న్యాయంగా ఎక్కడికక్కడ అగమ్యమైన జీవయాత్ర సాగిస్తూ- చివర కనాత్మజ్ఞులుగానే తనువు చాలిస్తారు. అనాత్మజ్ఞులుగానే మరలా ఒక శరీరం ధరిస్తారు.

అంచేత వారికి అవిద్యాది దోషాల నాపాదించే ఇలాంటి పాషండ మతాలన్నింటినీ సంహరించి ఆ దేవి శిష్టుల మార్గానికే దుష్టులను కూడా త్రిప్పటానికి ప్రయత్నిస్తుంది. తత్ఫలితంగానే ఆయా దేశాలలో అప్పుడప్పుడు ప్రవక్తలైన ఆచార్య పురుషులు జన్మిస్తుంటారు. వారంతా దేవీ కటాక్ష బలంతోనే ఆత్మ విజ్ఞానం సంపాదించి ఆవిడ అనుగ్రహంతోనే పాషండు లందరినీ దేశం నుంచి వెళ్ళ గొట్టి మరలా దేశంలో సర్వత్రా సదాచారాన్ని ప్రవర్తింపజేస్తారు. శంకర రామానుజాదులందరూ పూర్వమలా చేస్తూ వచ్చినవారే. ఇప్పుడు కూడా అలాగే కృషి చేస్తున్నారు కొందరు మహానుభావులు. వీరందరి రూపాలలో ప్రచ్ఛన్నమై ఆ మహా శక్తే ఇలాంటి మహోద్యమం సాగిస్తూ పోతుందని మనమర్థం చేసుకోవాలి.

తాను తరించి పరులను తరింప జేయాలని పెద్దల మాట. సదాచార సంపన్నులైన వారా గురువులందరూ. స్వయంగా ఈ సంసార సాగరం నుంచి ఉత్తీర్ణులైన వారే. అలాంటి వారి



Yalamanchi Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

సాంగత్యంతో తక్కిన వారు కూడా సదాచారాన్ని అవలంబిస్తే ఉత్తరణానికి నోచుకోగలరు. యద్యదాచరతి శ్రేష్ఠః అని భగవద్గీతే చాటుతున్నది. గతానుగతిక మైనదీ లోకం. ఒక పేరు ప్రఖ్యాతులున్న పురుషుణ్ణే లోకు లనుసరిస్తారు. వాడు పాషండుడైతే వీరూ పాషండ మతాన్నే అనుసరించి దుర్జనులౌతారు. సదాచారుడైతే అతని సదాచారాన్నే అనుసరించి సజ్జనులౌతారు. ఇలాంటి సదాచార ప్రవర్తకులైన మహాత్ముల నప్పుడప్పుడు లోకంలో అవతరింప జేసి తదుపదేశంతో పాషండ మత సంపర్కాన్ని వారికి వదిలించి మరలా యథోచితంగా వారిని సదాచార మార్గంలో నడుపుతుందావిడ. దీనినే శాస్త్రంలో లోక సంగ్రహమని పేర్కొంటారు.

## 17. సమయాచార తత్పరా 18. సంప్రదాయేశ్వరీ

ఈ సదాచారమనేది ఎలాంటిది. దీని లక్షణ మెలాంటిది- అని అడిగితే పల్కిస్తున్నారు సమయాచారమని. సమయాచారమే సదాచారం. సమ్య గేతీతి సమయః. సచ్చిద్రూపమైన తత్త్వంతో ఏకం కావటమే సమయం. అలాంటి సమయాన్ని పొందించే ఆచారానికే సమయాచారమని పేరు. శివ సాయుజ్యాన్ని ప్రసాదించే మార్గమని భావం. అదే సదాచారం. సద్రూపుడే గదా పరమాత్మ. అలాంటి పరమాత్మ సాయుజ్యానికి తోడ్పడే ఆచారం గనుక సదాచారం కూడా అదే అవుతున్నది.

ఇలాంటి సమయాచారంలోనే తాత్పర్యమూ దేవికి. తద్విరుద్ధమైన వామాచారాదులలో కాదు. ఎన్నో ఉన్నాయి సాధక లోకంలో ఆచారాలనేవి. వామాచారం కౌలాచారం దక్షిణాచారమని

మూడు ప్రసిద్ధమైనవి. అందులో వామం నికృష్టమైనది. కౌలం సాంకేతికం. పోతే దక్షిణం మాత్రమే సత్యాన్ని నిరూపిస్తుంది. కనుక ప్రాజ్ఞులందరూ దానినే సమయాచారమని స్వీకరించారు. ఇలాంటి సమయాచారాన్ని పట్టుకొని పోతే శివ సాయుజ్యం తప్పకుండా సిద్ధిస్తుంది. సందేహంలేదు. సాయుజ్యమంటే అది కేవలం జ్ఞాన రూపమే. జ్ఞాన మభేద రూపం. దానికి వ్యతిరిక్తమైన ఆచారాలన్నీ సాధ్యమైన ఫలాన్ని సాధకుడికి భిన్నంగా చూపుతుంటాయి. కనుకనే అవి సద్యోముక్తి ప్రదాలు కావు. అవి కూడా క్రమంగా భేదాన్ని వదలుకొని సమయమార్గంలో చేరిపోతే అప్పుడే అవి అపేక్షితమైన ఫలాన్ని మనకంద జేస్తాయి. కాబట్టి పరంపరగా మిగతా ఆచారాలు కూడా చివరకు ఈ సమయాచారాన్నే ప్రధానంగా బలపరుస్తున్నాయి.

సమయాచారమే పరి శుద్ధమైన జ్ఞానానికి సాధనమని ఔపనిషదులైన ఆచార్యులందరూ అనుమోదించారు. అదే సంప్రదాయమని చెప్పి లోకంలో ప్రవర్తింప జేశారు. సమ్యక్ ప్రకర్షేణ దీయతే ఇతి సంప్రదాయః. తత్త్వజ్ఞుడైన సద్గురువు తన జ్ఞానం శిష్యుడికి చక్కగా సమగ్రంగా దానం చేయటానికే సంప్రదాయమని పేరు. అలాంటి జ్ఞానానికి సాంప్రదాయికమని పేరు. ఇలా గురు శిష్య పరంపరా ప్రాప్తమైన జ్ఞానమే లోకంలో ప్రాచుర్యాన్ని పొందుతుంది. శమాదులూ శ్రద్ధాదులూ గల మానవులు సేవిస్తే వారికి సద్యఃఫలకారి అవుతుంది. అయోగ్యులైన వారికి దురవగాహం కాబట్టి కలుషితమయ్యే ప్రశ్న లేదు. దాని శక్తి ప్రభావాలకు హాని కలుగుతుందనే భయం లేదు.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

అయితే ఒక ప్రశ్న. శాస్త్ర ప్రమాణంతో మనం జ్ఞానాన్ని గడించ వలసిన అవసరమేమిటి. శాస్త్రం లేక పోయినా లోకమొకటి ఉంది గదా. అదే మనకు మార్గ దర్శకం. అలాగే మన బుద్ధి కూడా మనకు నిత్యం సన్నిహితంగానే ఉంది. దాని సహాయంతో ప్రతి ఒక్కటీ గ్రహించగలం. అనుభవించగలం. అలాంటప్పుడు గురుముఖంగానే జ్ఞానోపార్జన చేయాలనే నియమం దేనికి. గురువు కూడా ఒక ప్రజ్ఞావంతుడైతే కావచ్చు. తన ప్రజ్ఞ ననుసరించే అతడొక మార్గాన్ని చూపుతూ పోతాడు. అది ఒక్కటే మార్గమనుకోవటం దేనికి. మన బుద్ధి బలంతో ఇంకొక మార్గమన్వేషించి ఎందుకు పట్టుకోరాదు. అలాగే కదా బుద్ధికి ఒక వికాసమూ ప్రగతి శీలతా ఏర్పడగలవు- అని ప్రశ్న.

ఇది కేవలం ఒక అవిచార మూలకమైన ప్రసంగం. ఎందుకంటే లోకంలో సాధకు లందరూ ఒకటి కారు. అధికార తారతమ్యమెంతైనా ఉంటుంది. వారిలో ఉత్తమోత్తము లుంటారు. ఉత్తము లుంటారు. మధ్యము లుంటారు. అలాగే మందులూ ఉంటారు. నాలుగు విధాలైన అధికార ముంటుంది మానవులకు. వీరిలో మొదటి వారికి శాస్త్రంతోగాని గురువుతోగాని నిమిత్తం లేదు. జన్మాంతరగతమైన అభ్యాస పాటవంతో ఈ జన్మలో ప్రతిభావంతులుగానే జన్మిస్తారు. వారి ప్రతిభే వారికి గురువు చేసే పని చేయగలదు. నేనూ- నేను చూచే ఈ సమస్తమూ- బ్రహ్మమేననీ- ఆ బ్రహ్మమాత్మ స్వరూపమనీ- నిత్యమూ అనుసంధానం చేసుకొంటూ జీవ యాత్ర సాగిస్తుంటారు. మరి రెండవ వారు కొంత పాండిత్య మలవడిన బుద్ధిమంతులు. వారికీ గురు సహాయమంతగా అక్కర లేదు. శాస్త్రాన్నే గురువుగా భావించి

Brahmasri Yellamraju Srinivasa Rao
www.advaitaveda.in

తద్బలంతోనే మనన ధ్యానాలు సాగిస్తూ ఆత్మ జ్ఞానాన్ని పొందగలరు. పోతే మూడవ వారు ప్రతిభావంతులు గారు. వ్యుత్పన్న చిత్తులూ కారు. కనుక స్వతంత్రించి ఏ విషయమూ గ్రహించలేరు. గురు ముఖంగానే వారు శాస్త్రాన్ని శ్రవణం చేయాలి. మననం చేయాలి. అప్పుడే వారికి జ్ఞాన మబ్బుతుంది. పోతే ఇక నాలుగవ వారు మంద బుద్ధులు. వారికి గురువు తప్పకుండా అవసరం. గురువును సేవించి ఆయన బోధ నిరంతరం శ్రవణం చేస్తూ క్రమంగా చిత్త మాలిన్యం క్షాళితమైతే తత్త్వజ్ఞానానికి అభిముఖంగా పయనించగలరు.

ఈ విధంగా మొదటి ఇరువురికి గురువక్కర లేకపోయినా కడపటి ఇరువురికీ ఉండి తీరాలి. మొదటి వారికి కూడా ఈ జన్మలో అక్కర లేనట్టు కనిపించినా కడచిన జన్మలలో అది ఉండి తీరుతుంది. లేకుంటే ఇప్పుడీ ఉన్నతమైన భూమిక నందుకోలేరు. కారణం లేకుండా కార్యమనేది ఎప్పటికీ సంభవించదు. అంచేత ఒక గురువుతో పని ఏమిటని నిర్లక్ష్యంగా భావించరాదు. గురు నిరపేక్షంగా తమ పాటికి తాము ప్రవర్తిస్తే భ్రమ ప్రమాదాలకు లోను కావచ్చు.

అయినా గురువనగానే మనం ఉలిక్కి పడనక్కరలేదు. పూర్ణ ప్రజ్ఞుడైన పురుషుడే గదా గురువంటే. అలాంటి పరిపూర్ణ జ్ఞానాన్ని అంద జేసే వాక్యమే శాస్త్రమంటే. మరి జ్ఞానమంటే అద్వైతాత్మ జ్ఞానమే. మరేదీ కాదు. అలాంటి జ్ఞానమే కావాలని కోరినప్పుడు అలాంటి పురుషుడివల్లనే పొందాలది. ఆ పురుషుడే గురువని ప్రస్తుతం చెప్పబడుతున్నవాడు. మరొక ద్వైత గురువు కాదు. ద్వైత శాస్త్రమూ కాదు. అందువల్ల గురువును సేవించిన మాత్రాన

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

బుద్ధి వికాసానికి నోచుకోమనీ- అది సంకుచితమైపోతుందనీ- సాధకుడు భయపడ నక్కర లేదు. మీదు మిక్కిలి ఆ గురువు బోధించేది కేవల అద్వైత భావమే గనుక దురభిమానం వదలి పెట్టి అలాంటి వాణ్ణి ఆశ్రయించటమే మనకు మేలు. అపరోక్ష జ్ఞాన మార్జించినవాడు గనుక ఆయన సాక్షాత్తు శివ స్వరూపుడే.

## 19. మహా విద్యా

సరే. అలాంటి గురువు మనకు బోధించే ఆ విద్య ఏమిటి. దాని నామ ధేయమేమిటని మరలా ప్రశ్న. మహా విద్యా అని దానికి సమాధానం. వేద్యతే అనయా ఇతి విద్యా. వేద్య మైన విషయం దేని ద్వారా గ్రహిస్తామో అది విద్య. ఇలాంటి విద్యలీ లోకంలో అసంఖ్యాకంగా ఉన్నాయి. ఎన్ని ఉన్నా అవన్నీ ద్వైత విషయాలే. అది లోక విద్యే కావచ్చు. కర్మ విద్యే కావచ్చు. మంత్ర విద్యేకావచ్చు. యోగ విద్యే గావచ్చు. తంత్రోపాసనాదులే కావచ్చు. ఏ దైనా సరే. ప్రతి ఒక్కటీ వేద్యమైన విషయాన్ని వేదిత అయిన మానవుడికి వేరుగానే చూపుతుంటుంది. వేదితా వేద్యం వేదనమనే త్రిపుటి అనివార్యంగా చోటుచేసుకొనే ఉంటుంది. మూడింటినీ సంపుటీకరించి మూడూ నీ స్వరూపమేనని ఏదీ మనకు బోధించలేదు.

అలా బోధించగలిగిన విద్య ఒక్కటే. అది అద్వైత విద్య. అది ఈ త్రిపుటిని వాస్తవంకాదని కొట్టివేస్తుంది. వాస్తవమైనది శివ స్వరూపమైన ఆత్మ ఒక్కటే. దానికి వేరుగా ఏది ప్రతీతమౌతున్నదో అది ప్రతీతి మాత్రమే. అది కూడా ఆ శివ చైతన్యమే అలా ప్రతీయమాన మౌతున్నది. అజ్ఞాన దృష్టికే అది.

జ్ఞాన దృష్టికి అంతా శివ స్వరూపమే. కనుక జ్ఞానాజ్ఞానాలలోనే అంతా సమసి పోతున్నది. మరి ఈ అజ్ఞాన మెక్కడిది అని అడిగితే ఆ ప్రశ్నే అసలు అజ్ఞాన జన్యం. కనుక ప్రశ్న వేసే ప్రయాస కూడా వదిలేసి ఉన్నదంతా నేననే స్ఫూర్తితో నిలిచి ఉండటమే పరమార్థమని ఈ అద్వైత విద్య మనకు చేసే బోధ.

ఈ ప్రకారంగా అన్ని ప్రశ్నలకూ సమాధాన మిచ్చేది కాబట్టి ఈ విద్య అన్నింటికీ మహత్తర మైనది. మహతీ విద్యా మహా విద్యా. మహత్తరమైన ఈ విద్యే ఆ దేవి స్వరూపం గనుక ఆవిడకు మహా విద్యా అనే పేరు సార్థకం. బ్రహ్మ విద్యా-తత్త్వ విద్యా-అధ్యాత్మ విద్యా-శుద్ధ విద్యా-మోక్ష విద్యా అని ఈ విద్యకే నామాంతరాలు. ఇలాంటి అభేద విద్యను సద్గురువైన వాడు తన శిష్యుడికి చక్కగా సాకల్యంగా బోధిస్తే శిష్యుడది అందుకొని తరిస్తాడు గనుక ఇది ఒక సంప్రదాయమైంది లోకంలో.

## 20. బ్రహ్మాత్మైక్య స్వరూపిణీ 21. తత్త్వమర్థ స్వరూపిణీ

ఐతే గురువు గారు ఈ మహా విద్యను ఎలా ఉపదేసిస్తారు-వారుపదేశించే ఈ విద్యా స్వరూప మేమిటని ఇప్పుడు వివరిస్తున్నాయి ఈ రెండు నామాలు. మొదట బ్రహ్మాత్మైక్య మనేది విద్యా స్వరూపాన్ని మనకు ప్రతిపాదిస్తున్నది. బ్రహ్మమంటే బృహత్తమమైన పదార్థం. బృహత్తమమైతే అది దేశ కాల వస్తువులను మూడింటినీ వ్యాపిస్తుంది. అలాంటి వ్యాపకమైన వస్తువు చైతన్యం తప్ప వేరొకటి కావటానికి వీలు లేదు. ఎందుకంటే అది కూడా చైతన్యంచేత గ్రహించబడ వలసిందే. గ్రహించేదే చైతన్యం. ఆ గ్రహించే స్వభావం ఉన్నది నేననే స్ఫురణ ఒక్కటే. ఈ నేననే

స్ఫురణమే ఆత్మ అంటే. కనుక ఆ బ్రహ్మానికీ ఈ ఆత్మకూ తేడా లేదని తెలిసిపోతున్నది. కేవలం నేననే భావంతో ఒక దాన్ని గ్రహించే స్ఫురణే కాబట్టి బ్రహ్మమే ఆత్మ.

అలాగే ఆత్మే బ్రహ్మం. ఆత్మ అంటే ఇప్పుడీ శరీరంలో నేనునేనని స్పందించే చైతన్యమే గదా. అది ఈ జడమైన శరీరం కాదు. ప్రాణం కాదు. తుదకు మనసు కూడా కాదు. అవన్నీ నేనని స్ఫురించటంలేదు. పైగా ఇదీ ఇదీ అని మాత్రమే నాకు స్ఫురిస్తున్నాయి. నాకు స్ఫురించేవి నేనెలా కాగలవు. అంచేత శరీరంలో నియంత్రిత మైనట్టు భావించబడుతున్నా జ్ఞాన రూపుడను కనుక నేను శరీరం లోనే ఇమిడి పోను. నిరాకారుడను గనుక ఆకాశం లాగా సర్వత్రా ఉన్నవాడనే.

ఈ విధంగా బ్రహ్మ- ఆత్మ రెండూ నిరాకారమూ సర్వగతమూ అయినప్పుడు రెండూ ఒకదాని కొకటి భిన్నమెలాకాగలవు. భిన్నంకాకుంటే రెండింటికీ ఏకాత్మ భావమే ఏర్పడుతున్నది. శరీరం వెలపల ఉంటే బ్రహ్మమనీ లోపల ఉంటే ఆత్మ అనీ ఒకే చైతన్యం కేవలం రెండుగా విభక్తమైనట్టు కనిపిస్తున్నది మనకు. ఈ దృష్టిని బట్టే అది పరోక్షమనీ ఇది అపరోక్షమనీ ప్రవాద మేర్పడింది లోకంలో. వాస్తవంలో రెండూ కలిసి ఒకే తత్త్వం. అది మన కపరోక్షం.

దీనినే వేదాంత శాస్త్రంలో మహా వాక్యమని వర్ణిస్తారు. జీవేశ్వరుల కిద్దరికీ ఐక్యాన్ని చెప్పే వాక్యానికి మహా వాక్యమని పేరు. అది ఎలా సంభవమో విభజించి నిరూపించే దానికి అవాంతర వాక్యమని పేరు. మొదటి దాన్ని వాక్యార్థమనీ- రెండవదాన్ని

పదార్థమని కూడా వ్యవహరిస్తారు. పదార్థ జ్ఞానం వల్లనే వాక్యార్థ జ్ఞానమేర్పడుతుందని సిద్ధాంతం. అవే తత్త్వం పదార్థాలు. తత్ అంటే బ్రహ్మం. త్వం అంటే మనబోటి జీవుడు. ఇవి రెండూ తత్త్వమసి వాక్యంలో ఉన్న రెండు పదాలు. వీటికి చెప్పుకోవలసిన అర్థమే తత్త్వమర్థం.

ఈ అర్థం వాచ్యమూ కావచ్చు లక్ష్యమూ కావచ్చు. వాచ్యార్థమైతే వీడు జీవుడే. వాడీశ్వరుడే. ఇద్దరికీ ఐక్యమనేది చెల్లదు. ఎందుకంటే రెండింటినీ ఉపాధులు వేరు చేస్తున్నాయి. దేహం జీవుడి కుపాధి. ప్రపంచం ఈశ్వరుడి ఉపాధి. ఈ రెండు పాధు లున్నంత వరకూ ఇద్దరూ దూరంగా ఉండిపోవలసిందే. దగ్గర పడలేరు. ఏకం కాలేరు. అంచేత వాచ్యార్థం కాక లక్ష్యార్థం చెప్పుకోవలసి ఉంది. అది జహదజహద్రూపమైనది. రెండంశాలలో ఒకటి పరిత్యజించి మరొకటి పట్టుకొంటే అక్కడ వర్తిస్తుందీ సూత్రం. సోయం దేవదత్తః- ఇలాంటి వాక్యాలలో కనిపిస్తుందది. సోయం అంటే వాడే వీడు. వాడే వీడన్నప్పుడు కాలానుగుణంగా జరిగిన మార్పులు మనసుకు రానీయక ఆవ్యక్తిని మాత్రమే ఎలా గుర్తిస్తామో- అలాగే ఇక్కడ తత్త్వాన్ని గుర్తించ వలసి ఉంది. జీవుడి శరీరాది సంఘాతమేది ఉందో దాని నుపేక్షించాలి. అహం అనే చైతన్యాంశ ఏది ఉందో దానినే పరిగ్రహించాలి. అలాగే ఆకాశాది పృధివ్యంతంగా ఈశ్వరుడికి ఏ విశ్వరూపముందో దాన్ని త్రోసిపుచ్చి అక్కడ ఏ చైతన్య లక్షణముందో దానినే పట్టుకోవాలి.

ఈ విధంగా ఉభయత్రా చైతన్యమొక్కటే శేషిస్తున్నది గనుక-చైతన్యమేక రూపం గనుక- ఉభయులూ ఏకమైన తత్త్వమేనని పర్యవసిస్తున్నది. పోతే ఆ దూరం చేసిన వారి ఆ

ఉపాధి ద్వయం కూడా వస్తుతః చైతన్యానికి అన్యంకాదు గనుక అనన్యంగా భావించినప్పుడది కూడా అందులోనే కరిగి పోతుంది. ఇలా తత్త్వం పదార్థాలను శోధన చేస్తే- ఆ పదార్థ జ్ఞానం వెంటనే వాక్యార్థ జ్ఞానానికి దారి తీసి- అది సాధకుడికి అప్రయత్నంగా అనుభవానికి రాగలదు. ఈ ఐక్య జ్ఞానమే మహా విద్యా స్వరూపిణి అయిన ఆ దేవి స్వరూపం. తత్త్వమసి మహా వాక్యమే గురువు శిష్యుడికి ఆ విద్య నుపదేశించే విధానం.

## 22. విమర్శరూపిణీ

ఇలాంటి బ్రహ్మ విద్యను సాధకుడు నిత్యమూ విమర్శిస్తూ పోవాలి. విశేషేణ మర్శః విమర్శః. ఒక విషయాన్ని బాగా లోతుకు దిగి పరిశీలించట మని అర్థం. పునః పున రను సంధానమని కూడా దీనినే పేర్కొంటారు. ఇలాంటి విమర్శ రూపిణే ఆ పర దేవత. బ్రహ్మానుభవానికి విద్య ఒక్కటే తప్పవిడిచి మరి ఏ అనుష్ఠానమూ అక్కర లేదు గదా. అలాంటప్పుడీ విమర్శ వల్ల ప్రయోజన మేమిటని ఆశంక కలగవచ్చు.

విద్యే చాలు వాస్తవానికి. అదే అనుభవం. సందేహం లేదు. కాని అలాటి విద్య కలగాలంటే హఠాత్తుగా కలిగే వ్యవహారం కాదు. దానికి ప్రయత్నం ఆవశ్యకం. అలాంటి ప్రయత్నమే విమర్శ. నిరంతర ఆలోచనాత్మక మిది. తత్త్వమసి వాక్యం మీద విచారణకే విమర్శ అని పేరు. తత్త్వం అనే రెండు పదార్థాలూ శ్రవణం చేసి నంత మాత్రాన సరి పోదు. ఎన్నో సందేహాలుండి పోతాయి. వాటిని మనం మననం ద్వారా పోగొట్టుకోవాలి. మననమే విచారణ.

వాచ్యార్థం కాదు లక్ష్యార్థమే చెప్పుకోవాలని చేసేదే విచారణ. అసలు తత్త్వమసి వాక్యం తత్త్వం పదాలకు సామానాధి కరణ్యం చెపుతుంది. ఇదీ అదీ సమానమని చెప్పటమే సామానాధికరణ్యం. పదాలే కాదు. పదాల అర్థాలు కూడా సమానం కావాలి. అంటే ఏకం కావాలి. ఎలా అవుతాయవి. జీవుడీశ్వరుడే నన్నప్పుడు వీడి ఉపాధులడ్డు తగులుతాయి. అలాగే ఈశ్వరుడే జీవుడన్నా ఆయన ఉపాధులు తగులుతాయి. కనుక లక్షణ చేత రెండుపాధులనూ వదలు కోవలసి ఉంది. జీవుడీశ్వరుడేనని భావిస్తే వీడి పరిచ్ఛిన్నత్వం తొలగి పోయి ఈశ్వరుడి పరిపూర్ణత్వం లభిస్తుంది. అయినా అది సామానాధికరణ్యంలో ఒక భాగమే. పరిపూర్ణత్వం జీవుడికి కలిగినా- ఈశ్వరుడింకా అతడికి పరోక్షంగానే కనిపిస్తుంటాడు. అది పోవాలంటే ఆ ఈశ్వరుణ్ణే మరలా ఈ జీవుడు నేనేనని భావించాలి. అప్పుడు పరోక్షత్వం పోయి అది అపరోక్ష మౌతుంది. ఇలా ఎడాపెడా భావన చేస్తే చివరకు పరిపూర్ణ అపరోక్ష ఆత్మానుభవం తప్పకుండా సిద్ధిస్తుంది.

కనుక కేవలమూ శ్రవణమే గాక మననం కూడా చేయాలి సాధకుడు. అంతే కాదు. మననానంతరం నిదిధ్యాసన కూడా సాగించ వలసి ఉంది. ఎందుకంటే ఈశ్వరుడే నా స్వరూపమని అఖండాత్మజ్ఞాన మేర్పడినా- అది ధారావాహికంగా నిలవటమంత సులభం కాదు. మెరుపు లాగా మాసిపోవచ్చు. ఆత్మకు బదులు మరలా అనాత్మ భావాలలోకి సాధకుడు పడిపోవచ్చు. అలా పడి పోకుండా నిలవాలంటే విజాతీయమైన అనాత్మ దృష్టికి స్వస్తి చెప్పి సజాతీయమైన ఆత్మ దృష్టితోనే సాగిస్తుండాలి జీవితం. ఈ మూడవ దానికే నిది ధ్యాసనమని పేరు.

శ్రవణ మనన నిది ధ్యాసనలనే ఈ మూడూ కలిస్తే అది విమర్శ. విమర్శ వల్లనే తత్త్వం ప్రకాసిస్తుంది. వడ్ల దంపకం లాంటిదీ మార్గం. వడ్లు బియ్య మయ్యేంత వరకు దంచ వలసిందే. అందులో పది పోట్లు వేస్తే అది శ్రవణం. యాభై పోట్లు మననం. వంద పోట్లు నిది ధ్యాసనం. చివరకక్కడ బియ్యం కనిపించి నట్లే ఇక్కడా ఆత్మ సాక్షాత్కారమై తీరుతుంది. అయ్యేంత వరకూ అక్కడ దంపకం లాంటిదే ఇక్కడ విమర్శ.

## 23. పరావరా 24. ప్రసిద్ధా

ఇలాంటి విమర్శ రూపిణి అయిన విద్య ద్వారా మనం సాక్షాత్కరింప జేసుకొనే ఆ దేవీ తత్త్వమేమిటీ- దాని అనుభవమేమిటీ అని నామం బయట పెడుతున్నది. పరావర అట ఆ దేవత. ఏది పరమూ అవరమో అది పరా వరం. అవ్యక్తమూ అగోచరమూ అయిన తత్త్వం పరమైతే- వ్యక్తమై ఇంద్రియ గోచరమైన ఈ ప్రపంచం అవరం. ఈ రెండింటినీ నిత్యమూ వ్యాపించి మనకు ప్రత్యక్షమౌతూనే ఉంది ఆ దేవి.ఎలాగని అడగ వచ్చు. పరమే అవరంగా- అవరంమే పరంగా భావిస్తే చాలు. రెండూ ఏకాకారంగా అనుభవానికి వస్తాయి.

అది ఎలాగంటే పరమనేది మనకు పరోక్ష మని కదా చెప్పాము. అదే మూర్తీభవించి ఘనీభవించి కనిపిస్తే ప్రపంచమైంది. అంటే మనమిప్పుడు ప్రపంచమని చూస్తున్నది నిజంలో నామ రూపాలు కావు. ఆ నామాలతో ఆ రూపాలతో ఆ చిచ్ఛక్తే అలా భాసిస్తున్నది. అని ఇలా భావిస్తూ పోతే పరమే అవరమై మనకు దర్శనమిస్తుంది. అలాగే నామమనీ రూపమనీ ఏదేది మనం

లోకంలో చూస్తున్నామో అదంతా నిజానికి వీటి కాధార భూతమైన చైతన్య శక్తి చేత నిండి నిబిడీ కృతమైనదే. ఈ మూర్తి కేవలమా స్ఫూర్తే నని భావిస్తూ పోతే- అవరంగా చూచేదంతా పరంగానే మరలా అనుసంధానమౌతుంది. అమూర్తమే మూర్తమనీ- మూర్తమే అమూర్తమనీ రెంటికీ తేడా లేకుండా ఏక రూపంగానే అనుభవానికి వస్తుంది. ఈ భావాన్నే సూచిస్తున్నదీ పరావర అనే నామం. పర మవరం రెండూ దేవీ స్వరూపమేనని భావం.

ఎటు వచ్చీ అలాటి అనుసంధానం చేయగలిగి ఉండాలి సాధకుడు. నిత్యమూ మనమీ ప్రపంచాన్ని చూస్తూనే ఉన్నాము. అందులో మూర్తమైన ఇండ్లూ వాకిండ్లనే కాదు. వాటితోపాటు మరొక అమూర్తమైన పదార్థాన్నికూడా దర్శిస్తున్నాము. అదేదో కాదు. ఆకాశం. అది ఈ మూర్తమైన వస్తువులన్నింటి లోపలా వెలపలా కూడా వ్యాపించి ఉంది. చిత్రమేమంటే వ్యక్తమైన వీటినెలా చూస్తున్నామో- వాటిని చుట్టి ఉన్న అవ్యక్తమైన ఆకాశాన్ని కూడా చూస్తూనే ఉన్నాము. రెండూ మన దృష్టికి విషయ మౌతున్నాయి. రెండింటినీ ఒక్క మారే గ్రహిస్తున్నాము. కాని రెంటినీ కలిపి సమన్వ యించుకోలేక పోతున్నాము. కేవల మిది వస్తువూ అది ఖాళీ అని విడి విడిగా చూస్తాము. అలాగాక ఖాళీయే అక్కడక్కడా ఘనీభవించి ఆయా వస్తువుల రూపంలో కనిపిస్తున్నదని దర్శించ గలిగితే అదే పరా వర దర్శనం. దర్శించ గలడు మానవుడు. కాని రామాయణంలో హనుమంతుడి లాగా తన శక్తినే తాను మరచి పోతున్నాడు.

కనుక అవధానపరుడైన వాడికీ ప్రక్రియ చాలా సుకరమైనది. సుసుఖం కర్తుమని భగవానుడే సెలవిచ్చాడు గదా. దీనినిబట్టి ఎవడు

గానీ ముందు చెప్పిన మార్గంలో ప్రయత్నం సాగిస్తే పదార్థాలకూ వాటి నడుమ కనబడే ఖాళీకి అంతరం తొలగి పోయి క్రమంగా నామ రూపాలు ద్రవీభవించి ఆకాశ రూపంగానే వారి కనబడే అవకాశముంది. అప్పుడా దేవీ స్వరూపం అలికినట్లు ఏకంగానే సాక్షాత్కరిస్తుంది. యదేవేహ తదముత్ర అన్నట్టు పరమూ అవరమూ ఒక్కటే.

పరావర విభేధం జారి పోతే నేనే ఇది ఇదే నేనని ఆత్మ రూపంగానే సర్వమూ ఆకళించుకోగలం. అప్పుడా దేవి సర్వత్రా ప్రసిద్ధగానే కనిపిస్తుంది. ప్రసిద్ధ అంటె ఎక్కడబడితే అక్కడ సిద్ధమై ఉన్నదని అర్థం. అంటే మనం ప్రయత్నించి సాధించ బని లేదన్న మాట. ప్రయత్న మనేది కొంత ప్రసిద్ధం కొంత అప్రసిద్ధమైనపుడే. సర్వమూ ఆత్మ స్వరూపమే అయి అలాగే సర్వత్రా భాసిస్తునప్పుడిక ఏది ఎక్కడ అప్రసిద్ధం. ఆత్మ రూపేణా సర్వమూ ప్రసిద్ధమే. స్వరూపాన్ని సాధించటాని కెవడైనా యత్నిస్తాడా. కనుక పరావరా ప్రసిద్ధా ఆ దేవత తత్త్వ దర్శులందరికీ.

## 25. భావనా గమ్యా 26. ధ్యాన గమ్యా

కాని ఎంత చెప్పినా అది ఉత్తములకే గాని మంద మధ్యములకు అంత సులభంకాదు.వెంటనే వారి బుద్ధి దానిలో ప్రవేశించదు. ప్రవేశించినా నిలవదు. అతి సూక్ష్మమైన వస్తువేది గానీ వెంటనే మన దృష్టికి తగలదు. ఎదటనే ఉండవచ్చు గాక. చూచినా మనసుకు పట్టదు. అందుకే అలాంటి వారికి భావన అనేది అవశ్యం భావిని. భావన చేతనే ఆ దేవీ స్వరూపం వారి బుద్ధికి గమ్యమౌతుంది. కనుకనే ఆవిడకా పేరు వచ్చింది. ఎంతెంత భావిస్తే అంతంత ప్రకాశిస్తుందా తత్త్వం.

ఈ భావన అంటే ఏమిటని ప్రశ్న. ఆయుర్వేదంలో ప్రసిద్ధమైనదీ మాట. లేహ్య చూర్ణాదులైన ఔషధాలను తయారు చేయటంలో ప్రయోగిస్తారీ శబ్దం. ఒక వస్తువు గుణం మరొక వస్తువుకు సంక్రమించటమే భావన. వాసన అని కూడా దీనినే వ్యవహరిస్తారు. ఈశావాస్యం అనే మాటలో ఏమని చెప్పామర్థం. ఈశ్వర భావనతో ప్రపంచాన్ని చూడమని కదా. అంటే ప్రపంచానికి ఈశ్వర తత్త్వాన్ని పట్టించి చూడటమని తాత్పర్యం.

అదే భావ మిక్కడ కూడా చెప్పుకోవలసి ఉంది. సచ్చిల్లక్షణాలను నామ రూపాలకు పట్టించి ఈ ప్రపంచాన్ని ఆ భావనతో చూడాలి మనం. నిరంతరమూ ఇలాంటి భావన చేస్తూ పోతే క్రమంగా నామరూపాలు నిమజ్జనమై సచ్చిద్రూపమే ఉన్మజ్జనం చెందుతుంది. వాటి స్థానంలో దేవీ రూపమే మనకు సర్వదా ప్రత్యక్ష మౌతుందని భావం. అంతే కాక అది ప్రత్యక్షమైనా మరలా మెరుపు తీగ లాగా అంతర్ధానమైనా కావచ్చు. కాబట్టి అది ఎప్పటికీ మరుగుపడకుండా స్థిరంగా నిలిచి ఉండటానికి ధ్యానం కూడా అభ్యసించాలి సాధకుడు. ధ్యానం చేత కూడా గమ్యమైనదా దేవతా స్వరూపం. ధ్యానమంటే ఒకే భావం అవిచ్ఛిన్నంగా సాగుతూ పోవటం. అలా తైల ధారలాగా సాగుతూ పోతే తత్త్వమనేది అవిచలంగా మనసులో నిలిచిపోగలదు. మనసుతో ఆలోచించేది-వాక్కుతో ఉచ్చరించేది-శరీరంతో నిర్వర్తించేది-సర్వం చిద్రూపంగా ఏకమై సాక్షాత్కరిస్తుంది. సాక్షాత్కరించి అన్ని దశలలోనూ అలాగే నిలిచి ఉంటుంది.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

## 27. ధ్యాతృ ధ్యాన ధ్యేయ రూపా

భావన నిలిస్తే ధ్యానం ఫలిస్తుంది. ధ్యానం ఫలిస్తే సాక్షాత్కార మౌతుంది. అది మన స్వరూపమే. అప్పుడిక ధ్యానం లేదు. ధ్యేయం లేదు. ధ్యాత లేడు. త్రిపుటి కవకాశమే లేదు. మూడూ కలిసి ఆత్మ రూపంగానే మారి అనుభవానికి వస్తాయి. భేద మున్నప్పుడే మూడనే మాట. నేను ధ్యాతను- ఇది నాకు ధ్యేయం- నేను దీన్ని ధ్యానిస్తున్నాను అనే భావమప్పుడే కలుగుతుంది. సర్వమూ చిద్రూపంగా మారినప్పుడు ధ్యాత ఎవడు. ధ్యేయమేమిటి. తద్విషయమైన ధ్యానానికర్థమేమిటి. కనుక మూడూ కలిసి దేవీ స్వరూపంలో లయం కావలసిందే. లయమైతే అవి మూడూ ఆ దేవతే నని అర్థం చేసుకోవాలి మనం. ధ్యానమైనా ధ్యాత అయినా ధ్యేయమైనా మూడూ విడిగానూ దేవతే. మూడూ కలిసీ ఆ దేవతే. అంటే ద్వైతాద్వైతాలు రెండూ దేవతా స్వరూపమేనని తాత్పర్యం.

## 28. నిర్భేదా 29. భేద నాశినీ

ఇలాంటి అవస్థ నిజానికి సర్వాభేద రూపమైనది. అందులో భేదమనేది వాస్తవంగా లేదు. మన అవిద్యా దృష్టి చేత కేవలం కల్పితం. కల్పితమే గనుక ఎప్పుడది తొలగితే అప్పుడా దేవి మనకభేద రూపంగానే ప్రాదుర్భవిస్తుంది. ప్రాదుర్భావ తిరోభావాలనేవి చిద్రూపిణి అయిన దేవతకు లేవు. అవి మనకు చెందినవే. అవి మారుతున్నా వస్తుతః ఆవిడ మార్పు చెందదు. సర్ప ధారాది వికల్పాలుగా చూస్తున్నా రజ్జువు రజ్జువే. అలాగే నామ రూపాది భేదాలతో దర్శిస్తున్నా తన పాటికి తాను దేవత నిర్భేదే. అంటే భేదం లేనిదే.

తనకు భేదం లేదు కనుకనే- ఏ క్షణంలో ఆవిడ నలా వీక్షించగలమో- ఆక్షణంలోనే అలా మనకు మరలా సాక్షాత్కరిస్తుంది. అలా కాకుంటే మనమెంత ప్రయత్నించినా భేద రహితంగా ఆవిడ నెప్పుడూ భావించలేము. అందుకోలేము. భేద మనేది ఆవిడ స్వరూపంలో లేదు గనుకనే అలా దర్శించ గోరే మన దృష్టినికూడా నిర్భేదం చేయగల దావిడ. భేద నాశినీ అనే మాటకిదే అర్థం. మనలో ఉండే భేదాన్ని కూడా నశింప జేయగలదు. భేదం లేనిదే భేదాన్ని నశింపజేస్తుంది. మనకు భేదం కాల్పనిక మైతే- ఆవిడ కభేదం స్వాభావికం. స్వాభావిక మైనదెపుడూ కాల్పనికాన్ని కొట్టివేయటానికి సమర్థమే. అయితే ఆ అభేదాన్ని మన దృష్టిలో నింపుకొని భేద ప్రపంచాన్ని చూడటం అలవరుచుకోవాలి. అప్పుడా అభేద దృష్టే భేత ప్రపంచాన్ని రజ్జు దృష్టి సర్పాదులను నిర్మూలించినట్టు నిర్మూలించగలదు.

## 30. నిర్మమా 31. నిరహంకారా

భేద ప్రపంచమంతా ఈ విధంగా నశించి పోతే మమకారమూ అహంకారమూ అనే రెండూ కూడా దానితోపాటు నశించక తప్పదు. ఎలాగంటే నామ రూపాత్మకమైన ఈ జగత్తంతా ఆత్మ రూపంగానే మారిపోయింది. కనుక మమకారానికి తావులేదు. అలాగే దాని నభిమానించే జీవుడుకూడా ఆత్మరూపుడే అయ్యాడు కనుక అహంకారానికి చోటు లేదు. అంతటా ఆత్మ భావమే రాజ్యం చేస్తున్నప్పుడు ఈ చోరులకు ప్రవేశమెక్కడిది.

అంతకు పూర్వం నేనీ దేహం మేరకే ఉండిపోయి దానినహమనీ- దనికి బాహ్యంగా కనిపించేదంతా మమ అనీ- చూస్తూ వచ్చాను. ఇప్పుడీ శరీరంతో సహా సకల జగత్తూ ఆత్మగానే

మారిపోయింది. అహమని ఎక్కడ పెట్టుకోవాలి అభిమానం. మమ అనే భావ మెక్కడ చూపాలి. నిమిత్తముంటే గదా నైమిత్తికం. అది లేకుంటే ఇదీ లేదు. ఛత్రం లేకుంటే ఛాయ లేనట్టే శరీర జగత్తులు లేకుంటే అహంకార మమకారాలు కూడా లేనివే.

అయితే ఒక సందేహం. అంతా ఆత్మగా మారిన దశలో కూడా దానిని అహమనే కదా గ్రహించవలసింది. అలాగే జగత్తు కూడా ఆ దశలో నా శక్తి అనే కదా దన్ని గ్రహించవలసింది. అలాంటప్పుడు అహం మమలు రెండూ పూర్తిగా కరగి పోవట మెలా సంభవం. అది మాకా దశలో అంగీకార్యమనే చెబుతారు వేదాంతులు. పూర్ణానుభవంలో అహం మమలు ఉన్నా పొరబాటు లేదు. దోషం కాదది గుణమే. కారణమేమంటే అవి కూడా పూర్ణమైన ఆత్మ స్వరూపంగానే అనుభవానికి వస్తాయి. పూర్ణ చైతన్యాన్నే అప్పుడహమని భావిస్తాము గాని శరీరమాత్ర పరిమితమైన తత్త్వాన్ని కాదు. కనుకనే దాన్ని పూర్ణాహంకార మన్నారు. అహంకారమైనా అది అనహంకారమే. అలాగే ఈ ప్రపంచం కూడా చైతన్య శక్తి గానే అనుభవానికి వస్తుంది కాబట్టి మమ అయినా ఇది నిర్మమే. నాకంటే వ్యతిరిక్తంకాదు నా శక్తి అనే భావ ముంటుం దక్కడ. ఈ విధంగా శివ శక్తి రూపమైన అహంకార మమకారాలు పూర్ణాను భవ దశలో మన కామోద యోగ్యమే. ఈ భావానికి సూచకమే ఈ రెండు నామాలు. నిర్ అనే మాటకు అసలే లేదని- పూర్తిగా ఉందనీ కూడా రెండు విధాలా అర్థం చెప్ప వచ్చునిక్కడ. అప్పుడు రెండు భావాలూ కలిసి రాగలవు.

## 32. మృత్యు మథనీ 33. నిర్భవా

పరిమితమైన అహంకార మమకారాలీ విధంగా సర్వాత్మనా వినష్టమైతే- ఇక మృత్యు ముఖంలో ఎప్పుడూ పడిపోడీ జీవుడు. అహం మమల వల్లనే మృత్యువనేది ప్రాప్తిస్తున్నది మనకు. మార్పే గదా మరణమంటే. మార్పు పరిచ్ఛిన్నమైన నామ రూపాలకే గాని పరిపూర్ణమైన దానికి లేదు. ప్రస్తుతం మనమీ శరీరాది పరిచ్ఛేదాన్ని దాటి పోయి పరిపూర్ణమైన చైతన్య రూపాన్ని పొందాము. దానికి భిన్నంగా విశ్వమని ఏది చూచామో అదంతా మనకు శక్తిగా పరిణమించింది.

ఇలా ఉభయమూ నిరాకారమైనప్పుడు ఇక దేనివల్ల మార్పు జరగాలి. మార్పే జరగకుంటే మృత్యు వెలా సంభవం. కనుకనే మృత్యు మథని ఆ దేవత. మృత్యువును మథించి పారేస్తుంది. తనకు మృత్యువు లేక పోగా మనకు కూడా తన మృత్యుంజయత్వాన్ని ప్రసాదిస్తుంది. నిరాకార నిర్గుణ చిచ్ఛక్తి రూపిణి గనుక ఆవిడ ఎలా మృత్యువును దాటి పోయిందో- తదను గ్రహంతో మనం కూడా మృత్యువును దాటి పోగలము.

మృత్యుంజయత్వ మనేది క్రొత్తగా అందుకోవలసింది కూడా కాదు. అది ఎప్పటి నుంచో సహజంగా ఉన్నదే మనకు. మృత్యువు లేదని చెబితే జన్మాంతరాలు కూడా లేవని వేరుగా చెప్పనక్కరలేదు. ఎటు వచ్చీ అది మన స్వభావమనే సత్యాన్ని మరచి పోవటంవల్లనే మృత్యువు సంభవిస్తున్నట్టు భ్రమ పడుతున్నాము. మృత్యు మథని అయిన దేవిని ఆత్మ స్వరూపంగా భావిస్తే మృత్యువు అభావమనే స్పృహ మరలా మనకేర్పడుతుంది. మృత్యువు లేకుంటే

జీవిత మనేది నిరాటంకంగా సాగుతూపోతుంది. భౌతిక జీవితం కాదు. చైతన్య జీవితం. చైతన్య మెప్పుడూ ఉండే వస్తువు. ఒకప్పుడుండి ఒకప్పుడు పోయేదికాదు. అంచేత మృత్యువు లేనట్టే భవం కూడాలేదనే అనుభవం కలుగుతుంది. నిర్భవా అనే నామానికిదే అర్థం. భవం లేనిదే నిర్భవా. భవమంటే జన్మ. జన్మ ఒక కొసా మృత్యువొక కొసా జీవితానికి. అందులో మరణమనే కొస లేక పోతే జననమనే రెండవ కొసా లేదనే అర్థం. ఇందులో మృత్యు మథనీ అనేది మరణాన్ని లేదని చెబితే- నిర్భవా అనే నామం జననం లేదని చాటుతున్నది. అవి రెండూ లేని ఆ దేవతను సేవిస్తే మనం కూడా వాటిని దాటి పోగలమని తాత్పర్యం.

## 34. శాంతా 35. బ్రాహ్మీ 36. పరా నిష్ఠా

ఈ విధంగా మరణ భయం జనన భయం రెండింటికీ తిలాంజలి ఇవ్వగలిగితే అప్పుడు మనకు మిగిలేది కేవలం శాంతావస్థే. జనన మరణాలే అశాంతి మానవులకు. అవి లయమయ్యాయంటే శాంతి అప్రయత్నంగానే సిద్ధిస్తుంది. జననం నుంచే అస లశాంతి ఆరంభ మౌతుంది. మరణం వరకూ తరిమి కొడుతుంది. మరణానంతరం జన్మిస్తే మరలా మొదలౌతుంది. ఈ విధంగా జన్మ మృత్యు పరంపర వల్లనే అశాంతి పరంపర. దానిని నిర్మూలిస్తే ఇదీ నిర్మూలమైపోతుంది. అది మొదలుకొని నిరాఘాటంగా శాంతి కొనసాగుతుంది. దానితో ఆధ్యాత్మికాది తాపత్రయం త్రోపుపడిపోతుంది. తాపత్రయ శాంతే శాంతి. కనుకనే మూడు తాపాలకూ మూడు సార్లు శాంతి మంత్రం పఠించటం. అమ్మవారు శాంత స్వరూపిణి అయి మనలను కూడా శాంతులను చేయ గలదు.

శాంతయే గాదావిడ బ్రాహ్మీ కూడా నని చెబుతున్నది నామం. బృహద్రూప అయి సర్వత్రా వ్యాపించినది గనుకనే ఆవిడ బ్రాహ్మీ. ఆవిడను సేవించిన సాధకులకు కూడా అలాంటి బ్రాహ్మీ దశనే ప్రసాదించగలదు. శాంత మైన స్థితి ఎప్పుడూ బ్రాహ్మీ స్థితే. ఏషా బ్రాహ్మీ స్థితిః అని గీతలో కూడా వస్తుంది. బ్రహ్మ నిర్వాణదాయకమైనదా స్థితి. ఎప్పుడో మరణానంతరం కాదు. జీవిత కాలంలోనే. బ్రహ్మ సంబంధమైనది గనుక దీనికి బ్రాహ్మీ అని పేరు. బ్రహ్మమనేది ఎప్పుడూ ఉన్నది గనుక ఈ దశకూడా దానితో పాటు ఉండవలసిందే. ఉదయాస్తమయాలు లేని దశ ఇది.

అంతే కాదు. శాంతా బ్రాహ్మీ అనే గాక పరా నిష్ఠ కూడా అది. దీనికంటే అన్య మైన దశ మరొకటిలేదు. అతీతమైనదీ లేదు. నిష్ఠ అంటే పరిసమాప్తి అని అర్థం. సానిష్ఠా సాపరా గతిః అని చాటింది ఉపనిషత్తు. ఇంద్రియ విషయాలు మొదలు కొని పురుష తత్త్వం వరకూ ఉన్న అన్ని దశలనూ సోపాన క్రమంలో వర్ణించి చివరకు పూర్ణమైన పురుష స్వరూపం కంటే పరమైనది లేదని అదే నిష్ఠ అని తేల్చి చెప్పింది. కనుక అది పరా నిష్ఠ. ఇంతకూ సకల ప్రపంచమూ శాంతిస్తే- అది సర్వ వ్యాపకమైన బ్రహ్మచైతన్య మైతే- అంతకు మించి మరేదీ లేదు గనుక అదే పరా నిష్ఠ కూడా అవుతున్నది. అలాటి దేవీ స్వరూపమే ఎప్పటికైనా మన అనుభవానికి రావలసింది.

## 37. హేయోపాదేయ వర్జితా

ఇలాంటి పరా నిష్ఠను ఏ జీవుడు అందుకోగలడో అతడే జీవన్ముక్తుడు. జీవించి ఉండగానే ముక్తి సుఖాన్ని అనుభవించ

గలదని అర్థం. కాని జీవించాలంటే శరీరాదులైన ఉపాధులుండాలి గదా. అవి ఉంటే లోక వ్యవహారమూ తప్పదు గదా. ముక్తి అనే మాట కర్థమేమిటని ప్రశ్న వస్తుంది.

దీనికి సమాధానమేమంటే ఇటు శరీరంతోగాని అటు లోకంతో గాని వ్యవహరిస్తున్నా హేయోపాదేయ దృష్టి లేదతడికి. ఒకటి నాకక్కర లేదంటే అది హేయం. కావాలని కోరితే ఉపాదేయం. ఇవి రెండూ వర్జించాడతడు. అవి కనబడుతున్నా ఆ దృష్టితో చూడడు కాబట్టి లేని వాటితో సమానమే. కాకున్నా వాస్తవంలో హేయోపాదేయాలనేవి లేవు లోకంలో. సర్వమూ చిద్రూపమే గదా. దాన్ని స్వరూపమని చూచే వాడికి హేయమెక్కడిది. హేయమంటే త్రోసిపుచ్చటం. స్వరూపాన్ని ఎవరూ త్రోసి పుచ్చలేరు. త్రోసివేయ గలిగితే అది స్వరూపమే కాదు. అలాగే ఉపాదేయం కూడా కాదు మన స్వరూపం. మనకంటే భిన్నమైనదేదైనా ఉంటేనే అది మనకుపాదేయం. అంతా స్వరూప మైనప్పుడు ఉపాదేయం కూడా కాదది. ఉపాదేయమంటే పొందటం గదా. పొందే ఉన్నాము మన స్వరూపాన్ని. ఎక్కడి నుంచో పొందవలసి వస్తేఅది స్వరూపమే కాదు.

నిరాకారమూ వ్యాపకమూ అయిన వస్తువు ఒక్కటే ఉంటుంది ఆకాశమిప్పుడలాంటిదే. దానికేదీ పొందాలని లేదూ. త్రోసి వేయాలని లేదు. హేయోపాదేయ వర్జితమది. జడాకాశమే ఇలాంటి దైనప్పుడు చిదాకాశ రూపిణి అయిన పరా దేవత సంగతి చెప్పేదేముంది. సర్వత్రా దేవతే సర్వమూ దేవతే. తాను కాని పదార్థమే లేదీ సృష్టిలో. కనుక హేయోపాదేయా లెప్పుడూ లేవావిడకు. అయినప్పటికీ మహా మాయా మహా శక్తి కూడా కనుక

వాటిని సృష్టించ గలదు. సృష్టించిన అవి ఏవో కావు మరలా అది ఆవిడ విభూతే. విభూతి దశలో వ్యవహారమనే దానికి లోటు లేదు. హేయోపాదేయాలతో క్రీడించ వచ్చు. అప్పుడు వర్జితం కావవి. ఉన్నవే. దాని కనుగుణంగా మనమీ నామానికి అర్థం చెప్పినా చెప్ప వచ్చు. హేయ వర్జితా అంటే ఉపాదేయత ఉందనీ- ఉపాదేయ వర్జితా అంటే హేయత ఉందనీ- వెరసి రెండూ ఉన్నాయని భావం. ఇలాంటి వ్యవహారం ఆ దేవతకెలాగో- అలాగే ఆ దేవతాత్మ భావాన్ని అందుకొన్న ఈ జీవన్ముక్తుడికీ సంభవమే.

## 38. అభ్యాసా తిశయ జ్ఞాతా

ఇక్కడ ఒక ఆశంక కలగవచ్చు. జీవన్ముక్తి రూపమైన ఈ పరా నిష్ఠ మనకీ జీవితంలో కలుగుతుందా. వ్యాస వసిష్ఠ శుకాదులైన ఉత్తమాధికారులం కాము గదా మనం. మహా అయితే మంద మధ్యమా ధికారులం. ఇలాంటి మహా భాగ్యానికి తగిన యోగ్యత మనకున్నదా అని శంకించ వచ్చు.

దీనికి పరిహారం చెబుతున్నదీ నామం. అభ్యాసా తిశ యజ్ఞాతా అని సమాధానం. నిష్ఠ అనేది ఎంత దుర్లభమని భావిస్తున్నామో- అంత సులభం కూడా. దుర్లభా సులభా అని రెండు నామాలు కూడా ఉన్నాయి నామావళిలో. అది సాధకు లిక్కడ గుర్తు చేసుకోవచ్చు. అభ్యాస మనేది అతిశయ మయ్యే కొద్దీ- నిష్ఠ అనేది తప్పక లభిస్తుంది. అభ్యాసమంటే మాటి మాటికీ చేసుకొనే అనుసంధానం. అభ్యాసేన తు కౌంతేయ- అని గీతాచార్యుడూ- అభ్యాస వైరాగ్యాభ్యాం- అని పతంజలి ముక్త కంఠంతో చాటి చెప్పారు. అభ్యాసం చేత సాధించ లేనిదంటూ లేదు. లోకంలో ఎలాగో పరమార్థంలో కూడా అదే ఉపాయం.

ఈ అభ్యాస మనేది ఇన్ని మార్లని కాదు ఇంత కాలమనీ కాదు. ఫలితం కలిగే వరకూ అభ్యసించ వలసిందే. కనుకనే దీర్ఘకాలం నిరంతరం శ్రద్ధా భక్తులతో సాగించ మని పతంజలి ఉపదేశం. అలాగైతేనే అది పరిపాకానికి రాగలదు. అభ్యాసం పరిపక్వమైతే ఫలం కలగటానికి ఆలస్యం లేదు. తీవ్ర వేగంతో కృషి చేసే వారికి అది ఆసన్నతమ మని ఆయనే చాటి చెప్పాడు. అక్షరాలా నిజమిది. ఒక గాయకుడు ఎంత తీవ్రమైన కృషి సాగిస్తే అతనికి సంగీతమంత వశవర్తి అవుతుంది. ఒక సూపకారుడు ఎంత పాటుపడితే పాక కళ అంత అతనికి హస్తగతమౌతుంది. అలాగే ఇక్కడ కూడా నిత్యమూ ఈ అనాత్మ జగత్తును ఆత్మ చైతన్య రూపంగా భావించే పురుషుడికి అవశ్యంగా భావన పాకానికి రాక తప్పదు. వస్తే అప్పటినుంచీ అనాత్మ జగత్తంతా ఆత్మగానే పరిగణించి- దానితో వ్యవహరిస్తున్నా- అతని బ్రహ్మ నిష్ఠ ఎప్పటికీ దెబ్బ తినదు.

### 39. మైత్ర్యాది వాసనా లభ్యా

అందుకే ఇలాంటి పరిపాకం చెందటానికి మొదటి నుంచీ ప్రయత్నిస్తూ పోవాలి మానవుడు. మానవుడి మనసులో నానా విధమైన అశుభ వాసన లెన్నో పేరుకొని ఉంటాయి. అవి మనం జన్మ జన్మాంతరాలనుంచీ పోగు చేసుకొన్న సరకు. అవే మన శ్రేయో మార్గాని కడ్డు తగులుతున్నాయి. ఇవి ఇలా ఉన్నంత వరకూ జ్ఞానానికే నోచుకోలేము. ఇక నిష్ఠ మనకెంత దూరం. అంచేత మొట్టమొదట మనమీ వాసనలకు వీడ్కోలు చెప్పవలసి ఉంది. దాని కుపాయ మొక్కటే. వాటికి ప్రతి ద్వంద్వి అయిన శుభ వాసనలను అలవరచుకోవటం. అవే మైత్ర్యాది వాసనలు. మైత్రి- కరుణ- ముదిత- ఉపేక్ష- అని యోగ శాస్త్రాలలో నాలుగు

విధాలుగా వీటిని పరిగణించారు. అవే ఇక్కడ చెప్పుకొన్నా తప్పులేదు.

లోకంలో మానవులు కూడా నాలుగు విధాలే. కొందరు సుఖ పడేవారైతే కొంద రెప్పుడూ కష్టపడేవారు. కొందరు పుణ్యాత్ములైతే కొందరు పరమ కర్కోటకులు. మనమీ నలుగురితోనూ జీవితాంతమూ వ్యవహరించక తప్పదు. అలా వ్యవహరిస్తున్నప్పుడు ఆయా వాసనలు కూడా ఏర్పడక పోవు. కనుక అవి ఏర్పడకుండా పోవాలంటే సుఖితుల విషయంలో మైత్రిని- దుఃఖితులలో కరుణనూ- పుణ్యాత్ములలో ముదితనూ- దుర్జనులలో ఉపేక్షనూ అవలంబించటం మంచిది. అవి వరసగా మన ఈర్ష్య కాఠిన్య అసహన ద్వేష వాసనలను నిర్మూలిస్తూపోతాయి. దానితో అశుభ వాసనలు క్రమంగా దూరమైపోయి మనస్సు- వాటికి మారుగా శుభ వాసనలచేత వాసిత మయ్యే అవకాశముంది.

అది పరిపాకానికి వస్తే అశుభ వాసనల లాగే మైత్ర్యాదులైన శుభవాసనలకు కూడా సాధకుడు స్వస్తి చెప్ప వలసి ఉంటుంది. ఎందుకంటే అవి కూడా త్రిగుణాత్మకమే లౌకికమే. గుణాత్మకంగనుక గుణాతీతమైన ఈశ్వర తత్త్వాన్ని దర్శించనీయవు. అందులో నిలకడ చెందనీయవు. కనుక నిర్గుణమైన బ్రహ్మ వాసనతో ఈ శుభ వాసనలను కూడా త్రోసి పుచ్చ వలసి ఉంది. అయితే మొదటనే కాదు. మొదట కొంత కాలం శుభ వాసనల నభ్యసించి వాటి ద్వారా చిత్తాన్ని శుద్ధి చేసుకొని ఆ తరువాత ఈశ్వర భావనతో వాటిని పరిహరించాలి. సత్త్వ శుద్ధౌ ధ్రువాస్మృతిః అని శాస్త్రమే బోధిస్తున్నది మనకీ విషయం. అంచేత సంశయించ పని లేదు. సంశయమెప్పుడూ అనభ్యాసులకే.

అభ్యాసమార్గంలో ఉన్న వారికి లేదది. వారు ఒక మెట్టు మీది నుంచి మరొక మెట్టు మీదికెక్కి పోగలరు. చివరకు శిఖరాన్నే ఆరోహించి అక్కడే నిలిచి పోగలరు. అంచేత మొదట సాధన కోసం శుభ వాసన లభ్యసించినా చివరకు అంతకన్నా శుభమైన ఈశ్వర వాసన అలవరచు కొని వాటిని కూడా పరిత్యజించ వలసి ఉంది. అవి ఉన్నంత వరకూ ఆత్మ స్వరూపానికి మరలా అవరోధమే. చిత్త శుద్ధికి కావాలవి. చైతన్య సిద్ధికి అవసరం లేదు. అప్పుడు మైత్ర్యాది వాసనా లభ్యా అని కాక వాసనా అలభ్యా అని నామాన్ని విరిచి అర్థం చెప్పు కోవలసి ఉంది.

## 40. అజ్ఞాన ధ్వాంత దీపికా

ఇలా అభ్యసిస్తూ మార్గంలో సాగిపోయే మానవుడికి అవశ్యంగా అబ్బుతుంది జ్ఞానం. అది ఉత్పన్నమౌతూనే తనకు ప్రతి పక్షమైన అజ్ఞానాన్ని దూరంగా పారదోలుతుంది. అజ్ఞానమే ధ్వాంతం. పెద్ద అంధకారమని అర్థం. అక్కడ ఏమీ లేకున్నా ఏదో ఉన్నట్టు కనిపిస్తుంది చీకటి. అలాంటిదే ఈ అజ్ఞానం కూడా. దాని విస్తారమే ఈ నామ రూప ప్రపంచం. ఇలాంటి అజ్ఞానమనే కటికి చీకటి లో నిలిపిన ఒక దీపిక లాంటిది చిదాకార వృత్తి. చిదేక రస రూపిణి గదా దేవత. ఆవిడే ఈ అంధకారంలో దీపిక లాగా పని చేస్తుంది. బ్రహ్మాండంగా వెలుగుతుంది. నలువైపులా ప్రసరిస్తుంది. అది ఎంతెంత ప్రసరిస్తుందో అంతంత అంధకారం పటా పంచలౌతుంది. పూర్తిగా వ్యాపిస్తే పూర్తిగానే లయమైపోతుంది. వెలుగులో చీకటి లాగా జ్ఞానంలోనే జ్ఞేయ ప్రపంచమంతా కలిసి పోతుంది. కాబట్టి ఎక్కడికి పోయిందని ప్రశ్న లేదు. వెలుగు లేక పోవటమే చీకటి ఆవిర్భావం. అలాగే జ్ఞాన స్ఫూర్తి లేకనే ఈ

అజ్ఞానం తాండవిస్తున్నది. మరలా చైతన్య కాంతి ఉదయిస్తే చాలు. దాని లోనే నామరూపాత్మకమైన అంధకారం అస్తమించి పోతుంది. జ్ఞానం వినా వేరొక పదార్థం లేదు గనుక జ్ఞానమే అజ్ఞాన రూపమైన ప్రపంచాని కెప్పటికైనా శరణ్యం.

## 41. జ్ఞాన జ్ఞేయ స్వరూపిణీ 42. సామరస్య పరాయణా

ఈ ప్రకారంగా బ్రహ్మాకార వృత్తి రూపమైన జ్ఞాన దీపం చేత అజ్ఞాన రూప ప్రపంచమనే అంధకార మంతా పటాపంచలైతే అప్పుడా మహా శక్తి జ్ఞాన జ్ఞేయ స్వరూపిణిగానే మనకు ప్రత్యక్షమౌతుంది. జ్ఞాన జ్ఞేయాలనేవి పరస్పర విరుద్ధమైన భావాలు కదా. రెండూ ఆవిడ స్వరూపమెలా కాగలవని ప్రశ్న. జ్ఞాన మనేది ఒక వెలుగని వర్ణించాము. అలాంటి వెలుగులో చూచినప్పుడీ జ్ఞేయమంతా దానితో ఏకమై జ్ఞానాత్మకంగానే భాసిస్తుంది. ఆ జ్ఞానమే మరలా ప్రపంచంతో వ్యవహరించేటపుడు జ్ఞేయాత్మకంగా గోచరిస్తుంది. కనుకనే జ్ఞేయ రూపంగా మనం చూస్తున్న దిప్పుడు జ్ఞానమే నని అనుసంధించుకొంటే జ్ఞానమే జ్ఞేయం జ్ఞేయమే జ్ఞానమని సర్వత్రా ఏక రూపంగానే సంవేదన కలుగుతుంది. ఈ సంవేదన అటు జ్ఞాన పక్షాన్నీ ఇటు జ్ఞేయ పక్షాన్నీ ఏ ఒక్క దాన్నీ భజించదు. మన స్వరూపంగానే అనుభవానికి వస్తుంది. రెండూ అప్పుడు మన స్వరూపమే.

దీనికే సామరస్యమని పేరు. సమరస భావమే సామరస్యం. సకల భూతములనూ తన స్వరూపంలోనే ఎవడు దర్శిస్తాడో- తన స్వరూపాన్నే మరలా సమస్త భూతాలలో చూస్తాడో- వాడే సమ దర్శనుడు. శాస్త్రమిలాగే చాటుతున్నది. జ్ఞేయ జ్ఞానా లంటే

ఆత్మానాత్మలే. అవి ఎక్కడ సమత్వం చెందితే అది సామరస్యం. ఎక్కడ సమత్వం పొందుతాయవి. స్వరూపంలోనే. స్వరూపమన్నింటికీ అధిష్ఠానమైన చైతన్యమే. దాని పరిణామమే జ్ఞేయం. దాని దర్శనమే జ్ఞానం. కనుకనే ఇవి రెండూ ఒకదానికొకటి సాపేక్షం. సాపేక్షం గనుకనే నిరపేక్షమైన చైతన్యంలో తప్పకుండా చేరిపోతాయి. అలా చేరిపోతే ఇక ఆత్మే ఆత్మ. తద్భిన్నంగా ఏదీ లేదు గనుక గొప్ప సామరస్యమిది. ఇదే పరమమైన అయనమా దేవికి. కనుకనే సామరస్య పరాయణా అని పేరు గాంచింది. సామరస్యాన్ని మించి వేరొక స్థానమంటూ లేదని అర్థం.

### 43. స్వస్థా 44. ఏకాకినీ

ఇలాటి సామ్యావస్థకే స్వస్థా అని పేరు. స్వస్మిన్ తిష్ఠతీతి స్వస్థా. తనలో తానుండేదేదో అది స్వస్థా. చైతన్య శక్తి ఎప్పుడూ తనపాటికి తానే ఉంటుంది. తనలోనే తానుంటుంది. ఉండేది అది ఒక్కటే కాబట్టి దానిలోనే దాన్ని చూడాలి గాని మరి ఎక్కడా వెదకి పట్టుకొనేది కాదు. కానీ అనాది కాలం నుంచీ నిద్రాణ అయి ఉన్నదా దశ మనకు. అనాది మాయయా సుప్తః అని గౌడ పాదులే అన్నారొకచోట. ఉపనిషత్తు కూడా అది ఎక్కడ ప్రతిష్ఠిత మయి ఉన్నదని అడిగితే స్వమహిమ్ని-తన విస్తారంలోనే తాన్నుదని జవాబిచ్చింది.

కనుక ఆ దేవి ఎప్పుడూ స్వస్థే అయి కూడా అలా కనబడటంలేదు మనకు. శరీరాది పిండ రూపంగానూ పృథివ్యాది బ్రహ్మాండ రూపంగానూ మారి కనిపిస్తున్నది. దానితో అస్వస్థ అయి పోయింది. ఆవిడ కాదు. ఆవిడనలా భావించే మనమౌతున్నా

మస్వస్థులం. ఇలా భావించటమే ప్రాకృతమైన దృష్టి. ఇది అప్రాకృతమైన పారమార్థిక దృష్టిగా మారితే అది చీకటి లాగా విరిసి, పోగలదు. అప్పుడు చిద్రూపిణి అయిన భగవతి స్వస్థగానే మరలా అనుభవానికి రాగలదు. అది మన ఆత్మ స్వరూపమే గనుక ఆ నెపంతో మనమే మరలా స్వస్థులమని పించుకుంటాము.

ఎప్పుడిలాటి స్వస్థత చేకూరుతుందో అప్పుడు దానికంటే వేరొకటి ఇంతకు ముందు లేదు- ఇప్పుడు లేదు- ఎప్పుడూ లేదనే సార్వ కాలికమైన భావమొకటి ఏర్పడుతుంది. అప్పుడా చితి శక్తి అనేక కాదు ఏకాకిని అనే ప్రజ్ఞ మన కుదయిస్తుంది. సర్వదా సర్వత్ర చిద్రూరమే అయినప్పుడు ఆవిడ ఏకాకిని ఎలా కాక పోతుంది. అయినా చమత్కారమేమంటే ఏకాకిని అయికూడా మాయా శక్తి ప్రభావంతో అనేకాకినిగా పరిణమించగలదు. అదే ఈ ప్రపంచం. బహు రూపా- బృహత్సేనా- వివిధాకారా- విష్వక్సేనా- అని నామావళిలో అక్కడక్కడా నామాలిదే అర్థాన్ని బయటపెడుతున్నాయి. ఆ ఏకైక శక్తే అనేక భూమికలు ధరించి కనిపిస్తున్నది గనుక ఇవన్నీ నిజానికి యదార్థమని భావించ రాదు.

అయినా ముప్పాతిక మంది అల్ప ప్రజ్ఞులీ లోకంలో. వారు తమ అల్పజ్ఞతతో ఏకాకిని అయిన ఆ దేవతను పుత్ర కళత్ర క్షేత్ర గృహాదుల రూపంగా దర్శిస్తున్నారు. ఆయా నామరూపాలలోనే ఆత్మ దృష్టి పెట్టుకొని దానినే నెమరువేసుకొంటూ పోవటం మూలాన తమ స్వరూపాన్ని కూడా నానా రూపాలుగా భానిస్తూ- అస్వస్థులు కాకున్నా తమ భావనలో అస్వస్థతను కొని తెచ్చుకొన్నారు. దానితో ఎప్పుడూ స్వస్థగానూ ఏకాకిని గానూ మెలగుతున్న ఆ పరా శక్తికి దూరమై దానిని తమ స్వరూపంగా

పొంద లేకున్నారు. బహూనాం జన్మనామంతే అని వర్ణించినట్టు ఎన్నో జన్మలకు గాని అలాటి ప్రపత్తికి నోచుకోలేక పోతున్నారు.

## 45. దుఃఖ హంత్రీ 46. పురుషార్థప్రదా

అత్యుత్తమమైన ఆ భూమిక నందుకోవాలే గాని మరు క్షణమే మానవుడి హృదయ గ్రంధులన్నీ విశీర్ణమై పోగలవు. దుఃఖానుభవమే గ్రంధి. దఃఖాలయమని వర్ణించారీ సంసారాన్ని. శాస్త్రమే గాదు. లోకానుభవమే చెబుతున్నది మనకు. దుఃఖ భాజనుడు కాని వాడు లేడు. శ్రీమంతుడైనా దరిద్రుడైనా తప్పించుకోలేడు.

ఇలాంటి సంసార దుఃఖాన్ని పోగొట్టుకోటానికే జీవితంలో మన ప్రయత్నాలన్నీ. అయినా సఫలత లేదు మనకు. ఒకటి పోతే మరొకటి కనిపెట్టుకొనే ఉంటుంది. సమూలంగా ఇది నశించాలంటే ఆత్మైక దర్శనమే దానికి దివ్యౌషధం. దాన్ని ప్రసాదించి సాధకుడికి ఏర్పడిన సకల దుఃఖాలూ హననం చేస్తుంది గనుక దుఃఖ హంత్రి అయిందా దేవి. స్వస్థ గనుకనే దుఃఖ హంత్రి కూడా. అస్వస్థత వల్లనే అన్ని దుఃఖాలు. స్వస్థా ఏకాకినీ అయిన దశలో ఏ దుఃఖమూ లేదు.

దుఃఖాలన్నీ నిర్మూలమైతే పురుషార్థాలన్నీ మన కప్రయత్నంగానే సిద్ధిస్తాయి. అర్థమూ అనర్థమని రెండే ఉన్నాయి మానవులకు. అర్థించేదేదో అది అర్థం. అర్థించనిది అనర్థం. సుఖ దుఃఖాలే అర్థానర్థాలు. పురుషుడెప్పుడూ సుఖాన్నే కోరుతాడు గానీ దుఃఖాన్ని కోరడు. కనుక సుఖమే పురుషార్థం. అది నాలుగు విధాలు. ధర్మం-అర్థం-కామం-మోక్షం. అందులో మొదటి మూడూ అనాత్మ ప్రపంచ సంపర్కమున్నవి కనుక ఎప్పుడో కొంత సుఖమిచ్చినా చివరకు దుఃఖదాయకమే.

అలా దుఃఖంతో ఎప్పుడూ మిశ్రితం కాని నిత్య సుఖాన్ని మనకందించేది మోక్షమనే నాలుగవ పురుషార్థమొక్కటే. అందులో అనాత్మ ప్రపంచ గంధం కూడా కాన రాదు. కనుక నిజానికి పురుషార్థమదే. అది ఒకటి లభిస్తే మిగతా మూడు పురుషార్థాలు కూడా అందులోనే మనకు కలసి వస్తాయి. వాటి కోసం వేరే ప్రయత్న మక్కర లేదు. అంచేత అమ్మవారు పురుషార్థ ప్రదా అంటే ఐహికాముష్మిక పురుషార్థాలు రెండూ మనకు ప్రసాదిస్తుందని తాత్పర్యం.

### **47.** స్వర్గాప వర్గదా **48.** నిర్వాణ సుఖ దాయినీ

కాని ఈ విషయంలో చాలా మంది శాస్త్రజ్ఞులే పేచీ పడుతున్నారు. వారు వాదించే దేమంటే అతీంద్రియమైన విషయంలో శాస్త్రమేగదా మనకు ప్రమాణం. అతీంద్రియమైన విషయాలు రెండే రెండు. ఒకటి స్వర్గం- మరొకటి అపవర్గం. వీటికి భిన్నంగా అర్థకామా లనేవి రెండూ కేవల మైహికం. ఇంద్రియ గోచరం. కనుక వాటిని ఉపేక్షించినా తప్పులేదు. ధర్మ బ్రహ్మములు మాత్ర మలా ఉపేక్షించరాదు. అని రెండూ శాస్త్ర చోదితం. అలాంటప్పుడు అందులో ధర్మాన్ని వదిలేసి మోక్షమొక్కటే పురుషార్థమనట మేమి సబబు.

ఇది సరి అయిన వాదం కాదు. ధర్మం శాస్త్ర ప్రమాణకమే కావచ్చు. ఐహికమైన అర్థకామాలకు విలక్షణమే కావచ్చు. కనుకనే మోక్షంలాగా దానికీ ఆముష్మికమనే పేరు వచ్చింది. వీటి రెంటింటినీ ఆ దేవత మనకు ప్రసాదిస్తుంది కూడా. కానీ రెండింటికీ చాలా అంతర ముంది. ధర్మ మాముష్మిక మైనా- అర్థకామాలకన్నా

అతీతమైనా- అది మనకిచ్చే ఫలం సార్వకాలికం కాదు. తాత్కాలికమే. దాని వల్ల స్వర్గాన్నే పొందగలిగినా శాశ్వతంగా ఉండ లేడక్కడ సాధకుడు. అక్కడి నుంచి జారిపడి మరలా గర్భవాసాది దుఃఖ మనుభవించ వలసిందే. దానికి జవాబు చెప్పే భేషజం నిర్వాణ సుఖమొకటే. సమస్తమైన అనాత్మ జాతమూ- అది ఇహమైనా పరమైనా- ఈ మోక్ష పురుషార్థంలో నిర్వాణం పొందవలసిందే. అంటే ఆరి పోవలసిందే. కనుకనే మోక్షానికి నిర్వాణమని పేరు వచ్చింది. ఇలాటి నిర్వాణం వల్ల కలిగే సుఖం నిర్వాణ సుఖం. దానిని సాధకుడికి ప్రదానం చేస్తుంది కనుక ఆ దేవి నిర్వాణ సుఖదాయిని. అందుకే చిరోప భోగ లక్షణమైన స్వర్గాన్ని కూడా కాదనుకొని నిత్యానుభవ లక్షణమైన అపవర్గమే ఏకైక పురుషార్థమని దానినే సేవించాలి సాధకుడు.

## 49. సద్యః ప్రసాదినీ 50. యజమాన స్వరూపిణీ

అంతే గాక ఈ మోక్షరూపమైన ఫలం ఎప్పుడో కాలాంతరంలో కలిగేది కూడా కాదు. ఇప్పటికిప్పుడే కలుగు తుంది. జ్ఞానమెప్పు డుదయిస్తే అప్పుడే మోక్షానుభవం. కనుక ఆ దేవత సద్యః ప్రసాదిని అయింది. అప్పటి కప్పుడే ఫలితాన్ని ఇస్తుందని భావం. దర్మంలాగా కాలాంతరంలో ఇచ్చేది కాదు. యజ్ఞాదులైన ధర్మ కార్యాలు మనమిహంలో ఆచరిస్తాము. ఆచరించిన వెంటనే యజమానుడికా యజ్ఞ ఫలం లభించదు. మరణానంతరం జీవుడు స్వర్గానికి వెళ్ళి అక్కడ పొందవలసి ఉంటుంది. అంత వరకూ వేచి ఉండవలసిందే. అయితే ఒక ప్రశ్న. యజ్ఞమనేది ఒక క్రియ గదా. క్రియ జరుపుతున్నప్పుడే ఫలమంటే అర్థముంది గానీ క్రియ సమాప్తమైన తరువాత

ఫలానుభవ మేమిటి. దానికాధార మేమిటి. ఎలా నిలిచి ఉండగలదది అని అడిగితే- దాని ఫలితం అతి సూక్ష్మంగా అదృష్ట రూపంగా ఉంటుందంటారు మీమాంసకులు. ప్రారబ్ధం తీరి శరీర పాతం కాగానే అది జీవి ననుసరించి పోయి అక్కడ అనుభవ మిస్తుందంటారు వారు. కాబట్టి ధర్మ పురుషార్థం సద్యః ప్రసాది కాదు.

మోక్ష పురుషార్థాని కిలాటి గొడవ లేదు. ఇది సద్యః ఫలదాయకం. ఎప్పుడుదయిస్తే అప్పుడే ఫలితమిస్తుంది. ఎలాగని అడగవచ్చు. మోక్షమంటే పరమార్థం. అది ఎప్పుడూ సిద్ధమయ్యే ఉంది. సాధించవలసింది కాదు. సాధ్యం కాదు గనుకనే యజ్ఞాదికమైన అనుష్ఠాన మక్కరలేదు. జ్ఞానమే అనుష్ఠానం. జ్ఞాన స్వరూపమే గదా మోక్షం. అది స్వర్గాదులైన లోకాంతరాలకు పోయి పొందవలసింది కాదు. పొందబడే స్వర్గంగానీ- దాన్ని పొందే పురుషుడు గానీ- పొందటమనే క్రియ గానీ- మూడూ జ్ఞానమే. ఆ జ్ఞానమే ఫలానుభవం కూడా. అంచేత జ్ఞానం వినా ఇక్కడ మరొక సాధనమేదీ పనికి రాదు. సాధన మనేది ఏదైనా ఉందంటే అది ఆ జ్ఞానానికి ఆవరణమైన అజ్ఞానాన్ని నివారణ చేయటమే. అది కూడా ఆత్మ చైతన్యానికి అనతిరిక్తంగా భావన చేయటమే. మరేదీ కాదు. ఆత్మ భావనతో అనాత్మ భావన తొలగిపోతే- సాధకుడనీ సాధనమనీ సాధ్యమనీ- మరేదీ మిగలదు. మరేదీ లేకుంటే ఈ జ్ఞాన యజ్ఞాన్ని అనుష్ఠించే యజమానుడికి సర్వమూ తన స్వరూపమే అయిపోగలదు. అమ్మవారికి యజమాన స్వరూపిణి అని పేరు వచ్చిందంటే ఇదే దాని అంతరార్థం. ఆ దేవతా- ఆ దేవత

కార్యమైన జగత్తుతో సహా- సాధకుడంతా తన స్వరూపమేనని భావించటమే యజమాన స్వరూపిణి అంటె.

పోతే ఇలాటి యజమాన స్వరూపిణి కాదు బాహ్యమైన యజ్ఞాది సామగ్రి. అందులో యజమానుడూ- యజ్ఞక్రియా- తత్ఫలమైన స్వర్గాదులూ- అక్కడికి ప్రయాణమూ- ఇలాటి వివిధ రూపములైన సాధన సామగ్రి ఉంది. అంతే గాక దానినంతటినీ అనుష్ఠించినా వెంటనే ఆ స్వర్గ ఫలం సిద్ధించదు. కాలాంతరంలో కలుగుతుందని వార్త. అది ప్రత్యక్షంగా తార్కాణమయ్యేది కాదు. కేవల శాస్త్ర మాత్ర గమ్యమైన విషయం. మరి ఈ మోక్ష విషయ మలాంటిది కాదు. ముందు వర్ణించిన సామగ్రి అంతా యజమానుడి స్వరూపానికి వేరుగాలేదు గనుక కాలాంతరం వరకూ ప్రతీక్షించ బని లేదు. జ్ఞాన సమకాలంలోనే సిద్ధి కలుగుతుంది. కలుగుతుందా లేదా అనే విచికిత్స కూడా లేదు. శ్రుతే గాదిక్కడ ప్రమాణం. జ్ఞానుల అనుభవమే గనుక ప్రత్యక్షం కూడా ఇక్కడ ప్రమాణమే. ఇలా ప్రత్యక్షసిద్ధం గనుక నిత్య సుఖదాయకం గనుక ఈ మోక్ష పురుషార్థమే పరమ పురుషార్థం. కాబట్టి సాధకుడైన ప్రతి ఒక్కడూ దీనినే భజించి ఆ సద్యః ఫలానికి నోచుకోవాలని ఫలితార్థం.

## 51. సర్వాంతర్యామినీ 52. పూర్ణా

ముక్తి యజమాన స్వరూపమనే సరికి అక్కడ తప్ప మరెక్కడా మనకది లభించదేమో ననే భ్రాంతి ఒకప్పుడు కలగవచ్చు. అలాంటి అపోహ పెట్టుకోగూడదని చెప్పటానికే ఈ నామం. చిద్రూపిణి అయిన ఆ దేవత ఒక యజమానుడిలోనే

కాదు. సమస్తమైన చరాచర జగత్తులోనూ వర్తిస్తునే ఉంది. ఏది సమస్తంలోనూ ఉంటూ -సమస్తం లోపలా చేరిపోయి- సమస్తానికీ అంతు బట్టక- సమస్తాన్నీ శరీరంగా కప్పుకొని- సమస్తమూ శాసిస్తున్నదో- అదే నీ ఆత్మ- అదే అంతర్యామి- అని బృహదారణ్యకం ఘోషిస్తున్నది. సమస్తానికీ అంతర్గతమైనదా మహా శక్తి. కాకుంటే ఈ సర్వమూ ఉండనూ లేదు. భాసించనూ లేదు. అంతమాత్రమే కాదు. ఆశక్తే అన్నింటి లోపలా చేరి స్థావర జంగమాలనే పదార్థాలన్నింటినీ తిప్పుతున్నది. వాటి చేత ఆయా పనులు చేయిస్తున్నది ఫలానుభవం గూడా కలిగిస్తున్నది.

ఈశ్వర స్సర్వ భూతానాం- హృద్దేశే ర్జున తిష్ఠతి భ్రామయన్- అనే భగవద్వాక్యం లోని భావమిదే. విద్యుదాదికం లాంటి జడ శక్తి కూడా కాదిది. చిచ్ఛక్తి. కనుకనే ఆయా రూపాలుగా మారి పోదామని సంకల్పించటానికీ- వాటిని ధరించటానికీ- మరలా వాటి ద్వారా తతత్ కార్యాలు నడపటానికీ సమర్థమైనది. అందుకే దానిని పూర్ణ అని వర్ణించారు వేదాంతులు. పూర్ణ అంటె అన్నింటిలోనూ నిండి నిబిడీ కృతమైన తత్త్వం. చరాచర పదార్థాల లోపలే కాదు. వెలపల కూడా. వెలపలే కాదు. మధ్యలో కూడా. ప్రతి అణువు దానితో నిండినదే. ఆది మధ్యాంతాలు మూడూ ఎప్పుడా చిచ్ఛక్తితో నిండి పోయాయో- స్థావర జంగమాలకు స్వతంత్రంగా ఉండటానికిక స్థానం లేదు. సర్వమూ శక్తి చేతనే ఆక్రమించబడింది కనుక ఉపాధి జాతమంతా చైతన్య శక్తేనని తేటపడుతున్నది. అహమాదిశ్చ మధ్యంచ భూతానామంతఏవచ- అనే గీతా వచనం కూడా దీనితో సరిబడుతున్నది. అసలు పూర్ణమదః పూర్ణమిదం అనే ఉపనిషద్వాక్యం కూడా ఈ సర్వాత్మ

భావాన్నే వెల్లడిస్తున్నది. కనుక అహమిదం అనే తేడా లేకుండా సర్వమూ ఎప్పుడు చిద్రూపమని పేర్కొన్నామో- అప్పుడది అవశ్యంగా పూర్ణమే అయి తీరుతుంది. దానిని అపూర్ణమని చూపే దానికి భిన్నమైన మరొక తత్త్వమే లేదు గదా. కనుక సర్వాంతర్యామిని అంటే ఆంతర్యంలో చైతన్య రూపంగా పూర్ణమనీ- పూర్ణా అంటే బాహ్యంలో సత్తా రూపంగా పూర్ణమనీ భావించినా సరి పోతుంది. దీనిని బట్టి మహా శక్తి సర్వ వ్యాపకమని సర్వాత్మకమని గ్రహించ వచ్చు.

## 53. శాశ్వతీ 54. శ్రీ శివా

ఇలాంటి పూర్ణావస్థ ఒకప్పుడుండి వేరొకప్పుడు తొలగి పోయేది కాదు. త్రికాలలోనూ ఉండవలసిందే. స్వతస్సిద్ధమైన తత్త్వ మెప్పుడూ శాశ్వతంగానే ఉంటుంది. కనుకనే ఆ దేవికి శాశ్వతి అని పేరు వచ్చింది. శశ్వత్ భవా శాశ్వతీ. ఎప్పుడూ నిలిచి ఉండేదేదో అది శాశ్వతి. స్వర్గాది ఫలం అలా నిలిచి ఉండేది కాదు. కించిత్ కాల భోగ్యమది. సార్వకాలికమైనది మోక్ష ఫల మొక్కటే. మోక్ష మనేది ఇప్పుడే మనకు ఏర్పడింది ఇంతకుపూర్వ లేదని గాని- ఇక మీదట కలగబోతుందని గాని భావించేది కాదు. భూత భవద్భావి వ్యవహార మక్కడ లేదు. పూర్వం లేక ఇప్పుడే కలిగిందంటే మోక్షానికి ఉత్పత్తి చెప్పినట్టవుతుంది. ఇక మీదట ఏర్పడుతుందంటే ఇప్పుడు దాని కభావం చెప్పినట్టవుతుంది. అలాగైతే అది రేపు మనకు లభించినా సుఖం లేదు. మరలా ఎప్పటికైనా నశిస్తుందేమోనని భయమే. కనుక త్రికాలా బాధ్యమైనప్పుడే ఏదైనా శాశ్వత మనిపించుకొంటుంది. అది త్రికాలాల్లోనూ చోటి చేసుకొనే ఉంటుంది.

కనుకనే మృత్యుంజయ సూక్తంలో మృత్యోర్ముక్షీయ అని అక్కడికి విరమించ లేదు. మా అమృతాత్ అని మరలా పేర్కొన్నది. ఇది పునరుక్తి కాదు. ఇందులో ఒక విశేష ముంది. మృత్యోర్ముక్షీయ అన్నప్పుడు. మృత్యు ముఖంలో పడకుండా బయట పడాలని ఆకాంక్ష. మా అమృతాత్ అన్నప్పుడు అమృత రూపమైన మోక్షాన్ని పొంది అక్కడినుంచి మరలా వెనక్కు రాగూడదని అభిప్రాయం. వెనక్కు వస్తే శాశ్వతీ అనే మాటకర్థం లేదు. అంచేత మోక్షావస్థ తక్కిన అవస్థలలాగా కాదాచిత్కం గాదు. శాశ్వతికం.

శాశ్వతం కనుకనే అది శ్రీ శివా అని కూడా కీర్తించ బడుతున్నది. శాశ్వతమైనదేదో అదే శివం. తాత్కాలికమైనది శివం కాదు. శవం. ఉత్పత్తి వినాశాలు ఉన్నదెప్పుడూ శవమే. అది అతి కష్టమైన మన ఈ సంసార దశే. ఎంతో కష్టం మీద దీన్ని దాటి పోయి దాన్ని పట్టుకొన్నాము. అలాంటప్పుడది శివం కాక మరొకటెలా కాగలదు. కేవలమూ శివమే కాదది. శ్రీ కూడా. శ్రీ అనే మాటలో శక్తి అనే భావం ధ్వనిస్తున్నది. శివ అనేది శివ నామం. శ్రీ అనేది శక్తి నామం. రెండూ ఏకమై ఏకరూపాన్ని భజిస్తున్నాయి. శివ శక్త్యైక్య రూపిణీ అని అమ్మ వారికి వేరొక ప్రసిద్ధమైన నామముంది. శివ శక్తులు రెండూ కలిసి ఏక రూపమేనని చెబుతున్నదా నామం.

కాకున్నా శక్తి లేకుండా శివం. శివం లేకుండా శక్తి స్వతంత్రంగా ఉండలేవు. శివమంటే జ్ఞానం. శక్తి అంటే ఐశ్వర్యం. ఒకటి జ్ఞాన శక్తి. ఇంకొకటి క్రియాశక్తి. శ్రీ అనే మాట ఇక్కడ ఆ క్రియా శక్తినే సూచిస్తున్నది. శివ అనేది జ్ఞానాన్ని సూచిస్తున్నది. శక్తి

శక్తిమంతు లిరువురికి బేధం లేదని సిద్ధాంతం. కనుక ఆ రెండింటికీ నిత్యమూ అవినాభావమే. ఇదే పురాణాలలో అర్ధనారీశ్వరమనీ- శైవాగమాలలో మహా మైథునమనీ అనేక విధాలుగా వర్ణించ బడుతున్నది. ఏ విధంగానూ చిదభిన్న శక్తి- శక్త్యభిన్న చితి - ఆత్మా భిన్నంగా చితి శక్తులు రెండూ కలిసి ఏకమే నని అనుసంధానం ఏమరరాదు తత్త్వ జిజ్ఞాసువులు. అప్పుడే అది మోక్ష ఫలాన్ని సాధకులకు ప్రసాదించ గలదు.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఇంత వరకూ మనం దేవీ అష్టోత్తర శత నామాలను ఆరోహణ క్రమంలో చెప్పుకొన్నాము. మొదటిది అవరోహణ క్రమంలో నడిస్తే ఇప్పుడీ రెండవది మరలా ఆరోహణ క్రమంలో సాగుతూపోయింది. అవ్యాజ కరుణా మూర్తి అనే నామం మొదలుకొని శ్రీ శివా అనే నామం వరకూ యాభైనాలుగు నామాలనో వర్ణించిన మార్గమంతా దేవి ఆరోహణ మార్గం. అయితే ఇంతకుపూర్వ మొక మాట చెప్పి ఉన్నాము. అవరోహణ గాని ఆరోహణగాని వాస్తవంలో చేస్తున్నది ఆ దేవి కాదు. మనబోటి జీవులమే. అవిద్యా వాసనలు వదలనంత వరకూ మనం మాటి మాటికీ ఈ సంసారాని కభిముఖంగా అవతరించ వలసిందే. అలాగే నిరంతర అభ్యాస బలంతో ఆత్మ జ్ఞానముదయిస్తే- క్రమంగా ఉత్తరణం చెంద వలసిందే. దేవీ అవతారోత్తారాలనేవి కేవలమొక అపదేశమే. అంతే గాదు. విద్యావిద్యా స్వరూపిణి అని ఆ దేవిని వర్ణించాము. కనుక ఆ దేవతకు సంబంధించిన అవిద్య మూలంగా మన అవరోహణ జరిగితే- తద్విషయమైన విద్య మూలంగా మరలా ఆరోహణ జరగ గలదని భావించినా అది సమంజసమే. మొత్తం మీద ఎడా పెడా చెప్పుకోవటం మూలాన సంసార సాయుజ్యాలు రెండూ ఆ పరా శక్తి రెండు ముఖాలనీ- ఎందులో ఉన్నా మనమా దేవీ తత్త్వంలోనే నివసిస్తున్నామనీ- గ్రహించ గలిగితే అవరోహణ లేదూ- ఆరోహణలేదూ వాస్తవానికి. అంతా దేవీ చైతన్య స్వరూపమే. అది మన ఆత్మ స్వరూపమే.

# సింహావలోకనము.

దేవీ సహస్ర నామాలలో నుంచి అష్టోత్తర శత నామాలను తీసుకొని అవి రెండు భాగాలుగా విభజించి వాటి రెండింటినీ మనమింత వరకూ వ్యాఖ్యానిస్తూ వచ్చాము. అష్టోత్తర మంటే ఇది మామూలుగా మనం లలితా స్తోత్ర గ్రంథాలలో చూచే అష్టోత్తర నామాలు కావు. వాటికీ సహస్ర నామాలకూ సాజాత్యం లేదు. మనం తీసుకొన్న అష్టోత్తర మలాంటిది కాదు. ఇవి సహస్ర నామాలనుంచే స్వీకరించినవి. స్వీకరించి రహోయాగ క్రమాని కనుగుణంగా పేర్చు కొని వ్యాఖ్యానించినవి. మోక్ష సాధనాన్నే దృష్టిలో పెట్టుకొని తీసుకోవటం వల్ల మంత్ర యోగ ఉపాసనాదులకు చెందిన మిగతా నామాల జోలికి పోదలుచుకోలేదు. అవి సాక్షాత్తు జ్ఞానానికి సంబంధించినవి కావు. కనుక జ్ఞానోపయోగులైన నామాలనే తీసుకొని వివరించటం జరిగింది.

లలితా సహస్ర నామాలకు రహస్య నామాలని కూడా పేరున్నది. సాక్షాత్తు హయగ్రీవుడే అగస్త్య మహర్షి కుపదేశించాడని ఐతిహ్యం. ఆచార్యుడు హయగ్రీవుడు- శిష్యు డగస్త్యుడు- అంటే ఏమిటర్థం. హయమనేది జ్ఞానానికి సంకేతం. హయగ్రీవుడంటే అప్పటికి బ్రహ్మ విద్యా పారంగతుడై లోక సంగ్రహ పరాయణుడైన ఒక ఆచార్య పురుషుడని తెలుస్తున్నది. అలాగే అగస్త్యుడంటే ఒక పర్వతంలాగా అచంచల స్వభావుడై ఏకాగ్ర చిత్తుడైన ఒక ఉత్తమ శిష్యుడనీ తేటపడుతున్నది.

ఇలా గురువొక విద్యను బోధించటానికీ- శిష్యుడు దాన్ని సాధించటానికీ- ఏ రెండు లక్షణాలుండ వలెనో అవి ఈ నామ కరణం చేయటంలోనే తెలిసిపోతున్నాయి. అసలా మాటకు వస్తే గురు వనే దా పర దేవతే. సకల జీవులకూ ఆవిడే గురుస్థానం. గురుమూర్త అని గురుమండల రూపిణి అని అందుకే కీర్తించి రావిడను. హయగ్రీవుడికా సహస్ర నామాలు మొదట ఉపదేశించిం దావిడే నని బ్రహ్మాండ పురాణం చెప్పే మాట. మరి ఆవిడ వల్ల ఈ మంత్రోపదేశ మందుకొన్న హయగ్రీవుడు కూడా ఎవరో కాదు. వాస్తవాని కాయన గజగ్రీవుడైన గణేశుడే.

ఎవరీ గణేశ్వరుడు. ఎలా జన్మించాడు. కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీ గణేశ్వరా అని నామం. శివ చైతన్య బలంతో ఆ మహా శక్త కల్పించిన జీవుడెవడో వాడే గణేశ్వరుడు. శివ శక్తి సంయోగం వల్ల ఏర్పడ్డ వాడని అర్థం. చిజ్జడయోః గ్రంధిః జీవః అని ప్రసిద్ధి. జీవుడు చేసుకొన్న కర్మ వల్ల ప్రకృతి పురుషులైన ఆ శివ శక్తులకు ఇలాంటి సంకల్పము దయిస్తుంది. తదనుగుణంగానే ఈ జీవ సృష్టి. కనుకనే పార్వతీ పరమేశ్వరులే గణేశునికి జననీ జనకులని పురాణాలు చాటుతున్నాయి. ఇంతకూ జీవుడికి సంకేతమే గణేశ్వరుడు. భూత భౌతిక ప్రపంచానికి గణమని పేరు. శరీర మనః ప్రాణేంద్రియ సంఘాతమైనా కావచ్చు గణం. ఆ గణానికీ జీవుడే గదా అధిపతి. కనుక జీవుడే గణపతి.

ఈ గాణాపత్యమే వీడికి బంధ హేతువు. దాని వల్లనే కర్మ చేస్తాడు. సుఖ దుఃఖాదు లనుభవిస్తాడు. ఈ కర్తృత్వ భోక్తృత్వాలు మనః ప్రాణాల వల్ల ఏర్పడుతున్నాయి. అవి వీడికి

తల్లి దండ్రుల వల్ల సంక్రమించిన ఆస్తి. ఇందులో జ్ఞాన శక్తి తండ్రి-కి యా శక్తి తల్లి. అవే మనః ప్రాణ రూపంగా ప్రవేశించాయి ఈ కుమారుడిలో. అయితే ఇవి రెండూ ఆ తలి తండ్రులలో మాదిరి పరిపూర్ణంగావు. శరీర మాత్ర పరిచ్ఛిన్నం. అందుకే వారు కల్పించిన శ్రీ అంటే ఐశ్వర్యమేదుందో- దాన్ని విస్మరించి కేవలం ఈ గణాధిపత్యంతో తృప్తి పడ్డాడీ జీవుడు.

గణమనేది వీడికి ఈ సంసారమే అని చెప్పావము. దానికనుగుణంగానే వీడికీ మహాకాయ మేర్పడింది. దానికి తగిన తుండం. చెవులూ చక్షుస్సులూ. దంతాలు రెండు కూడా లేవు ఒక్కటే. క్రింద ఒక వాహనం. అది కూడా ఒక మూషికమట. ఏమిటి ఇదంతా. ఏమిటి తాత్పర్యం. మూషికమంటే చపల స్వభావం. దాని నధిష్ఠించి ఉంది వీడి మనస్సు. గజ మహంకారానికి చిహ్నం. అహం కర్త జీవుడే. వాడీ చపలమైన మనసుతో ఏదేది చూస్తాడో అదంతా సుఖమేనని భుజిస్తూ పోతాడు. అందుకే వీడి కాయం మహాకాయమైంది. దీనికి తోడు చెవులు పెద్దవి. కన్నులు చిన్నవి. ఏమిటర్థం. తత్త్వాన్ని ఎంతగానో వింటాడే గాని దాన్ని దర్శించే శక్తి లేదు. ఆముష్మికమైన శ్రేయస్సును చూడలేక ఐహికమైన ప్రేయస్సు మీదనే దృష్టి సారిస్తాడు. దానికి సంకేతమే ఆ ఏక దంతం. ఇలా జీవితం సాగించే ఈ జీవుడనే గణపతికి సహచరులెవరు. భూత ప్రేతాది గణాలు. ఎవరో కాదు వారు. భూత భౌతిక వాసనలే. వారితోనే నిత్యమూ సతమతమౌతూ పిత్రు దత్తమైన జ్ఞానైశ్వర్యాలను రెంటినీ కోలుపోయాడు. ఏదైనా కొంచెముంటే అది ఈ గణాలకు పంచి పెట్టాడు. దానితో కామేశ్వర....గణేశ్వరా అనే నామంలోని

ఆద్యంత వర్ణాలను కలుపుకొని సంసారమనే కారాగృహంలో ప్రవేశించి అక్కడే బందీ అయ్యాడు. ఈ బందీ కావటమే అమ్మవారి తిరోధానమని భంగ్యంతరంగా గ్రహించ వచ్చు.

పోతే ఈ తిరోధానం నుంచి బయటపడి మరలా ఆవిడ అనుగ్రహానికి అర్హులు చాస్తే- ఈ గణేశ్వరుడే మరలా మహాగణేశ్వరుడు కాగలుడు. భూత గణ సంసర్గం వదలుకొన్న వాడే మహా గణేశ్వరుడు. సంసారమనే విఘ్నయంత్రం వెంటాడుతున్నంత వరకూ అది మనకు అందని మ్రాని పండు. అంచేత మొదట మనమీ విఘ్నయంత్రాన్ని ఛేదించాలి. ఎలా ఛేదించటం. శివ తాదాత్మ్యాన్ని విమర్శిస్తూ పోవటమే ధానికుపాయం. ప్రకాశం శివుడు. విమర్శ మాయన శక్తి. విమర్శ లేనంత వరకూ ప్రకాశం సహజంగా ఉన్నా ప్రకాశించదు. గుప్తంగా సుప్తంగా ఉండిపోతుంది. అంతే కాదు మరొక రూపంలో భాసిస్తుంది మనకు. అదే ఇప్పుడీ సంసారం. దీని వల్లనే వీడు గణేశుడయ్యాడు. బహు జన్మ సంస్కారం వల్ల గానీ- గురూప దేశం వల్ల గానీ మెళకువ వస్తే మరలా తన చైతన్య ప్రకాశాన్ని విమర్శించుకోకలడు. అది పరాకాష్ఠ చెందితే విఘ్నయంత్రాన్ని ఛేదించి మహాగణేశు డౌతాడు. అప్పుడా జగన్మాత ప్రహృష్టురాలై శివ సాయుజ్యాన్ని వీడికి ప్రసాదిస్తుంది. మహా గణేశ నిర్భిన్న విఘ్నయంత్ర ప్రహర్షితా అనే నామం ఈ అర్థాన్నే స్పష్టంగా తెలుపుతున్నది.

ఈ రెండు నామాలు జీవుల రెండు అవస్థలకు ప్రతీకలు. కామేశ్వర ముఖాలోక అనేది వీడి బంధావస్థను సూచిస్తే- మహాగణేశ నిర్భిన్న అనేది మోక్షావస్థను సూచిస్తున్నది. మొదటి దానిలో కా

Brahmasri Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

రా అనే రెండక్షరాలను కలుపుకొని వీడు సంసార కారలో ప్రవేశించాడని ముందు చెప్పాము. ఇప్పుడు దానికి ప్రతిలోమంగా ప్రహర్షితా అనే నామంలోని కడపటి తా వర్ణం గణేశ్వరా లోని రా వర్ణం తో చేర్చి తారా అని ఈ సంసార తార లేదా తరణాన్నే చెందగలడని ధ్వనిస్తున్నది. కార అవిద్య వల్లనైతే- తార విద్య వల్ల. ఇదే గణేశుడికి కలిగే గొప్ప సిద్ధి. బుద్ధి వల్లనే సిద్ధి. అది మహాబుద్ధి అయితే మహా సిద్ధి. శివాకారమైన బుద్ధే మహా బుద్ధి. దానికి తగిన శివ తాదాత్మ్యమే మహా సిద్ధి. ఇవి రెండూ లభిస్తాయి ఈ గణేశ్వరుడికి. ఈ గొప్పభావాన్ని మనస్సులో ఉంచుకొని వర్ణించినవే శివ పురాణాదులలో గణపతికి బుద్ధి-సిద్ధి అనే భార్యలిద్దరున్నారనే కథలు.

అయితే మహా బుద్ధి అని వర్ణించారు గదా. దాని వల్ల గదా మహా సిద్ధి మనకు. అది ఎలా సాధించాలని ఇప్పుడు ప్రశ్న. ఇంతకు ముందే పేర్కొన్నామొక మాట విమర్శ అని. నిరంతర విమర్శనమే దాని కుపాయం. ఏది విమర్శిస్తుందో అది నామం. దాని చేత విమర్శించబడేది రూపం. ఇవే శబ్దార్థాలు. శివ శక్తులు కూడా ఇవే. శబ్దరూపం శక్తి అర్థరూపం శివ. శబ్ద రూపమైన శక్తి విమర్శిస్తుంది. అర్థ రూపమైన శివం ప్రకాశిస్తుంది. స్థూలం మొదలు అతి సూక్ష్మం వరకు ప్రపంచాన్నంతటినీ విమర్శించేది శబ్దమే. అలా విమర్శిస్తూ పోతే అర్థం కూడా శబ్దమై మరలా వేరొక అర్థాన్ని విమర్శిస్తుంది. ఉదాహరణకు పృథివీ అనే శబ్దం స్థూలమైన ఈ భూమిని చెబుతుంది. ఆ భూమి అంతటితో నిలవదు. అది మరలా జలాన్ని చెబుతుంది. అది తేజస్సునూ. అది వాయువునూ. ఆ వాయువాకాశాన్నీ.

ఈ ఆకాశం కూడా అక్కడి కాగదు. జడమైన దానికి స్వతసిద్ధి లేదు. కనుక శివ చైతన్య ప్రకాశాన్ని సూచిస్తుందది. పోతే ఆ ప్రకాశం చిద్రూపమే కనుక తన సిద్ధికి మరొకటేదీ అపేక్షించదు. కనుకనే దానికి పరమార్థమని పేరు వచ్చింది. పృథివ్యాధులైన అర్థాలన్నింటికీ పరమమైన అర్థం గనుక అది పరమార్థం. ఇలాంటి పరమార్థాన్ని ప్రతిపాదించే శబ్ద మెలాంటిది. అది కూడా పరమమైనదే. అదేదో కాదా శబ్దం. ఆకాశంలాగా నిరాకారమూ నిశ్చలమూ వ్యాపకమూ శివాకారమూ అయిన బుద్ధి వృత్తే. అందుకే దానిని పరావాక్కని పేర్కొన్నారు. ఈ విధంగా వాగర్థాలు రెండూ ఈ దశలో నిరాకారమూ వ్యాపకమే అవుతాయి కాబట్టి ప్రకాశ విమర్శలనే రెండూ ఇక్కడ ఏకమే అవుతాయి. అంటే ఆ రూపంలో దాగి ఉన్న శివ శక్తులు రెండూ ఏకమేనని అర్థమౌతున్నది.

ఇదే జీవులందరూ ఎప్పటికైనా అందుకోవలసిన ఆఖరి దశ. ఇదే ముక్తి. ఇదే సిద్ధి. ఇది మనకు స్వాభావికమైనా అవిద్యా దోషంవల్ల తిరోహితమైంది. పునఃపునః విమర్శ రూపమైన బుద్ధితో అనుసరిస్తూపోతే పూర్ణ రూపంలో దర్శనమిచ్చి సాధకుణ్ణి అనుగ్రహిస్తుంది. నామ పారాయణమనే మాటకు కూడా అంతరార్థమేమిటో మనకప్పుడు తెలిసి పోతుంది. నామానికి ఏది పరమైన అయనమో అది నామ పారాయణం. అయనమంటే గమ్యం. పరమమైన గమ్యం మోక్షమే. మరి నామాలో. విమర్శ రూపమైన బుద్ధి వృత్తులే. అందులో పరమైన నామం చిదాకాశాన్ని విమర్శించే బ్రహ్మాకార వృత్తి. దాని పారం ఆత్మకు అభిన్నమైన బ్రహ్మ తత్త్వమే.

ఈ విధమైన మార్గంలో బుద్ధి విమర్శిస్తూ పోతే ప్రకాశ రూపమైన ఆ మహా సిద్ధిని అందుకోగలడు మానవుడు. అప్పుడు వాడు మామూలు గణేశుడు కాడు. మహా గణేశుడు. మహా గణేశ పదవి అనుభవిస్తూ మాతా పితరులైన శివ శక్తులకు ప్రీతి పాత్రుడు కాగలడు. కాని ఇలాంటి మహా భాగ్యం కోటికొకడికే. మనుష్యాణాం సహస్రేషు అని భగవద్గీతే చాటుతున్నది. అలాంటి మహనీయుడు ఎవడైనా ఉంటే స్వయంతీర్ణః పరాంస్తారయతి. తాను తరించి ఒకరిని తరింపజేయగలడు. జిజ్ఞాసువులమైన మనం కూడా అలాంటి మహాత్ముణ్ణి గురు భావంతో సేవించి అతడుపదేశించిన మార్గంలో ప్రవర్తించ వలసి ఉంది.

సద్గురు రూపుడైన ఆ మహా గణేశుడెలా ఉంటాడని అడిగితే-లోకోత్తరమైన ఆ లక్షణాలను వర్ణిస్తున్నదీ శ్లోకం.

శుక్లాం బరధరం విష్ణుం- శశి వర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్-సర్వ విఘ్నోప శాంతయే.

శుక్లమైన అంబరాన్ని ధరించేవాడు శుక్లాంబరధరుడు. శుక్లమైన అంబరమంటే తెల్లని వస్త్ర మని కాదు. రజస్తమో రహితమైన పరిశుద్ధమైన ఆత్మ జ్ఞానం. అలాంటి పారమేశ్వరమైన జ్ఞానాన్ని ధరించిన వాడని అర్థం. విష్ణుం. వ్యాపించేదని అర్థం. శరీరంమేరకే గాక సర్వత్రా తన స్వరూపమే పరచుకొని ఉన్నట్టు దర్శించే వాడు. శశి వర్ణం. శశి అంటే చంద్రుడు. అది మరేదోకాదు మనస్సే. మనోతీతమైన దశలో ఉంటూనే అప్పుడప్పుడు మనో మార్గానికి దిగి వచ్చి బోధ చేసేవాడని భావం. చతుర్భుజం. అలా బోధచేసే సామర్థ్యాన్ని సూచిస్తున్నదీ మాట. ధర్మ జ్ఞాన వైరాగ్య ఐశ్వర్యాలనే



www.advaitavedanta.in

సిద్ధి చతుష్టయాన్ని భుజించే వాడు. అంటే అనుభవించే వాడెవడో వాడే చతుర్భుజుడు. అలాగే ప్రసన్న వదనం. తనకే పరమాత్మ తత్త్వం ప్రసన్నమైందో దానిని వదనం. సాధకులకు చెబుతూ పోయేవాడని అర్థం. ఇలాంటి లక్షణాలు గలవాడే మహా గణేశుడు. ఆయనే మహా గురువు మనబోటి శిష్య కోటికంతటికీ. అలాంటి సద్గురువును ఆశ్రితుడైన శిష్యుడు సదా ధ్యాయేత్. ధ్యానించాలి. ఎందు కోసం. సర్వ విఘ్నోపశాంతయే. సర్వ విఘ్నాలు మరేవో కావు. ఈ సంసారమే. దీనికి ఉపశాంతి బ్రహ్మజ్ఞానం వల్లనే. మరి దేనివల్లా కాదు. కనుక అలాంటి ప్రయోజనాన్ని అర్థించిన ప్రతి ముముక్షువైన సాధకుడూ అలాంటి ఆచార్య పురుషుణ్ణి శ్రద్ధతో సేవించాలని తాత్పర్యం.

ఏతావతా తేలిన సారాంశ మేమిటి. మహాగణేశ్వరుడనే గురువును సేవించి శివ సాయుజ్య మార్గాన్ని గుర్తించి విమర్శ రూపమైన బుద్ధితో ప్రకాశ రూపమైన సిద్ధిని పొందగలగాలి సాధకులమైన మనమంతా.

ప్రకాశామర్శ హస్తాభ్యాం- అవలంబ్యోన్మనీ స్రువం

ధర్మాధర్మ మల స్నేహం- పూర్ణ వహ్నౌ జుహోమ్యహం.

అని లోకానికంతా చాటి చెప్పిన శివాద్వయ వాదుల సుభాషితం జీవితాంతమూ అనుసంధానం చేస్తూ పోవాలి. మానవ జీవితమే ఒక మహా యజ్ఞం. దానికి యజ్ఞ కుండం అను క్షణమూ ప్రజ్వలించే ఆత్మచైతన్యమే. దానిలో హోమం చేయవలసిన హవిస్సు ధర్మాధర్మ రూపమైన సంసారమే. వాటి మలం అనాది సిద్ధమైన

అవిద్య. దానిని ఉన్మనీ భావమనే స్రువంలో పోసి ప్రకాశమూ విమర్శా అనే రెండు హస్తాలతో పైకెత్తి జ్ఞాన వహ్ని కుండం లోనే నిత్యమూ హోమం చేస్తూ పోవాలని అర్థం. అలా చేస్తూ పోతే అనాత్మ భావమంతా భస్మీభూతమై శివాత్మభావమే మనకు దక్కుతుంది. సమస్తమైన నామ పారాయణ ఫలం కూడా అయత్నంగానే మనకు సిద్ధిస్తుంది.

శివ శ్శబ్దః శివోహ్యర్థః- శివస్సర్వమిదం జగత్
శివాదన్యత్ యదాభాతి- తదప్యాకలయే శివం.

Brahmasri Yallamraju Srinivasa Rao www.advaitavedanta.in